సిద్ధార్థ

హెర్మన్ హెస్సీ

అశ్వినీకుమార్

సిద్ధార్థ

జర్మన్ మూలం:

హెర్మన్ హెస్సీ

ఆంగ్లానువాదం:

హిల్డా రోస్నర్

తెలుగు సేత:

వల్లభనేని అశ్వినీకుమార్

SIDDHAARTHA

© V. ASWINI KUMAR

Second Edition : **14^{h} October, 2018**

Copies : **2,000**

Price : ₹ **100/-**

AK PublicationS

Cell : 939-343-6969

For Copies :

Misimi Monthly
2nd Floor, Kala Jyothi Process Private Limited,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad,
HYDERABAD-500020.
Ph : 040 - 27645536, 994 951 6567.

Printed at :
Kala Jyothi Process Private Limited,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad,
HYDERABAD-500020.
Ph : 040 - 27611426.

తాత్విక ప్రయాణం

ఉన్నత అభిరుచిగల ఏ పాఠకుడినైనా తాను చదివినవాటిలో 10 ఉత్తమ పుస్తకాలు చెప్పమంటే అందులో తప్పనిసరిగా ఉండే పుస్తకం Herman Kar Hesse అనే జర్మన్ రచయిత వ్రాసిన 'సిద్ధార్థ'. భారతీయ నేపథ్యంతో హెర్మన్ హెస్సీ ఆ నవలను వ్రాయటంలో ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. దానికి అనేక కారణాలున్నాయి. అతని మాతామహులైన Herman Gurdert. భారతదేశంలో చాలాకాలం క్రైస్తవ మిషనరీలో పనిచేశారు. అంతేకాకుండా మళయాల భాషకు వ్యాకరణం వ్రాశారు. Malayalam to English డిక్షనరీను వ్రాశారు. హెస్సీ 1877 వ సంవత్సరంలో జర్మనీలో జన్మించాడు. వారసత్వంగా వచ్చిన Baltic Heritage అతనిని తీర్చిదిద్దింది. హెస్సీకి తెలివితేటలేకాదు తలబిరుసుతనం కూడా ఉండేది. తాతగారు మూడు భాషలలో పండితుడు కావడం, దేశదేశాలు తిరగటంతో హెస్సీ చిన్నతనం నుంచి తాను ఏ దేశపు ఎల్లలకు చెందని విశ్వమానవునిగా తలపోశాడు. 1890 నుంచి తాను రచయిత కావాలని అభిలషించాడు. గ్రీకు మైథాలజీ, జర్మన్ రచయిత గోథే, రచనలు ప్రభావం చూపాయి. 1895 వ సంవత్సరంలో ప్రముఖ తత్వవేత్త నీషే వ్రాసిన రచనలను చదివాడు. నీషే చెప్పిన Dual impules of passion and order on human kind అతన్ని ప్రేరేపించింది, ఆలోచింపజేసింది.

అతని తదుపరి రచనలన్నిటిలో ఈ ద్వంద్వ వైఖరి కానవస్తుంది. దృష్టిదోషం, నరాల బలహీనత ఉండటంతో తానాశించినట్లు సైన్యంలో చేరలేకపోయాడు. గేయాలు వ్రాయగా వచ్చిన పారితోషికాలతో జీవించాడు. 1904లో అతను వ్రాసిన Peter Camenzind అన్న రచన ఎందరినో ఆకర్షించింది. ఫ్రాయిడ్ అది తాను మెచ్చిన అభిమాన రచన అన్నారు. హెస్సీ 1895వ సంవత్సరం నుంచి షోపెన్ హోవర్ ప్రభావానికి లోనయ్యాడు. అదే సమయంలో అతన్ని బౌద్ధం ఆకర్షించింది. 1911 వ సంవత్సరం శ్రీలంక, ఇండోనేషియా, సుమిత్ర, బోర్నియో బర్మా దేశాలను సందర్శించి బౌద్ధాన్ని ఆకళింపుజేసుకునే ప్రయత్నం చేశాడు. ఎన్నో తర్జన భర్జనలకు గురై 1922వ సంవత్సరంలో *సిద్ధార్థ* అనే మాస్టర్ పీస్‌ను పాఠకులకు అందజేశాడు. 'ఎవరికి తోచిన రీతిలో వారు భగవంతుని కనుగొంటారు. మా తల్లిదండ్రులు క్రైస్తవ మతస్థులుగానే కాదు నిజమైన క్రైస్తవులుగా జీవించారు. నన్ను నా వ్యక్తిత్వాన్ని మలచటంలో క్రైస్తవ మత ప్రభావం చాలా ఎక్కువ'ని పేర్కొన్నాడు. 1946వ సంవత్సరంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. 1962వ సంవత్సరంలో తన 85 సంవత్సరాల వయసులో స్విట్జర్లాండ్‌లో తనువు చాలించాడు.

సిద్ధార్థ పుస్తకాన్ని హెస్సీ జర్మనీ భాషలో వ్రాశాడు. దీనిని రెండు అధ్యాయాలుగా విభజించి మొదటి అధ్యాయాన్ని రోమా రోలాకు రెండవ అధ్యాయాన్ని తన జ్ఞాతి అయిన Wilhelm Gundertలకు అంకితం చేశాడు. 1957 వ సంవత్సరంలో హిల్డా రోస్‌నర్ ఆంగ్లంలోకి అనువదించారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా అనువాదాలు వచ్చాయి. తెలుగులో మొదటిసారిగా రాజగోపాల్ అనువదించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత వల్లభనేని అశ్వినీకుమార్ అనువదించారు. ఇప్పుడు రెండవ ముద్రణ విడుదలైంది. జాన్ రస్కిన్ చెప్పినట్లు ఇది 'బుక్ ఆఫ్ ఆల్ టైమ్'. 100 పేజీలకు మించని ఈ పుస్తకం చదవడానికి గంటన్నర, రెండు గంటలు సమయం తీసుకోవచ్చు. కానీ చదివిన తరువాత పుస్తకంలోని కథ, అందులోని పాత్రలు ఆరోజేకాదు, కొన్ని రోజులపాటు మనల్ని వెంబడిస్తాయి. ఆ విధంగా పాఠకుణ్ణి వెంటాడి, వేటాడి, ఆలోచింపజేయటమే ఉత్తమ క్లాసికల్ రచన లక్ష్యం.

అశ్వినీ చాలా స్వతంత్ర రచనలు చేశారు. సిద్ధార్థ వ్రాసిన తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకుని చార్లీచాప్లిన్‌తో మొదలుపెట్టి చాలా అనువాదాలు చేశారు. విచిత్రమైన విషయమేమిటంటే స్వంత ఆలోచనలు, నిర్దిష్ట భావాలుగల వారు చేసే అనువాదాలలో కొంత క్లిష్టత, అక్కడక్కడా అన్వయ రాహిత్యం కనిపిస్తుంది. కొన్నిచోట్ల మక్కికి మక్కీని దించటంతో ఈ క్లిష్టత జటిలమవుతూ ఉంటుంది. అశ్వినీది అనువాదం అనటం తప్పు – అది అనుశీలన, అనుసృజన కావటంవల్ల శైలి ఎక్కడా రాజీపడకపోవటంతో పాఠకుడు చాలా సులువుగా, వేగంగా చదవగలుగుతాడు.

సిద్ధార్థ అన్నది గౌతమ బుద్ధుని కథ కాదు. బుద్ధుని కాలంలో అదే పేరుగల మరొక బ్రాహ్మణ యువకుని తాత్విక ప్రయాణం. ఆ ప్రయాణంలో బ్రహ్మచారిగా, శ్రమణునిగా, వ్యాపారస్థునిగా, శృంగార పురుషునిగా, విరాగిగా, పడవ నడిపేవానిగా, చివరకు తాత్త్వికునిగా మారతాడు. అతి తక్కువ పాత్రలతో కథ నడుస్తుంది. సహచరుడు గోవిందుడు, శృంగార దేవత కమల, వ్యాపారి కామస్వామి, పడవ నడిపే వాసుదేవుడు, వీరితోపాటు అతి ముఖ్యపాత్రగా 'ప్రవహించే నది' కానవస్తాయి. ప్రతి ఒక్కరి నుంచి సిద్ధార్థుడు ఒక్కో జీవిత సత్యం తెలుసుకుంటాడు. చదివేకొలదీ ఆలోచనను, ఆనందాన్ని ఒకేసారి కలగజేస్తుంది. మానవుని అంతరంగంలో రూపుదిద్దుకునే అశాంతి, దానితో పెరిగి పెద్దయ్యే చిత్తక్షోభ, దాని నుంచి విడుదల కోసం చేసే ప్రయత్నంలో జరిగే అంతర్‌శోధన, అంతరాత్మ మథనం ఇందులోని కథావస్తువు. అందమైన పదాలను తగు రీతిలో పొదిగి ఒక Austerity structure ను form చేయటం అశ్వినీ ప్రత్యేకతని పాఠకులందరికీ తెలుసు. తిక్కన మహాభారత అనువాదంలా ఈ సిద్ధార్థ అనుశీలన మూలానికి కొత్త అందాలను తీర్చింది.

– కాండ్రేగుల నాగేశ్వరరావు

మీరు పఠించబోయే ఈ పుస్తకం ఒక విలక్షణమైన బుద్ధిజీవుని తపన.

బ్రాహ్మణ నిత్య కర్మలలో పెరిగి, అరణ్యాలలో సన్యాసి జీవనం గడిపి, బుద్ధుని బోధనలను కూడా వదలి మనోమార్గంలో పయనించి, కోర్కెల నిప్పుల దారిలో త్రొక్కిసలాడి, చివరికి శాంతిని, ఆనందాన్ని, ఒక నదీ ప్రవాహంలో, అంతర్లీనంగా ఒక పడవ సరంగు జీవనంలో, ప్రకృతిని పరమాత్మను అద్వైతరూపంలో దర్శించి నిర్వాణ పథంలో నడిచిన ధీరోదాత్తుని కథ!

సిద్ధార్థ : ఒక ప్రేరణ, ఇది ఒక ఐడెంటిఫికేషన్ : ఒక ప్రయాణం, ఒక యాతన, ఒక తపన, ఒక తపస్సు, ఒక యజ్ఞం, ఒక యజ్ఞఫలం!

రెండు మహోన్నత ధర్మాలను, విశ్వాసాలను ఔపోసనపట్టి, అద్వైతపరచి, మానవ జీవితానికి అనుసంధానంచేసి, విమర్శించి, విడమరచి, ఏకీకరించి – మనిషి చీకటి దారిలో వెన్నెల పోసిన గ్రంథకర్త ఒక నిత్యాన్వేషి.

తానే ఒక సిద్ధార్థ!

ఆ వెన్నెల బొమ్మే ఈ తెలుగు సేత!

మున్ముందుగా అపురూపమైన మూలప్రతిని అందజేసి “మీరు చేయగలరు”
అన్న అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారి ప్రోత్సాహం,

అసంపూర్తిగా అందించినా, నిశితంగా పరిశీలించి
యార్లగడ్డ బాలగంగాధరరావుగారు వేసిన పూర్తి మార్కులు,

‘హాయిగా నడిచింది, పూర్తిచేయండి’ అని పురాణపండ రంగనాథ్‌గారి
చిరునవ్వు పూలచెండు తాకిడి,

‘తెలుగుసేత’ పూర్తిగా చదివి ‘ఏదీ అసలు ప్రతీ’ అని అదీ చదివి,
వేగుంట మోహన్‌ప్రసాద్‌గారు చేసిన చక్కని రిమార్కులు,

ఆలస్యంగానే ‘సిద్ధార్థ’ను ఒకరకమైన వణుకుతో ఆయన చేతికి
అందించినపుడు సంక్రాంతి పర్వదినాల్లో చదివి, పరవశించి నన్ను
అభినందించిన తీరు, నిండు సభలో ఈ ప్రస్తావన చేసి ఇది ‘తెలుగు సేత’
కాదు ‘తెలుగు రాతే’ అని అందరికీ, తెలియపరిచిన
బేతవోలు రామబ్రహ్మంగారి ప్రేమాతిశయం!

మౌనంగా నా రాతకు అందాలు దిద్దిన సుందరి చూపులు, ఎప్పుడూ
ఆలస్యంగా వెళ్ళి అక్షరాలను సరిచేయమని విసిగించినా అలసిన నవ్వుతో
మన్నించిన సాయంత్రపు స్వేదగంధం,

ఈ రెండవ ముద్రణకు వేములు రాణి అందించిన సహకారం,

ఈ ‘సిద్ధార్థ’ను వెలుగులోకి తెస్తున్న ***మిసిమి*** యాజమాన్యపు ఔదార్యం...

ఈ ‘యజ్ఞఫలానికి’ హవిస్సులే...

నిర్వాణ పథం

1. బ్రాహ్మణ కుమారుడు 1

2. శ్రమణులతో 9

3. గౌతముడు 19

4. మేల్కొలుపు 27

5. కమల 31

6. జనంతో 43

7. సంసారం 51

8. నది 61

9. పడవ సరంగు 67

10. కొడుకు 75

11. ఓమ్ 81

12. గోవింద 85



బ్రాహ్మణ కుమారుడు

బ్రాహ్మణ కుమారుడు

ఆ ఇంటి నీడలో, నీరెండ వేడిలో, నది ఒడ్డున నీటి అంచుల్లో, రావిమాను లేచిగుళ్ల వెలుగు నీడల్లో సిద్ధార్థ సలక్షణంగా పెరిగి పెద్దవాడయ్యాడు!

నదిలో ఉదయం, అతను సంధ్యావందనం చేస్తున్నప్పుడు అతని సుకుమారమైన చేతులు ఎండకు కందిపోయేవి. మావితోటలో ఆటల్లో ఏవో నీడలు అతని విశాలమైన నేత్రాలను వెన్నాడేవి. అప్పుడే అమ్మ పాడే పాటలు అతని చెవి సోకేవి. అతని తండ్రి వల్లెవేసే వేదాలు, ఉపనిషత్తులు అక్కడ ఉన్న జ్ఞానులతోపాటు అతనికీ సంగ్రహమయ్యేవి! పెద్దల సంభాషణలు, తర్కవితర్కాలు, మీమాంసలు అతనికి, సహచరుడు గోవిందకూ నిత్యకృత్యాలయ్యాయి. నిరంతరాలోచన, నిశ్చల ధ్యానమూ అభ్యాసమైంది! సిద్ధార్థ, నిశ్శబ్దంగా, ఓంకార శబ్దాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాల లయబద్ధంగా, ఉచ్చరించేవాడు. అప్పుడు అతని ఫాలభాగం ఒక వింత వెలుగుతో నిండిపోయేది. అతడు అంతరాత్మను దర్శించి అనంతమైన విశ్వాంతరాళంతో మమేకమౌతున్నాడా అనిపించేది!

సలక్షణంగా, సర్వాంగసుందరంగా, జ్ఞానతృష్ణతో తనయుడు విజ్ఞానవంతుడైన యువకునిగా వృద్ధిచెందుతుంటే తండ్రి హృదయం ఆనందంతో పొంగిపోయేది.

సిద్ధార్థుని ప్రతి కదలిక, ప్రతి విన్యాసం, అతని చిరునవ్వు, మెరిసే కనుదోయి చూసి తల్లి మనసు ఉప్పొంగేది! అతని పిలుపుతో కరిగిపోయేది! సాటి బ్రాహ్మణ యువతులు, ఈ సుందరాకారుడు అక్కడి వీధుల్లో నడయాడుతుంటే, అతని విశాల నేత్రాలను, ఆజానుబాహువులను, రాజఠీవిని చూసి మురిసిపోయి మనసుపడేవారు!

గోవిందుడు! సిద్ధార్థునిలో గోవిందుడు ప్రేమించని అంశమేలేదు. అతని కనుదోయి, తీయని కంఠస్వరం, అతని నడకలోని రాజసం, ప్రతి కదలికలోని లాస్యం, అన్నిటినీమించి అతని బుద్ధికుశలత, సున్నితమూ, గాఢము, అయిన అతని ఆలోచనలు, దృఢచిత్తము, పరిశ్రమ ఇవన్నీ అతణ్ణి ముగ్ధుణ్ణి చేసేవి! గోవిందుడు 'నేను మామూలు బ్రాహ్మణ యువకునిగా, కర్మకాండలు, క్రతువులు చేసే సోమరిపోతుగా, ధనాశతో మంత్ర తంత్రాలు జపించే వదరుబోతుగా, గుంపులో ఒకడిగా కాజాలను. నేను సిద్ధార్థను అనుసరిస్తాను. అతనే నాకు ప్రాణం. అతని పథమే నాకు అనుసరణీయం. నేనే ఆ తేజోమూర్తికి నీడమాత్రపు జాడ!' అని నిర్ణయించుకున్నాడు.

అందరూ సిద్ధార్థను ప్రేమించారు. అతని ఉనికే అందరికీ ఉల్లాసం, సంతోషం.

అయితే సిద్ధార్థ?! అతను ఆనందంగా ఉండలేకపోతున్నాడు. పూదోట దారుల్లో అశాంతిగా తిరుగాడుతున్నాడు. రావి మాను లేత నీడల్లో పరధ్యానంగా ఉంటున్నాడు. అనుదినమూ సలిపే పవిత్ర స్నానాల్లో అర్ఘ్యవిధులతో అతనికి ఆనందం కలగటంలేదు. అతని హృదయం అల్లకల్లోలమవుతోంది. నదిలోని అలల్లా రాతిరి తారకల తళుకు కాంతులు – పగటి వెలుగు వెచ్చని కిరణాలు అతని కలల్ని, ఆలోచనల్ని అల్లకల్లోలం చేస్తున్నాయి.

హోమగుండాల హవిస్సుల సాంద్రధూమ వలయాలు, యజుర్వేద నిత్యఘోష, వృద్ధ బ్రాహ్మణులు వల్లెవేసే సామవేద పారాయణం – అతన్ని అశాంతికి గురిచేస్తున్నాయి!

అతని అంతరాళంలో ఏదో అశాంతి రాజుకుంటోంది. తన తండ్రి ప్రేమ, తల్లి మమకారం, గోవిందుని అభిమానం – ఇవన్నీ తనని ఆనందింప చేయలేకపోతున్నట్లు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నాడు. మానసిక తృప్తి, ప్రశాంతి పొందలేకపోతున్నట్లు గ్రహించాడు. ఇప్పటికే తన తండ్రి, తన గురువులు వారి శక్తిమేరకు తమ విజ్ఞానాన్ని, వివేకాన్ని తన జీవన పాత్రలో ఒంపారని గుర్తించాడు. కాని ఇంకా అది నిండలేదే? తన మేధ ఇంకా సంతుష్టి చెందలేదే? తన ఆత్మకు ఈ అశాంతి ఏమిటి? తన మనసు స్థిమితంగా లేదే? ఈ పవిత్ర స్నానాలు హాయిగానే ఉన్నాయి. కాని ఇవి నీరు మాత్రమేనా? ఇవి పాపాలను ఎలా

కడిగివేస్తాయి? అశాంతిలో వేగిపోయే హృదయాన్ని ఉపశమింపచేయలేవా? దేవతలకు చేసే యజ్ఞయాగాదులు, నైవేద్యాలు అద్భుతంగా ఉంటున్నాయి. కాని ఇదే సర్వమా? ఈ క్రతువులు క్రాంతినిస్తాయా? మరి దేవుళ్ళ మాటేమిటి? ఈ సృష్టికి మూలం ప్రజాపతేనా? మరి ఆత్మ ఏమిటి? ఆత్మ సర్వస్వమైతే, ఈ దేవుళ్ళెవరు? వారు మనలాగే అశాశ్వతులేగా. అయితే వారికీ పూజా క్రతువులెందుకు? వారికి కాకపోతే ఎవరికి అర్పించాలి? అయితే పరమాత్మ ఒక్కడేనా? ఈ ఒకే ఒక్కడు ఎక్కడుంటాడు? ఎలా ఉంటాడు? ఏ విధంగా కనుగొనాలి? అతని నిరంతరాత్మ ఎలా స్పందిస్తుంది? అంతరాత్మలో, ప్రతి వ్యక్తి అంతరాత్మలో, ఈ పరమాత్మ స్పందించకపోతే మరి వేరెక్కడ దీని అస్తిత్వం? రక్తమాంసాదులు, ఆలోచన, అంతఃస్పృహ లేని ఈ అంతరాత్మ – ఇదేగా జ్ఞానులు బోధించేది? అయితే ఇది ఎక్కడ ఉంది? ఆత్మను, అంతరాత్మను, పరమాత్మను అన్వేషించాలంటే ఏదైనా మార్గం ఉందా? ఇంతవరకు ఎవ్వరూ చూపలేదే? ఎవరికీ తెలియదా?

జ్ఞానవంతుడు విద్యావంతుడైన తన తండ్రి, గురువులు, వివేకవంతులైన బ్రాహ్మణులు, ఎవరూ, చివరికి ఏ ఉపనిషత్తులు ఉపదేశించలేదే? ఈ పవిత్ర గ్రంథాలకు, ఈ బ్రాహ్మణోత్తములకు అన్నీ తెలుసు. అన్నింటిని శోధించారు. ఈ ప్రపంచాన్ని, ఈ సృష్టిని, వాచకాన్ని, ఆహారాన్ని, ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని, జ్ఞానేంద్రియాల్ని, దేవతల బాధ్యతల్ని అన్నీ అధ్యయనం చేశారు. సర్వస్వమూ పరిశోధించి, పరిశీలించారు. కానీ ముఖ్యమైన, ఎంతో ముఖ్యమైన విషయం వదిలి ఇవన్నీ అవసరమా?

సామవేదం, "నీ ఆత్మ – అదే ఈ ప్రపంచం! నీవు నిద్రించేటప్పుడు నీ అంతరాత్మను దర్శిస్తావు?" అంటుంది. ఈ మాటల్లో ఎంతో జ్ఞానం ఇమిడివుంది. తరతరాలుగా మునివరులు ప్రోది చేసిన ఈ జ్ఞాన నిక్షేపాల్ని కాదనలేము. కానీ ఈ మౌనులు, ఋషులు, ఈ జ్ఞానసమపార్జన చేసిన మహాత్ములు ఎవరైనా దీని 'అనుభూతి'ని పొందగలిగారా?

నిద్రావస్థలో ఆత్మను దర్శింపగలిగిన మహాత్ములు జాగరూకులై ఉన్నప్పుడు ఈ ఆత్మదర్శనం ఎందుకు పొందలేకపోతున్నారు?

సిద్ధార్థునికి తెలిసి ఎందరో మహానుభావులు! మహాసాత్త్వికుడైన తన తండ్రి, అతని నిష్ఠ, నిబద్ధ జీవితం, ఉత్తమాలోచనలతో, నిత్య ధ్యానంలో గడిపే తన తండ్రి, ప్రశాంతుడై ఉన్నాడా? ఆయన హృదయం పరమానందంగా ఉన్నదా? ఈయన కూడా అన్వేషి కాడా? అసంతృప్తితో అనంత తృష్ణతో పవిత్ర జలాలలో స్నానాదికాలు సలపటంలేదా! క్రతువులు సమావేశాలు తర్కసంభాషణలు నిత్యమూ జరపటంలేదా? తన తండ్రిలాంటి నిర్మల హృదయునికి నిష్ఠాగరిష్ఠునికి ప్రతిదినమూ పాపప్రక్షాళన కోసం నదీజలాల్లో సంధ్యావందనాలు ఎందుకు? అంటే ఆయన అన్వేషించేది ఆయనలో లేదా? ఈ మూలాధారము ఆయన హృదయంలో లేదా? ఈ ఆదిశక్తిని కనుగొనాలి. ఈ మహాత్రాణ నీలోనే ఉండాలి. లేకపోతే మిగిలేది అన్వేషణే. అది ప్రక్కదారే, తప్పుదారే!

ఇవీ, సిద్ధార్థుని ఆలోచనలు. ఇది అతని తీరని దాహం, అతని తపన. అతని ఆవేదన! ఛాందోగ్య ఉపనిషత్తు 'సత్యమే బ్రహ్మము. ఇది అవగాహన అయితే, భగవత్సన్నిధానం అందుబాటులోనే ఉంటుంది' అంటోంది.

అతనికి ఆ అలౌకిక ప్రపంచం దగ్గరైనట్లు అప్పుడప్పుడు అనిపిస్తుంది. కాని అతను అందుకునే స్థితికి చేరలేకపోతున్నాడు.

తన గురువులు తనకు తెలిసిన జ్ఞానులు ఎవరూ కూడా ఆ అలౌకికానందాన్ని పొందినట్లు చెప్పలేకపోతున్నారు.

సిద్ధార్థుడు ఒక్కసారిగా "గోవిందా! రా, నాతో రా. ఈ మర్రిచెట్టు నీడలో ధ్యానం చేద్దాం" అన్నాడు. మరోమాట లేకుండా గోవిందుడు అనుసరించాడు. ఇరవై అడుగుల దూరంలో కూర్చొని ఓంకార శబ్దాన్ని "ఓంకారం శరాసనమై ఆత్మ శరమై బ్రహ్మను చేరాలి. ఇదే నా ధ్యేయం" అంటూ ధ్యానమారంభించాడు.

సాయం సమయానికి గోవిందుడు ధ్యానం చాలించి లేచాడు. సంధ్యావందనం, అర్ఘ్యాదులకు సమయమాసన్నమయింది. 'సిద్ధార్థా' అని పిలిచాడు గోవిందుడు.

సిద్ధార్థుడు పలకలేదు. ధ్యాననిమగ్నుడైన అతని నయనాలు అర్ధనిమీళితాలై అనంత దూరంలో అగుపడని ధ్యేయాన్ని తదేకంగా వీక్షిస్తున్నట్లున్నాయి.

అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా ఆగిపోయినట్లు నిశ్చలంగా ఉన్నాడు. అతను నిశ్శబ్దంగా గానం చేసే ఓంకార మంత్రం వలయంలా అతని చుట్టూ మార్మోగుతోంది! బ్రహ్మలోక పరితప్తుడై ఆత్మశరసంధానకర్తలా పద్మాసన విన్యాసంలో ప్రశాంతంగా వెలుగుతున్న సిద్ధార్థుణ్ణి చూసి గోవిందుడు ఆశ్చర్యపోయాడు.

అంతకు పూర్వం సన్యసించి, దేశాటన చేస్తున్న ముగ్గురు శ్రమణులు సిద్ధార్థుని ఊరికి వచ్చి వెళ్ళారు! వీరు ముగ్గురూ, చివికిపోయిన గుడ్డపీలికల్లా ఉన్నారు. మధ్యవయస్కులే, ధూళి, రక్తం ఓడుతున్న శరీరాలతో ఆచ్ఛాదన లేని దేహాలతో ఎండ వేడికి బడలి వడలిన శరీరాలతో, ఒంటరిగా, వింతగా జాగరూకులై జనంలో తిరుగుతున్న జాగిలాల్లా కనిపించారు! వారి చుట్టూ ఒక నిర్మల దీనావస్థ పరిభ్రమిస్తున్నట్లుండేది. ఒక అత్యవసరమైన విస్ఫోటనం జరుగబోతున్నట్లు, వారు అందుకే నిర్దాక్షిణ్యమైన ఆత్మవైరాగ్యాన్ని ఆశ్రయించినట్లు ద్యోతకమయ్యేది.

"గోవిందా! రేపటి ఉదయం నేను శ్రమణుల వద్దకు వెళ్తున్నాను. సిద్ధార్థుడు సన్యసిస్తున్నాడు!"

సహవాసి మాటలకు గోవిందుడు తెల్లబోయాడు. శరాసన విముక్తమైన బాణంలా అతని నిర్ణయం, తిరుగులేని నిశ్చయాన్ని విని, అతని ముఖారవిందాన్ని గమనించి "అవును, ఇప్పుడే మొదలైంది గమనం. ఏ దారులు, ఏ గమ్యాలకు దారితీస్తాయో! మిత్రమా, నీతోనే నేను. నీ గమ్యమే నాది కూడా" అనుకుంటూనే మరింత పాలిపోయాడు గోవిందుడు.

"... నీ తండ్రి అనుమతిస్తాడా..."

దుఃఖార్తితో గోవిందుడన్నాడు.

సిద్ధార్థుడు అప్పుడే నిద్ర మేల్కొన్నట్లు అతన్ని తేరిపారా చూశాడు. గోవిందుని హృదయాన్ని, ఆందోళనను, ఆవేదననూ క్షణంలో పసిగట్టాడు. "మనం కాలయాపన చేయవద్దు. రేపు ఉదయమే శ్రమణ ప్రయాణం."

సరాసరి, తండ్రి కూర్చొని ఉన్న గదిలోకి ప్రవేశించాడు. తుంగచాపమీద పద్మాసనంలో ఉన్న అతని వెనుకనే నిలబడ్డాడు. అతని ఉనికిని తండ్రి ఎప్పుడు

గమనించాడో "నీవేనా నాయనా? ఏమి చెప్పాలని వచ్చావు?" అని ప్రోత్సహించాడు.

"మీ అనుమతితో, మీతో చెప్పేందుకే వచ్చాను. రేపు ఉదయం, ఈ ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. సన్యసించి శ్రమణ జీవితంలో ప్రవేశిస్తాను. అడ్డు చెప్పరనే పూర్తి నమ్మకంతోనే."

సిద్ధార్థుని స్వరం సర్వమూ వ్యాపించింది. ఆ రెల్లుగడ్డి గోడలు దాటి చరాచర ప్రపంచంలో ప్రవేశించింది. అతని స్వరాన్ని ఆలకించటానికా అన్నట్లు ఆకాశంలోని చుక్కలు ఆ గది చిన్న కిటికీలో నుంచి తొంగిచూస్తున్నాయి. అలా ఎంత సమయం గడిచింది? ఇప్పుడంతా నిశ్శబ్దంగా ఉంది. కిటికీలో నుంచి కనపడే చుక్కల రాశి మారిపోతున్నది. ఆ బ్రాహ్మణోత్తముడు కొడుకుని చూశాడు! చేతులు కట్టుకుని స్థిరంగా నిలబడి ఉన్న సిద్ధార్థుణ్ణి మార్చిమార్చి చూశాడు.

"బ్రాహ్మణులు ఆగ్రహపూరితమైన దుర్భాషలు చేయరాదు. కానీ నా హృదయం ఆక్రోశిస్తుంది. ఈ ప్రస్తావన మరోమారు తేవద్దు..."

తండ్రి మెల్లగా లేచాడు. సిద్ధార్థుడు మౌనంగా నిలబడి ఉన్నాడు.

"ఎందుకు ఇంకా నిలబడి ఉన్నావు?" తండ్రి.

"ఎందుకో మీకు తెలుసు..." సిద్ధార్థుడు.

అసంతృప్తిగా అతని తండ్రి ఆ గది వదలి శయనాగారానికి వెళ్ళాడు. నిద్ర పోవటానికి విశ్వ ప్రయత్నం చేశాడు. లేచి అశాంతిగా తిరిగాడు.

సిద్ధార్థుడు నిలబడి ఉన్న గదిలోకి, చిన్న కిటికీలో నుంచి చూశాడు.

సిద్ధార్థ స్థిరంగా చేతులు కట్టుకుని నిలబడే ఉన్నాడు.

తండ్రి హృదయం తల్లడిల్లింది.

మళ్ళీ నిద్రపోవటానికి ప్రయత్నించాడు. అతని వలన కాలేదు. ఇంకోసారి, మరి కొంత సమయం గడిచిన తర్వాత ఆ చిన్న కటికీలో నుంచి సిద్ధార్థుణ్ణి చూశాడు. అలాగే ఆ చీకటిలో, ఆ చుక్కల వెలుగులో, ఆ రాత్రి చివరిలో అలాగే నిలబడి ఉన్నాడు.

ఎంత సమయం, ఎంత రాత్రి గడిచిపోయిందో సిద్ధార్థ అంతే స్థిరంగా నిలబడి ఉన్నాడు.

తండ్రి హృదయం ఆగ్రహంతో ఉడికిపోయింది. భయంతో వణికిపోయింది. బాధతో ద్రవించి పోయింది. మెల్లగా సిద్ధార్థ దగ్గరకు వచ్చాడు. అతనికి తన తనయుడు అన్యుడుగా తోచాడు. ఎంతో ఉన్నతంగా కనిపించాడు! ఎక్కడో చంద్రవంక ఆకాశంలో వ్రేలాడుతోంది! తండ్రి అడిగాడు "ఎంతసేపు నిలబడతావు?" అని.

"నిలబడే ఉంటాను, వేచి ఉంటాను."

ధ్యానమగ్నుడైన సిద్ధార్థ

"అలసిపోతావు సిద్ధార్థా..."

"అవును, అలసిపోతాను"

"నిద్రపోతావు..."

"నేను నిద్రపోను, వేచి ఉంటాను"

"చనిపోతావేమో?"

"పోవచ్చు!"

"అయితే నా ఆజ్ఞ కాదని నీవు చనిపోవటానికే సిద్ధపడుతున్నావా?"

"లేదు, మీ మాట ఎప్పుడూ జవదాటలేదు."

"అయితే, నీ నిర్ణయం మార్చుకో."

"అలాగే; మీరు చెప్పినట్లు చేస్తాను."

తండ్రి ధృవతారను చూశాడు. ఉదయపు తొలి వెలుగు ఆ గదిలో అప్పుడే ప్రవేశించింది!

తండ్రి సిద్ధార్థుణ్ణి పరీక్షగా చూశాడు. అతని కాళ్ళు సన్నగా వణుకుతున్నాయి కానీ ముఖంలో స్థిరత్వం పోలేదు. అతని విశాల నయనాలు ఎక్కడో చూస్తున్నాయి. అప్పటికి అర్థమయ్యింది. సిద్ధార్థుడు అప్పటికే తనని, ఇంటిని వదిలివేశాడని. అతనిని ఆపడం ఇక సాధ్యం కాదని!

మెల్లగా అతని భుజాన్ని తాకి "సిద్ధార్థ, సరే, నీవు వెళ్ళవచ్చు. సన్యసించి శ్రమణ జీవితంలో ప్రవేశించు నీ ఇష్టప్రకారమే. నీకు జ్ఞానోదయం అయితే ప్రశాంతత చిక్కితే వచ్చి నాకు కూడా బోధించు.

నీకు అక్కడ కూడా భ్రమ, భ్రాంతులే ఎదురైతే తిరిగి వచ్చేయి. ఇక్కడ మన బ్రాహ్మణ విధులు నిర్వహించుదాం.

వెళ్ళు. వెళ్ళి నీ తల్లి పాదాలు స్పృశించి పయనమవు. ఉదయ సంస్కారానికి నాకు సమయమయింది."

తండ్రి సిద్ధార్థుణ్ణి వదిలి కదిలిపోయాడు! అప్పుడు సిద్ధార్థుడు కదిలాడు.

అతని కాళ్ళు మొద్దుబారి అడుగు పడలేదు. అయినా నిలద్రొక్కుకొని తండ్రికి అభివాదం చేశాడు. తండ్రి చెప్పినట్లు తల్లి దగ్గరకు వెళ్ళి అక్కడ నుంచి అప్పుడే రక్తప్రసరణ మొదలయిన పాదాలతో ఇంకా నిద్ర లేవని ఈ ఊరిని వదిలి అడవిలోకి పయనమయ్యాడు.

ఊరి చివర, ఒక ఆకారం అతన్ని వెన్నంటి అనుసరించింది.

"గోవింద?"

"అవును, మిత్రమా"

శ్రమణులు...

శ్రమణులతో

ఆ దినం సంధ్యాసమయానికి శ్రమణులను చేరగలిగారు. వారి అంగీకారంతోనే వారి సాహచర్యాన్ని, గురుత్వాన్ని స్వీకరించారు.

సిద్ధార్థ తన వస్త్రాలన్నిటినీ ఒక పేద బ్రాహ్మణునికి ఇచ్చివేశాడు. తనకంటూ ఒక గోచీ, పైన ఒక గొగ్గి ఉంచుకున్నాడు. రోజులో ఒక్కసారే తినేవాడు. అదీ కందమూలాలే. ఉపవాసం చేశాడు. రెండు వారాలు – నాలుగు వారాలు, క్రమేణా అతని శరీరంలోని కండరాలు కానరాకుండా పోయాయి. విచిత్రమైన స్వప్నాలు అతని విప్పారిన నేత్రాలలో గూడుకట్టేవి. బక్కచిక్కిన వ్రేళ్ల నుంచి గోళ్ళు పొడవుగా పెరిగిపోయాయి. ఎండిపోయిన చింపిరి గడ్డం అతని చుబుకాన్ని కప్పివేసింది.

స్త్రీలు కనపడితే అతని చూపు గడ్డకట్టేది. నాగరకులను చూస్తే అతను అసహ్యంతో మూతి ముడుచుకునేవాడు. దుకాణాల్లో వ్యాపారుల్ని, వేటకువెళ్ళే రాజకుమారుల్ని, మృతులమీద పడి దుఃఖించే బంధువర్గాన్ని, ఒంపుసొంపుల్ని ఒలకబోస్తూ విటుల్ని ఆకర్షించే వెలయాండ్రనూ, రోగుల్ని చూసే వైద్యుల్ని, ముహూర్తాలను పెట్టే పండితుల్ని, శృంగారకేళిలో తేలే ప్రేమికుల్ని, సంతానాన్ని ముద్దుచేసే తల్లుల్ని – అన్నీ, అందర్నీ చూస్తూనే ఉన్నాడు. ఇవన్నీ చూడదగిన దృశ్యాలా? తెలియవలసిన విషయాలా? అంతా నాటకం. అసత్యం, ఇంద్రియ సుఖాల ఇంద్రజాలం! ఇవన్నీ నశించేవే! అన్ని కుళ్ళిపోయేవే!

ఈ లోకం దుర్భరం. బ్రతుకు బాధామయం!

సిద్ధార్థునికి ఒకే లక్ష్యం! తన నుంచి అన్నిటినీ తీసివేయాలి. ఈ దాహాన్ని, ఈ కోరికల్ని, ఈ కలల్ని, ఈ సుఖాల్ని, ఈ బాధల్ని – అన్నిటినీ, అన్నిటినీ

వదిలించుకోవాలి. ఈ అహం అంతం కావాలి. ఈ నేను నశించిపోవాలి. అప్పుడు అతని హృదయం నిర్మలంగా, నిరామయంగా ఉంటుంది. అప్పుడు తన ఆలోచన తేటగా, అమలినంగా ఉండాలి. ఆ అనుభూతి కావాలి. అదే తన లక్ష్యం అనుకున్నాడు! ఎప్పుడైతే, ఈ అహాన్ని జయించగలుగుతాడో, నాశనం చేయగలుగుతాడో, ఎప్పుడైతే కోరికలు, ఉద్రేకాలు ఉపశమిస్తాయో అప్పుడు, అప్పుడే తన ఆత్మ మేలుకోవాలి. మాయ తెరలమాటున తన అంతరాంతరాళంలోని జీవి, తనకు తెలియని అంతరాత్మ కనువిప్పాలి. అది – అదే రహస్యం!

అందుకే ఈ 'నేను'ని పుటం పెట్టాలి. ఈ అహాన్ని అణగద్రొక్కాలి.

నిప్పులు చెరిగే ఎండలో నిలబడ్డాడు. తీక్షణమైన అహర్పతి కిరణాలు శరీరాన్ని దహిస్తున్నాయి. అతన్ని అంతులేని బాధ, దాహం అలుముకున్నాయి. అయినా భరించాడు. కొంతసేపటికి తేరుకున్నాడు. ఇప్పుడు బాధ తెలియటంలేదు. దాహం కూడా కలగటంలేదు.

కుండపోత వర్షంలో కదలకుండా ఉన్నాడు. అతని శిరస్సును మోదిన వర్షపు ధార కేశాల నుంచి, అతని భుజాల మీదుగా శరీరాన్ని మంచు ముద్దలా చేసింది. చలికి బిగుసుకుపోయాడు. అదీ కొద్దిసేపే. తర్వాత వర్షపాతం అతన్ని కదిలించలేకపోయింది. అన్ని శీతవాత తాపాలకు అతీతంగా నిలద్రొక్కుకున్నాడు.

తర్వాత వెదురు ముళ్ళ ప్రాన్పు మీద నిదురించాడు. ఒళ్ళు తూట్లుపడింది. నెత్తురు బొట్లు రాలాయి. పుళ్ళు పడ్డాయి. చర్మం కుళ్ళిపోయింది. అదీ కొంతకాలమే. అతని సహనానికి, నిశ్చలత్వానికి లౌకిక బాధలన్నీ తలవంచాయి. ఇప్పుడు ఏ ముళ్ళూ బాధించలేకపోతున్నాయి.

పద్మాసనం వేశాడు. శ్వాస బంధించాడు. మెల్లమెల్లగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నిర్దేశించగలిగాడు. తర్వాత శ్వాసించకుండా ప్రాణాయామం సాధించాడు. కనులు మూసుకుని గుండె చప్పుడు విన్నాడు. తన హృదయ స్పందనలను మొదట నామమాత్రంగా, తర్వాత నిశ్శబ్దంగా చేయగలిగాడు.

వృద్ధ శ్రమణుని ఆదేశానుసారి ఆత్మవైరాగ్యాన్ని అభ్యాసన చేశాడు. నిరంతర ధ్యానంతో వారి తంత్రాలను ఔపోసన పట్టాడు. ఓ ఎగిరే పక్షిలో ప్రవేశించి పర్వతాలపైన విహరించాడు. కారడవులపైన తారాడాడు. పక్షిలాగానే చేపలు

తిన్నాడు! పక్షి కుక్షి బాధలేమిటో తెలుసుకున్నాడు! ఆ పక్షి భాషనే పలికాడు. అలాగే బ్రతికాడు, ఆ పక్షిలాగానే రాలిపోయాడు!

అప్పుడు ఓ జంబూకపు కళేబరాన్ని ఎక్కడో తీరంలో చూసి అందులో ప్రవేశించాడు. అది అప్పటికే ఉబ్బి కుళ్ళిపోతోంది. అడవి కుక్కలు పీక్కుతింటున్నాయి. రాబందులు మిగిలిన మాంసాన్ని మాయం చేశాయి. ఇప్పుడు అస్థిపంజరమూ ఎముకలూ మిగిలాయి. అవీ మట్టిలో కలిసిపోయాయి. ఇంకా ఏమైనా ఉంటే అనంత వాయువుల్లో అంతరించాయి! మళ్ళీ సిద్ధార్థుడే మిగిలాడు!

సిద్ధార్థునికి ఈ బాధామయమైన బ్రతుకు చక్రం, జీవన్మరణాల నిరంతర కేళి తెలియవచ్చింది. అక్కడ, ఆ చావుబ్రతుకుల అంచున నిలబడి అతను తన మనోనేత్రాన్ని సారించాడు. ఇప్పుడు క్రొత్త దాహంతో ఈ లౌకిక కార్యాలకావల, నిర్వ్యాకులమైన అనంతమేదైనా గోచరిస్తుందా అని పరికించాడు!

ఇంద్రియ స్పర్శలన్నింటినీ అణచి వేశాడు. ఇంకింప చేశాడు. మనోస్మృతులన్నింటినీ మంటగలిపాడు. తనలో నుంచి తను వేరుపడి ఎన్నో రూపాలను ధరించాడు. రాయిలా, రత్నంలా, కళేబరంలా, కాష్ఠంలా, నీరులా, నిప్పులా, ఎన్నో – ఎన్నో అవతారాల నుంచి ప్రతిసారి మేల్కొనేవాడు. క్రొత్తగా నిద్ర లేచేవాడు. ఉదయమవగానే ఉలిక్కిపడేవాడు. రాత్రి అవగానే చంద్రుని వెలుగులో క్రొత్త తృష్ణతో తపించిపోయేవాడు. తృష్ణ ఏదో, తృప్తి ఏదో తెలిసేలోపే తిరిగి దాహార్తుడై మిగిలేవాడు!

శ్రమణుల సాంగత్యంలో సిద్ధార్థుడు ఎన్నో నేర్చుకున్నాడు. తన్ను తాను పుటం పెట్టుకోవటం, తన అహాన్ని అణిగించటం, బాధను కలిగించుకోవటం, భరించటం తర్వాత ఆకలిదప్పులకు అలవాటుపడటం, ధ్యానంలో నిమగ్నుడై ఆలోచనలోని రూపాలన్ని ప్రక్షాళించటం, నిరామయంగా, నిర్నిద్రగా పయనించటం తన నుంచి తను వేరుపడి వేలసార్లు నిరాశ్రయుడై చరాచర జీవుల్లో ఆశ్రయుడై తిరిగి తిరిగి, తిరిగి రావటం తప్పదని గుర్తెరిగాడు. మెరిసే ఎండలో, కురిసే వానలో, మళ్ళీ తనని తాను గుర్తించిన క్షణం తను సిద్ధార్థుడే, మళ్ళీ తానే! అయ్యో, ఈ దుస్సహమైన జీవన చక్రాన్ని ఆపేదెలా? ఈ కర్కశమైన ఇరుసు కోరల నుండి విముక్తి లేదా?

తన సహచరుడూ ప్రియమిత్రుడూ గోవిందుడెప్పుడూ ప్రక్కనే ఉండేవాడు. నీడలా వెన్నాడేవాడు. ఈ దుస్సాహసాలన్నింటినీ అతను కూడా అభ్యాసం చేశాడు. ఇద్దరు మౌనంగానే శ్రమణ జీవితాన్ని గడుపుతూ వచ్చారు. ఎప్పుడైనా భిక్షకు వెళ్ళినప్పుడు మాట్లాడుకునేవారు.

"ఏమంటావు గోవిందా? మనం ఏమైనా నేర్చుకుంటున్నామా? మన గమ్యం ఏమైనా గోచరమవుతోందా?" ఆలోచిస్తున్నట్లు అన్నాడు సిద్ధార్థ.

"ఇక్కడ మనం ఎన్నో విద్యలు, మంత్రాలు, తంత్రాలు, ధ్యానముద్రలు నేర్చుకున్నాం. ముఖ్యంగా నీవు ఎంతో వేగంగా ఇవన్నీ సాధించావు.

"వృద్ధ శ్రమణుడు ఎన్నోసార్లు నీ ప్రతిభను ప్రశంసించాడు. ఎప్పుడో నీవే పవిత్ర శ్రమణునిగా ఆవిర్భావం చెందుతావు..." గోవిందుడు అతని వెన్నంటి నడుస్తూనే చెప్తున్నాడు.

"నాకు అలా అనిపించటంలేదు మిత్రమా! ఇన్నాళ్ళూ ఇక్కడ నేర్చిన విద్యలు, విన్యాసాలు మనం ఏ వేశ్యాగృహంలోనైనా లేక జూద గృహంలోనైనా నేర్వగలిగేవాళ్ళమే..." అన్నాడు సిద్ధార్థ.

"ఏమిటి హాస్యమాడుతున్నావా? ఈ ధ్యానం, ఈ ప్రాణాయామం, ఆకలిదప్పికలను జయించటం ఇవన్నీ ఆ కొంపల్లో ఎలా నేర్చుకుంటావు?" గోవిందుడు ఆశ్చర్యపోయాడు.

సిద్ధార్థ తనలో తానుగా మెల్లగా "ఏమిటి ఈ ధ్యానం? ఈ తపస్సు? ఈ శరీర వైరాగ్యం? ఏమిటీ ఉపవాసాలు? ఏమిటీ శ్వాసనియంత్రణ? ఇదంతా పలాయనం. గోవిందా! నీ నుంచి నీవు పారిపోవటమే, తాత్కాలికంగా! ఇంద్రియాల్ని మోసగించి, ఆకలిదప్పుల నుంచి బయటపడ్డానని తృప్తి చెందుతున్నాం! దీనికి ఇంత నిష్ఠ, ఇంత కష్టం అవసరంలేదు. ఎద్దుబండి తోలేవాడు కూడా ఇది సాధించవచ్చు. పానశాలకు వెళ్ళి రెండు పాత్రల మధువు సేవిస్తే ఇదే స్థితికి చేరుతున్నాడు. అప్పుడతనికి ఒళ్ళు మొద్దుబారి బాధ తెలియదు. మత్తు తలకెక్కి తాత్కాలిక సాంత్వన పొందుతున్నాడు. తర్వాత హాయిగా నిద్రలోకి జారుకుని తననుంచి తాను విడిపోతున్నాడు. ఇన్నాళ్ళు మనం నేర్చిన విద్యలన్నీ ఇందుకేనా? ఈ పలాయనం కోసమేనా?" సిద్ధార్థ ఆగాడు.

గోవిందుడు "నీవలాగే అంటావు మిత్రమా. కానీ నీవు బండి తోలేవాడివా? లేక ఈ వృద్ధ శ్రమణుడు తాగుబోతా?

"తాగినవాడు, నీవన్నట్లు తాత్కాలికంగా అన్నీ మరిచిపోతాడు. అది కొంతసేపే. మత్తు వదిలిన తర్వాత మళ్ళీ అతడు అక్కడికే, పురాస్థితికే వచ్చినట్లు గుర్తిస్తాడు. అతను ఏమీ నేర్చుకోలేడు. అతనికి జ్ఞానోదయం కలుగదు. అతను ఏ ఎత్తుకు ఎదగలేదు."

సిద్ధార్థుడు నవ్వి, "ఏమో, నాకు తెలియదు. నేనెప్పుడూ మధువు ముట్టలేదు. కానీ, నాకు ఈ శ్రమణ విద్యల వలన తాత్కాలికమైన పలాయనమే అనుభవమవుతోంది. ఈ విన్యాసాల వలన నేనేమీ జ్ఞానవృద్ధిణ్ణి కాలేకపోతున్నాను – నిర్వాణం నుంచి నేనింకా ఎంతో ఎంతో దూరంలో ఉన్నాననిపిస్తోంది. ఇది మాత్రం నిజం గోవిందా."

మరో భిక్షాటన సమయంలో "గోవిందా, మనం సరైనదారిలోనే వెళ్తున్నామా?

మనకు ఏమైనా జ్ఞానసముపార్జన జరుగుతోందా? మనం నిర్వాణానికి చేరువౌతున్నామా? లేక నిరంతరావృత్తిలో చిక్కుపడి తిరుగాడుతున్నామా? ఇది కాదు కదా మన లక్ష్యం?"

గోవిందుడు "మనం చాలా నేర్చాము. ఇంకా నేర్వవలసింది ఎంతోవుంది. మనం ఆవృత్తిలో లేము సిద్ధార్థా! మలిచుట్టు మెట్లపై ఉన్నాం. ఇప్పటికే ఎన్నో మెట్లు ఎక్కాం. ఎంతో ఎత్తుకు వచ్చాం."

అప్పుడు సిద్ధార్థుడు గోవిందుణ్ణి చూసి "మన శ్రమణ గురువు, అందరికంటే పెద్దవాడు, ఆయన వయస్సెంత ఉంటుంది?"

"అరవైపైన ఉండవచ్చు..." గోవిందుడు.

"అయితే అరవై దాటినా, ఆయన నిర్వాణానికి దగ్గర్లో ఉన్నట్లు లేదు. త్వరలోనే ఇంకా వృద్ధుడౌతాడు. మనం కూడా ముసలివాళ్ళమైనా, ఈ ఉపవాసాలు ధ్యానముద్రలు మనకు విముక్తి కలిగించలేవు. గోవిందా, ఇంతవరకు ఏ శ్రమణుడూ నిర్వాణం చెందినట్లు వినలేదు.

"ఇక్కడి మంత్రతంత్రాలతో మనం ఓదార్పు పొందుతున్నాం - మనల్ని మనం మోసగించుకుంటున్నాం. కానీ గోవిందా, మనకు ఇంతవరకూ మార్గం గోచరం కావటంలేదు."

"అలా అనకు మిత్రమా! ఇంతమంది జ్ఞానవృద్ధుల్లో, వృద్ధ బ్రాహ్మణుల్లో కఠోర దీక్షాపరుల్లో, శ్రమణ సన్యాసుల్లో, అన్వేషకుల్లో ఆత్మపరిశీలకులలో, పవిత్ర చరిత్రగల పరిశోధకులలో ఒక్కరు - కనీసం ఒక్కరికి కూడా నిర్వాణ మార్గం తెలియదంటావా?"

అప్పుడు సిద్ధార్థుడు, స్థిరమైన స్వరంతో, "గోవిందా, నీ మిత్రుడు త్వరలోనే ఈ శ్రమనుల సాంగత్యం నుంచి, ఇప్పటివరకు నీతో ప్రయాణించిన ఈ మార్గం నుంచి వెళ్ళిపోతున్నాడు.

"గోవిందా! ఈ దాహం తీరనిది - నన్ను మిక్కిలి ఆర్తికి గురిచేసే ఈ జ్ఞాన తృష్ణ తగ్గుటలేదుసరికదా, నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఎప్పుడూ అంతులేని సందేహాలతో అంతుచిక్కని ప్రశ్నలతో నా సమయం గడిచిపోతోంది.

"కాని ఏ విద్యా సంతృప్తినివ్వలేదు. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు.

"బహుశా, గోవిందా, ఇది తెలుసుకోవటం కోసం ఇంత సమయం వృథా అయ్యిందా. అంతేకాదు - ప్రతి విషయంలోను మనం తెలుసుకోలేనిది ఎంతో కొంత ఉంటుంది.

"కానీ జ్ఞానం, సర్వాంతర్యామి - అదే ఆత్మ అంటున్నాం - అది నాలోనూ - నీలోనూ - అన్నింటా ఉన్నది. నాకిప్పుడే అర్థమవుతోంది. ఈ వివేకమే - ఈ విజ్ఞానం - దీనికి మొదటి శత్రువు జ్ఞానార్జనకంటే - ప్రజ్ఞావంతుడైన ఆత్మజ్ఞానియే!

విషణ్ణవదనంతో గోవిందుడు - "మిత్రమా, ఇలాంటి మాటలతో నన్ను దుఃఖపెట్టకు - నాకెంతో బాధగావుంది. ఒక్కసారి ఆలోచించు.

"మన వైదిక గ్రంథాలు, ఉపనిషత్తులుఏ మి ఉపదేశిస్తున్నాయో! పూజ్యులు, మాన్యులు అయిన బ్రాహ్మణోత్తములు ఆదర్శం - శ్రమణుల త్యాగశీలం వీటన్నింటి నుంచి మనం తెలుసుకున్నది - నేర్చినదీ ఏమీ లేదా? నీవన్నట్లు మనం దేని నుంచీ ఏమీ తెలుసుకోలేకపోతే అప్పుడు ఈ జీవరాశి, ఈ ప్రకృతి

ఏమయిపోతుంది. అందులో విలువైనది, పవిత్రమైనది, ఏమీ నిలవదా? సిద్ధార్థా! ఈ సాకార జగత్తుకు అర్థమేమిటీ? ఈ సంఘటనల పరంపరకు అంతరార్థమేమిటి?

"ఆగమాలన్నీ అగమ్యాలేనా? దేనిలోనూ అనంతమూ – శాశ్వతమూ లేదా?" అని,

"నిర్మల మనస్కుడై ఆత్మను సేవించినవానికి, మాటలతో తెలుపలేని మహదానందం కలుగుతుంది" అంటూ ఉపనిషత్తు ధ్యానశ్లోకాన్ని గానం చేశాడు!

గోవిందుని మాటలు సిద్ధార్థుడు విని మౌనంగా మననం చేసుకున్నాడు. అవును ఏమి మిగులుతుంది? మనకు పవిత్రంగా కనిపించే దానిలో మిగిలేదేమిటి? ఏది స్థిరం? ఏది శాశ్వతం? అతను దేనినీ విశ్వసించలేనట్లు తల పంకించాడు.

గత మూడు సంవత్సరాలలో మిత్రులిద్దరూ శ్రమణులతో గడిపిన సమయంలో ఏవేవో గాలి వార్తలు వినపడేవి. ఎవరో గౌతముడని, కాంతిమూర్తుడని, బుద్ధుడని ప్రసిద్ధుడైనట్లు, లౌకిక శృంఖలాల నుంచి, బ్రతుకు బాధల నుంచి విముక్తుడైనట్లు పునర్జన్మను నిర్జించినట్లు తన శాంతి సందేశం, దేశం నలుమూలలా వ్యాపింప చేయటానికి పాదచారియై తిరుగాడుతున్నట్లు, సర్వసంగ పరిత్యాగియై శిష్య సందోహంతో వస్తున్న గౌతమ బుద్ధునికి, బ్రాహ్మణులు, రాజకుమారులూ మోకరిల్లి ఆయన శిష్యులుగా మారుతున్నట్లు – ఈ విధంగా ఎన్నో వార్తలు, కథలు వారివరకూ చేరేవి.

అడవిలో...

మిత్రులిద్దరూ భిక్షాటనకు వెళ్ళినప్పుడు గ్రామాలలో, నగరాలలో బ్రాహ్మణులు, వ్యాపారులు, సామాన్యులు బుద్ధుని కథలే చెప్పుకునేవారు. కొంత మంచిగా – కొద్దిగా అపనమ్మకంతో. దేశమంతా అంటురోగాలతో అల్లాడిపోతున్నప్పుడు గౌతమ బుద్ధుని ప్రవచనాలు, అతని ఉనికి, అతని ఊపిరి రోగులకు సాంత్వన చేకూర్చేవి, ఆరోగ్యవంతులుగా మార్చేవి. ఎందరో తమంత

తాము ఈ ఉపకారి, శాక్యవంశ శేఖరుడు, గౌతమబుద్ధుని చెంతకు చేరి ఉపదేశం పొందేవారు. నమ్మినవారు ఆయన గురించి గొప్పగా చెప్పేవారు. అరిహంతుడని, నిర్వాణం సాధించాడని, ఆయన పాదం మోపినచోట పూలు పూస్తాయని అనేవారు. నమ్మనివాళ్ళు, ఆయన మోసగాడని, విలాసవంతమైన జీవితం గడుపుతాడని, అజ్ఞాని అని తపోనిష్ఠగాని శరీర శోషణంగాని తెలియనివాడని ప్రచారం చేస్తారు. వినేవాళ్ళకి ఇవన్నీ వింతగా, ఆకర్షణీయంగా ఉండేవి! ఏదో మార్మికత ఈ కథలు చుట్టూ ఆవృత్తమై ఉండేది. రోగగ్రస్తమైన ప్రపంచానికి, బాధాతప్తమైన జీవితాలకు ఒక క్రొత్త ఆశ చిగురించేది. ఆయన సందేశం – హాయిగా, సుస్నితంగా, విశ్వాసభరితంగా, సేద తీర్చేది. ఎక్కడ విన్నా గౌతముడు, బుద్ధుడు, తేజోమూర్తి ఇవే సంగతులు. జనులందరూ ఆయనవైపు ఆకర్షితులై, శాక్యముని ఎక్కడ విడిది చేస్తే అక్కడికి బారులు తీరేవారు. సహజంగానే ఈ వార్తలు కథలూ అన్నీ శ్రమణుల గణాలకు కూడా చేరాయి. వృద్ధ శ్రమణుడు – బుద్ధుని, బద్ధ శత్రువులా తలపోశాడు. అపనమ్మకంతో అగౌరవంగా మాట్లాడేవాడు. ఒకనాడు గోవిందుడు "మిత్రమా, ఈ రోజు నేను ఒక బ్రాహ్మణుని ఇంటికి భిక్షకు వెళ్ళాను. ఆయన నన్ను ఇంటిలోనికి ఆహ్వానించి, ఆయన కుమారుని చూపించాడు. అతను అప్పుడే మగధ నుంచి వచ్చాడు. అతడు బుద్ధుణ్ణి స్వయంగా చూశాడట. ఆయన బోధలను దగ్గర నుంచి వినే భాగ్యం కలిగిందని చెప్పాడు. అప్పటి నుంచి నాకు గౌతముని చూడాలని, ఆ మహాత్ముని సందేశం వినాలని ఉవ్విళ్ళూరుతున్నాను. వెళ్దామంటావా?"

అది విని, సిద్ధార్థ "నీవు శ్రమణులతోనే ఉండిపోతావనుకున్నాను. ఈ మంత్ర తంత్రాలతోనే నీవు వృద్ధుడవయిపోతావని తలపోశాను. గోవిందా, చూశావా? నీ గురించి నాకేపాటి తెలుసో? నీ మనసులో ఏముందో నేనెలా తెలుసుకోలేకపోయానో?

"ఇప్పుడు నీ మార్గాన్ని మార్చుకోవాలని, బుద్ధుని బోధలు వినాలని అనుకుంటున్నావు."

అప్పుడు గోవింద "మిత్రమా నన్ను గేలిచేయటం నీకు సంతోషమేకదా. అయినాసరే, నీకు కూడా బుద్ధుణ్ణి చూడాలని కోరిక లేదా? ఈ శ్రమణ మార్గాన్ని విడిచి పోతానని ఎప్పుడో చెప్పావు కదా?"

సిద్ధార్థ నవ్వాడు. "అవును మిత్రమా, నీవు బాగా గుర్తుంచుకున్నావు. కానీ మరో విషయం కూడా గుర్తున్నదా? నాకు ఉపదేశాలపై విశ్వాసం పోయిందని, గురువులంటే అపనమ్మకం ఏర్పడిందని చెప్పానుకదా! అయినా, మిత్రమా, ఈ క్రొత్త సందేశాన్ని వినటానికి నేను సిద్ధంగానే ఉన్నాను! బుద్ధుని ప్రభావ ఫలం మనకు ఇప్పటికే చేరినట్లు నమ్ముతున్నాను!"

గోవిందు ఆనందంతో "నీవు నాతో రావటానికి ఒప్పుకున్నావు. అదే చాలు. కానీ ఈ ప్రభావ ఫలం ఏమిటి సిద్ధార్థ? మనమింకా ఆయన దర్శనమే చేసుకోలేదుకదా?"

సిద్ధార్థుడన్నాడు "మనమిప్పటికే గౌతమునికి ఋణపడ్డాం. మరి ఆయనేకదా నిన్నూ నన్నూ ఈ శ్రమణ శృంఖలాల నుంచి విముక్తి చేసి తీసుకుపోతున్నాడు. మున్ముందు ఏమి జరుగబోతున్నదో."

ఆనాడే సిద్ధార్థ వృద్ధ శ్రమణుణ్ణి కలిసి, తన నిర్ణాయాన్ని చెప్పాడు ఎంతో వినయంగా భక్తిశ్రద్ధలతో! ఆ వృద్ధుడు, క్రుద్ధుడై, వారిని దుర్భాషలాడాడు. గోవింద ఖిన్నుడైనాడు. సిద్ధార్థ, గోవిందునితో మెల్లగా "ఇప్పుడు, ఈయన దగ్గర ఏమి నేర్చుకున్నావో చూపిస్తాను" అని. ఆ ముసలి శ్రమణ గురువు చెంతగా వెళ్ళి ఆయన కనుల్లోకి తదేకంగా చూసి, మంత్రముగ్ధుణ్ణి చేశాడు. అంత క్రోధంలో ఉన్న గురుశ్రమణుడు, సిద్ధార్థుని మనోశక్తికి మౌనంగా లొంగిపోయాడు. శక్తిహీనుడై సిద్ధార్థుని మంత్రబద్ధుడై నీరుగారిపోయాడు! ఆ యువకులిద్దరికీ పలుమార్లు అభివాదంచేసి, దీవెనలందించాడు– 'అస్తు' అంటూ గొణిగాడు!

యువకులిద్దరూ ఆయన వద్ద సెలవు తీసుకొని శ్రమణ సాంగత్యాన్ని తెంపుకుని అడివిని వదిలారు! దారిలో గోవిందుడున్నాడు– "సిద్ధార్థ! నీవు నేననుకున్నదానికంటే ఎంతో ఎక్కువ నేర్చావు. ఆ వృద్ధుణ్ణి మంత్రముగ్ధుణ్ణి చేయటం అంత సులభం కాదు. నీవు ఇక్కడే మరి కొంత కాలం ఉన్నట్లయితే తప్పక నీటిమీద నడిచేవాడివే సుమా."

"నాకా కోరిక లేదు మిత్రమా! ఆ తంత్రాలను శ్రమణులకే వదిలివేద్దాం!"



వృద్ధ సన్యాసి

గౌతముడు

శ్రావస్తి నగరంలో బుద్ధుని పేరు తెలియనివారు లేరు. ఆయన తన శిష్యబృందంతో ఎప్పుడు భిక్షకు వస్తాడా, ఆ భిక్షాపాత్రలు ఎప్పుడు నింపుదామా అని ఎదురు చూసేవారే అంతా!

నగర పొలిమేరలో జేతవనంలో విడిదిచేసి ఉన్న గౌతమ బుద్ధుని ఆ పరిసర ప్రాంతాలలో తెలియనివారెవ్వరుంటారు?

యువ సన్యాసులిద్దరూ గౌతముని విడిది తెలుసుకునేందుకు ఎక్కువ శ్రమ పడవలసిన అవసరం రాలేదు. శ్రావస్తి నగరం చేరగానే మొదటి ఇంటి దగ్గరే వారికి భిక్ష సిద్ధంగా ఉంది! భిక్ష స్వీకరించి, ఆ గృహిణిని "అమ్మా! బుద్ధుడు ఎక్కడున్నాడు? మేము అరణ్యం నుంచి వచ్చిన శ్రమణులం, ఆయన బోధనలు వినాలని తపిస్తున్నాం....."

"మీరు రావలసినచోటికే వచ్చారు నాయనా. గౌతముడు జేతవనంలో శిష్యగణంతో ఉన్నాడు. మీరు రాత్రికి అక్కడే బసచేయవచ్చు...."

"అయితే, మేము గమ్యం చేరినట్లే. అమ్మా మీరు గౌతముని చూశారా?"

"చూశాను నాయనా! ఆ తేజోమూర్తి నిశ్శబ్దంగా ఈ వీధులలో భిక్షాటనకు వచ్చినప్పుడు, పసుపు వస్త్రాలతో మౌనవదనంతో భిక్షనర్థించే ప్రశాంతమూర్తిని చూశాను నాయనా..."

గోవిందునికి ఇంకా తెలుసుకోవాలని ఉంది. సిద్ధార్థ ఇక పదమని హెచ్చరించాడు. ఆ గృహిణికి అభివాదం చేసి కదిలారు. త్వరలోనే జేతవనం చేరే దారుల్లో, బుద్ధదర్శనార్థుల బారుల్లో కలిసి అనాథ పిండకుని జేతవనానికి చేరుకున్నారు. ఆ రాత్రికి అక్కడ విశ్రమించారు!

మర్నాడు తొలి వెలుగులో జేతవనంలో జనసందోహాన్ని, గౌతమ దర్శనార్థులై వచ్చిన అశేష యాత్రికులను గమనించి వారు ఆశ్చర్యపోయారు. ఆ మహావనపు దారుల్లో తిరుగాడుతున్న కాషాయాంబరులు, చెట్ల నీడన చర్చించుకుంటున్న శిష్యగణాలు, భిక్షాటనకు వెళ్తున్న సన్యాసులు అందరినీ గమనించారు!

అంతలో భిక్షకు బయలుదేరిన బుద్ధుని కూడా వారు చూశారు!

సిద్ధార్థుడు ఆయనను వెనువెంటనే గుర్తించాడు.

ఏదో అదృశ్య హస్తం అతనికి "అడుగో ఆయనే.... చూడు!" అని చూపినట్లు వెంటనే గుర్తుపట్టాడు! సాధారణ సన్యాసివలె, భిక్షాపాత్రతో, పసుపు కాషాయ వస్త్రాలతో నిశ్శబ్దంగా కదిలిపోతున్న గౌతముని చూపించి సిద్ధార్థుడు "గోవిందా, చూడు! ఆయనే బుద్ధుడు!" గోవిందుడు వెంటనే ఆ వందల శిష్య సందోహంలో బుద్ధుని, సర్వసాధారణ సన్యాసివలె భిక్షాటనకు వెళ్తున్న గౌతముని, గుర్తించలేకపోయాడు! కానీ మెల్లమెల్లగా అతని ఉనికి, అతని ఉన్నతని తెలుసుకోగలిగాడు!


గౌతముడు

సిద్ధార్థుడు బుద్ధుని గమనించాడు. నిరాడంబరంగా నిశ్శబ్దంగా కదిలిపోతున్న బుద్ధుడు ఆలోచనా నిమగ్నుడయి ఉన్నాడు!

ఆయన ముఖారవిందం అలౌకికానందంతో ప్రశాంతంగా ఉంది. ఆయన శరీరంలోని ప్రతి అణువు, నిర్మలమైన కనుదోయి, విరిసీవిరియని పసికందు చిరునవ్వు, ప్రతి కదలికలోని లాలిత్యం, అణువు అణువునా శాంతి విరాజిల్లుతోంది.

ఈ మహానుభావుని ప్రభావం ఆ వనమంతా వ్యాపించి నిత్య వసంతంతో మురిసిపోతోంది. ఆ తేజోమూర్తి నిశ్శబ్ద సౌందర్య ప్రవాహం జేతవన పరిసర ప్రాంతాలను ముంచివేస్తోంది.

జనసమూహాలను ముగ్ధుల్ని చేస్తోంది!

అతని చూపుల్లో, నడవడిలో అంతా సత్యమే గోచరిస్తోంది. దేనికోసమూ వెతుకులాడటంలేదు. దేనినీ అనుసరించటంలేదు. ఏ ప్రయత్నం లేకుండా, దేనికీ

ప్రత్యామ్నాయం కాకుండా, స్వచ్ఛందమైన శక్తి, సహజ శాంతిభూషణుడై ఉన్నాడు!

గోవిందుడు "మిత్రమా, మనం ఈ సాయంత్రం ఈ మహానుభావుని బోధలు విందాం" అన్నాడు!

సిద్ధార్థునికి ఈ బోధన మీద ఆసక్తి లేదు. క్రొత్త విషయాలు అతనికేమీ అందులో ఉంటాయని విశ్వాసంలేదు. ఇప్పటికే వాటి సారాంశాన్ని కర్ణాకర్ణిగా వినేయున్నాడు.

అయితే గౌతముని గమనించినకొలదీ సిద్ధార్థుని ఆసక్తి పెరుగుతోంది. ఆయన శిరస్సు, భుజస్కంధాలు, పాదాలు, నిశ్శబ్దంగా నేలను చూస్తున్న ఆయన చేయి, ఆయన అంగుళీయాలు వానిలోని ప్రతి కణుపూ, అందులోని ప్రతి అణువు – జ్ఞానంతో నిండి ఉన్నట్లు, అవి నిశ్శబ్దంగా సత్యాన్నే శ్వాసిస్తున్నట్లు తోచింది.

ఈ మహానుభావుడు, బుద్ధుడు, పవిత్రమూర్తే! మూర్తీభవించిన నిర్మలత్వమే!

సిద్ధార్థుడింతవరకు ఏ వ్యక్తినీ ఇంతగా గౌరవించలేకపోయాడు! ఇంతగా ప్రేమించలేకపోయాడు!

అంతలో గౌతముడు తిరిగి జేతవనం చేరాడు. శిష్యుల మధ్యలో కూర్చొని ఆహారం తీసుకున్నాడు. అది ఒక పక్షి ఆకలి కూడా తీర్చలేదేమో! ఆ తరువాత మావిచెట్ల నీడలో విశ్రమించాడు!

పగటి వేడిమి తగ్గేవేళ అందరూ ఆయన బోధనలు వినేందుకు గుమిగూడారు. శ్రద్ధగా ఆలకించారు.

గౌతముని కంఠస్వరం ప్రశాంత గంభీరంగా, మృదుమధురంగా నిర్మల గంగాజల ప్రవాహంలా శిష్యగణ సందోహానికి సందేశం అందిస్తోంది! బ్రతుకు దుఃఖమయమని, ప్రపంచం బాధతో నిండినదని, హృదయం కోరికల నిలయమని–

అయినా వీటిని అధిగమించే మార్గం ఉన్నదని అదే బుద్ధుని పరిత్రాణ మార్గమని, స్థిరమూ మధురమైన స్వరంతో తెలియజేశాడు.

లోకరీతిని నాలుగు భాగాలుగా విభజించి, అష్టాంగ మార్గాన్ని సహేతుకంగా, సహన శీలంతో సోదాహరణంగా శ్రోతలకు అందించారు. ఆయన సుస్వరం

లేత కాంతి పుంజంలా సుదూరాకాశంలో తేజోవంతమైన తారలా చూపరులకు చేరుతోంది!

ఎందరో యాత్రికులు అప్పటికప్పుడు గౌతముని అనుమతితో కాషాయం స్వీకరించి సంఘమిత్రులైనారు. గోవిందుడు కూడా అడుగు ముందుకువేసి– "నన్ను కూడా స్వీకరించండి" అని అర్థించాడు. 'తథాస్తు' అని అప్పటికి బుద్ధుడు విశ్రమించాడు.

అప్పుడు గోవిందుడు "మిత్రమా, నిన్ను తప్పుపట్టాలని కాదు, నీవు కూడా ఆయన బోధనలు విన్నావుకదా. నాలాగా నీవు బుద్ధుని బోధలు అంగీకరించలేదేమి? ఈ దుఃఖనిరోధ మార్గానాకి రావటానికి నీకింకా సమయం కావాలా?"

అప్పుడే మేల్కొన్నట్లు సిద్ధార్థుడు, గోవిందుని పరీక్షగా చూశాడు. "మిత్రమా, నీవు అడుగు ముందుకు వేశావు. నీ మార్గాన్ని నీవు ఎంచుకున్నావు. ఇప్పటివరకు మనం ప్రాణమిత్రులం! అయినా ఎప్పుడూ నాకంటే ఒక అడుగు వెనుకనే ఉన్నావు. నేను ''గోవిందుడెప్పుడైనా నా నుంచి వేరుపడతాడా'' అని అనుకునేవాడిని. 'స్వయంనిర్ణయం తీసుకుంటాడా' అని అనుమానపడేవాడిని! ఇప్పుడు నీ మార్గాన్ని ఎంచుకున్నావు. నిన్ను నీవు వ్యక్తీకరించుకున్నావు. నీవు నీ మార్గంలో శాంతి పొందాలని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తాను."

గోవింద– "నాకు సమాధానం చెప్పవా?"

అప్పుడు సిద్ధార్థుడు అతని భుజాన్ని తట్టి "నీ మార్గాన నీవు పయనించు, నీ ముక్తిని సాధించు.."

అప్పటికి గోవిందునికి అర్థమయ్యింది. సిద్ధార్థుడు తనను వదలి వెళ్ళిపోతున్నాడని. దుఃఖం నిండిన స్వరంతో ''సిద్ధార్థా...'' అని ఏదో చెప్పబోయాడు.

"గోవిందా, మర్చిపోకు. ఇప్పుడు నీవు బుద్ధుని పవిత్ర శిష్యగణంలో ఉన్నావు. నీవు సర్వసంగ పరిత్యాగివి. ఇప్పుడు నీ అహమూ, నీవు అంటూ ఉండదు. అలాగే నీ స్నేహితుడు కూడా. అదేకదా గౌతముడు చెప్పింది! అదేకదా నీవు ఎంచుకున్న మార్గం. నన్ను వెళ్ళనీ..."

తర్వాత ఎంతో సమయం మిత్రులిద్దరూ ఆ వనమంతా సంచరించారు. ఆ తర్వాత నిద్రించే ప్రయత్నం చేశారు. గోవిందుడు మరెన్నో మార్లు తన ప్రియ మిత్రుని అడిగి చూశాడు. 'ఎందుకని నీవు గౌతముని బోధలు అంగీకరించవు? నీకేమైనా వానిలో లోపం కనిపించిందా?' అంటూ.

"శాంతించు గోవిందా! ఆ మహానుభావుని తప్పుపట్టేందుకు నేనెవరిని? ఆయన ఉపదేశం స్పష్టంగానే ఉందికదా?"

మర్నాడు- సంఘమిత్రులందరికీ కాషాయ వస్త్రాలు, ప్రమాణ స్వీకారంలాంటి కార్యక్రమం జరిగింది. అటుపిమ్మట శిష్యగణాలకు వారివారి విధులు బాధ్యతలు తెలియజేశారు. అప్పుడు గోవిందుడు, అప్పటివరకు తన సహచరుడై ప్రియమిత్రుడూ అయిన సిద్ధార్థుని కౌగిలించుకొని అక్కడితో ఆ బంధాన్ని తెంపుకుని గౌతముని కరుణాసముద్రంలో కలిసిపోయాడు! అప్పటినుంచీ సిద్ధార్థ ఆ వనమంతా ఎంతోసేపు ఆలోచనామగ్నుడై తిరుగాడాడు.

అక్కడ ఆ తేజోమూర్తి దర్శనమైంది. వినయపూర్వకంగా నమస్కరించాడు!

గౌతమ బుద్ధుని ప్రశాంత వదనాన్ని కరుణపూరిత నయనాలను చూసి, కొంత ధైర్యం తెచ్చుకున్నాడు. మాట్లాడేందుకు అనుజ్ఞ కోరాడు! శాక్యముని మౌనంగానే తన అంగీకారాన్ని తెలియజేశాడు!

"మహాత్మా, నిన్న మీ ప్రవచనాలను వినే భాగ్యం కలిగింది. సుదూరం నుంచి, నేను నా మిత్రుడు కలిసి మీ బోధలను వినేందుకు వచ్చాము. ఇప్పుడు నా మిత్రుడు ఇక్కడే ఉండిపోతున్నాడు మీ శిష్యునిగా. కానీ నేను నా యాత్ర కొనసాగించాలనే అనుకుంటున్నాను."

"నీ ఇష్టప్రకారమే కానీ" బుద్ధుని మృదుస్వరం! భగవాన్- నేను మీతో మాట్లాడేందుకు ఎంతో ధైర్యం కూడదీసుకోవలసి వస్తోంది. అయినా మీకు నా ఆలోచనలు తెలియజేయకుండా ఉండలేకపోతున్నాను. ఈ కాస్త సమయం నాకు ప్రసాదించగలరా?"

బుద్ధభగవానుడు తల పంకించాడు!

"మీ బోధనలు అద్భుతంగా ఉన్నాయి. ప్రతి విషయాన్ని సోదాహరణంగా పారదర్శకంగా తెలియజెప్పారు.

ఈ ప్రపంచం అంతా ఒక విడదీయలేని అనంతమైన కార్యకారణ శృంఖలమనీ శెలవిచ్చారు! ఇంతకు పూర్వం ఎవ్వరూ చేయలేని విధంగా ఈ సూత్రాన్ని నిర్ద్వంద్వంగా సిద్ధాంతీకరించారు! తప్పనిసరిగా ప్రతి పండితుడు, జ్ఞాని ఇప్పుడు ఈ ప్రపంచాన్ని ఒక క్రొత్త దృక్కోణం నుంచి అర్థవంతమైనదిగాను, సంలగ్నమైనదిగాను, తటస్థమూ, దైవాధీనం కానిదానిగాను చూడగలరు.

"మంచి చెడులు, సుఖదుఃఖాలు అన్నింటినీమించి అదృష్ట దురదృష్టాలను ప్రక్కనపెట్టి, ఈ జీవితాన్ని, ఈ ప్రపంచాన్ని ఒకటిగా సంధానపరచి అన్నీ కార్యకారణ ప్రవాహమని, అదే ప్రధాన సూత్రమని, జనన మరణాలు కూడా అందులో అంతర్భాగమని బోధించారు! ఈ అద్భుతమైన ఉపదేశంలో అంతా విశదంగానే ఉన్నది. కానీ మీ మాటలలోనే ఈ సంఘటిత లోకంలో ఈ అవిఘ్న శృంఖలంలో, ఎక్కడో ఒక లోపం, ఒక తార్కిక పాతమున్నట్లున్నది! క్రొంగ్రొత్తదీ, అంతకు పూర్వం లేనిదీ ఎప్పుడూ ఎవ్వరూ నిరూపించలేనిదీ అది మీ నిర్వాణ సిద్ధాంతం కాదా? ఈ ఒకే ఒక్క కారణంతో మీరు ప్రతిపాదించిన కార్యకారణ ప్రపంచ ఏకసూత్రం తెగిపోవటంలేదా? ఇది నా సందేహం మాత్రమే. ఇది పొరపాటైతే క్షమించండి స్వామీ!"

గౌతముడు నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఆలకించాడు. స్థిరమైన కరుణ స్వరంతో "బ్రాహ్మణ కుమారా! నీవు చాలా శ్రద్ధగా ఆలకించావు. ఎంతో దీర్ఘంగా ఆలోచించావు కూడా! అవును, నీవు ఎత్తిచూపిన లోపం, మరొక్కసారి మరింత లోతుగా ఆలోచించు నాయనా. కాని ఒక్కటి గుర్తుంచుకో. నీ జ్ఞానతృష్ణను, అభిప్రాయం సంకటంలో, భాషాపదాల వైరుధ్యాల మధ్య ఇంకిపోనీయకు.

"అభిప్రాయాలన్నీ అర్థంలేనివే! అవి ఎంత ఉన్నతంగా ఉన్నా, నిమ్నంగా ఉన్నా ఎవరైనా స్వీకరించవచ్చు లేదా తిరస్కరించనూవచ్చు.

"నీవు విన్నది నా అభిప్రాయం కాదు కుమారా! దాని అవసరం నీలాంటి జ్ఞానతృష్ణతో తపించేవారి కోసం కాదు.

"ఈ బోధనల సారాంశం సర్వస్వం దుఃఖం నుంచి బాధామయ ప్రపంచాన్ని నిర్వాణ పథంలో నడింపిచటమే."

అప్పుడు సిద్ధార్థ "అవును మహాత్మా! అభిప్రాయాలకు విలువ లేని మాట నిజమే. కానీ ఒక్క విషయం మీతో మనవి చేస్తాను. మిమ్ములను, మీ మాటలను

నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను. మీరు బుద్ధులని, తరతరాలుగా ఏ ఒక్కరికీ సాధ్యంకాని నిర్వాణ పథాన్ని మీరు చేరగలిగారని నమ్ముతున్నాను. మీ స్వయంకృషితో, తపోనిష్ఠతో – ఆత్మపరిత్యాగంతోనే సాధించారుతప్ప, ఏ ఒక్కరి బోధనవలనగాని, మార్గదర్శకుల వలనగాని కాదుకదా!

"ఇప్పుడు తేజోమూర్తి బుద్ధుని బోధనలు ఎంతో ఉన్నతమైనవి సన్మార్గ జీవితానికి దారిచూపేవి! ఎన్నో ఉత్తమ విలువలు తెలియజేసేవి–

"కానీ, మీరు పొందగలిగిన, కేవలం మీరు మాత్రమే చేరుకోగలిగిన ఆ అలౌకికానందానుభూతిని ఈ బోధనలు మాకందించలేవుకదా!

"ఈ విషయమే నేను గ్రహించగలిగాను. అందుకే స్వామీ, నా యాత్ర కొనసాగించాలనుకుంటున్నాను. మరో సిద్ధాంతాన్వేషణకోసమో, మరో ఉత్తమ మార్గాన్వేషణకు కాదు. నా లక్ష్యం చేరేందుకు నా మార్గమేదో తెలుసుకునేందుకే. లేదా చివరకు మరణం ధృవమేకదా!

"మహాత్మా! ఈ మధుర క్షణాలను నేను సదా స్మరిస్తూనే ఉంటాను" సిద్ధార్థుడు అన్నాడు.

ప్రశాంత గంభీర వదనుడైన గౌతముడు సిద్ధార్థుణ్ణి సమభావంతో చూస్తూ–

"నీ తర్కం తప్పు కాదనే తలపోస్తాను కుమారా! నీవనుకున్నది సాధించ ప్రయత్నించు.

"ఒక్క విషయం చెప్పు. ఇక్కడకు వచ్చిన ఈ సధర్మచారులందరూ, నా సోదరులు. నా బోధనలు వదిలి, ఈ ప్రశాంత మార్గాన్ని కాదని, మరల లౌకిక జీవితంలోనికి, కోరికలతో సతమతమవుతూ బ్రతుకు బాధల్లోకి తిరిగి రమ్మంటావా?"

"లేదు స్వామీ, ఆ ఆలోచన పొరపాటున కూడా నాకు రాలేదు.

"వారి మార్గాన్ని వారు నిర్ణయించుకున్నారు. ఇంకొకరి జీవితాన్ని నిర్దేశించే హక్కు నాకు లేదు.

"నాకు నేను దారి చూపుకోవాలి. నన్ను నేను అంచనా వేసుకోవాలి. ఏది కావాలో ఏది వలదో నేను తేల్చుకోవలసి ఉంది. నా పరిమితులేమిటో సరిచూసుకోవాలి. ఈ అహం నుంచి విముక్తుడనవ్వాలి.

“ఒకవేళ నేను కూడా మీ శిష్యునిగా ప్రమాణ స్వీకారం చేస్తే అది నన్ను నేను మోసం చేసుకోవటమే. నాలోని ఈ అహం పెరుగుతూనే ఉంటుంది. అయితే అది మీ బోధనలుగా, ఇక్కడి సంఘమిత్రులపై ప్రేమగా మారుతుంది!”

విరిసీ విరియని చిరునవ్వుతో తరగని తేజస్సుతో అంతులేని స్నేహభావంతో గౌతముడు ఆ అపరిచితుని తదేకంగా చూశాడు!

“నీవు తెలివిగలవాడివి, శ్రమణా! నీవు తెలివిగా మాట్లాడగలవు కూడా! కానీ నీ తెలివితేటల నుంచి నీవు జాగరూకుడవై మెలగాలి సుమా” అని బుద్ధుడు కదిలాడు.

సిద్ధార్థునికి ఆయన చిరునవ్వు, ఆయన కరుణార్ద్ర నయనాలు హృదయంలో హత్తుకుపోయాయి.

‘ఇలాంటి వ్యక్తిని నేనెక్కడా చూడలేదే! ఈయనలా కూర్చుని ఈయనలా నడవగలిగి ఈయనలా మాట్లాడగలగడం, ఇంత నిర్మలంగా, ఇంత మార్మికంగా కదిలే వ్యక్తి తప్పక తన అహాన్ని జయించి ఉంటాడు. లేకపోతే ఇది ఎలా సాధ్యం?

‘నేను ఈయన వలెనే నడవాలి, కూర్చోవాలి, అలాగే మాట్లాడాలి. ఈ మహానుభావునివలెనే అహాన్ని జయించాలి.

‘ఇంతవరకు ఇటువంటి వ్యక్తిని ఎక్కడా చూడలేదు. తను ఎవరి ముందూ తల వంచలేదు. కనులు దించలేదు.

‘ఈ మహాత్ముని బోధనలే నన్ను ఆకర్షింపలేదంటే, ఇక నేను దేనికోసం అన్వేషించాలి, ఏ గురువు కోసం వెతకాలి?

‘గౌతముడు నా నుంచి అన్నీ దోచుకున్నాడు. నా స్నేహితుణ్ణి, నన్ను నమ్మిన మిత్రుడు ఇప్పుడు ఆయన్ను విశ్వసిస్తున్నాడు. నా నుంచి అన్నీ దోచుకున్నాడు.

కానీ ఎంతో విలువైన సిద్ధార్థుణ్ణి, నన్ను నాకు పరిచయం చేశాడు.

మేల్కొలుపు

బుద్ధభగవానుడున్న పవిత్ర స్థలాన్ని, గోవిందుడు ఆగిపోయిన జేతవనాన్ని వదలి ముందుకు సాగుతూ, సిద్ధార్థుడు తన పూర్వ జీవితాన్ని కూడా అక్కడ వదిలివేసినట్లుగా భావించాడు.

అంతర్ముఖుడై ఎంతో ఆలోచించాడు. అలా ఆలోచిస్తూ ఇప్పటివరకూ జరిగిన సంఘటనలకు కారణాలను గుర్తించసాగాడు. అలా కారణాల గుర్తింపు అతని ఆలోచనలుగా, అతని భావనలుగా, తర్వాత అతని వివేకంగా రూపాంతరం చెంది, సత్యరూపాలను పొంది ఒక పరిపక్వ స్థాయికి చేరాయి.

ఇప్పుడు తను కుర్రవాడు కాదు. ఎదిగిన మగవాడు. పాము కుబుసం విడిచినట్లు తన గతాన్ని తాను విడిచివేసినట్లు గుర్తించాడు. ఇప్పటివరకూ, తను ఆరాటపడింది, ఎవరో గురువు కావాలని వారి నుంచి ఏదో నేర్చుకోవాలనే బలీయమైన వాంఛ ఇప్పుడు తనకు లేదు. తనకు తారసపడిన గొప్ప పవిత్రమైన గురువు బుద్ధుని కూడా వదలి ముందుకు వచ్చాడు. చివరికి ఆయన బోధనలను కూడా అంగీకరించలేకపోయాడు.

'అవును సిద్ధార్థా! నీవు గురువుల దగ్గర ఏమి తెలుసుకోదలిచావు? వారి బోధనల వలన ఏమి దర్శించగలిగావు? వారి విద్యనంతా నీకు బోధించారే. అయినా నీవు నేర్చుకున్నదేమిటి? నీకు వారు తెలియచెప్పలేనిదేమిటి?

'అవును నన్ను నా అంతరంగాన్ని నా సహజ ప్రవృత్తిని తెలుసుకోలేకపోయాను. నన్ను నేను తెలుసుకోవాలని, నా అహాన్ని జయించాలని చూశాను. కానీ నన్ను మోసగించుకోగలిగాను. నా నుంచి నేను పారిపోగలిగాను. నా నుంచి నేను

తప్పించుకోగలిగాను. ఇంతవరకు నా అహాన్ని నా నుంచి నా ఆలోచనలు వేరుపడకుండా ఈ ప్రపంచాన్ని చూడలేకపోయాను. ఈ చిక్కుముడి, నేను జీవిస్తున్నాను, నేను ఇతరులకంటే భిన్నము, నేను సిద్ధార్థుణ్ణి అనే సత్యం ఇంతవరకు గుర్తించలేకపోయాను. ఈ ప్రపంచంలో అన్నిటికంటే నాకు తక్కువ తెలిసింది నా గురించే అనేది పరమ సత్యం!

ఈ ఆలోచనతో ఒక్కసారిగా ఆగిపోయాడు. మరో ఆలోచన అతన్ని ముప్పిరిగొన్నది. 'ఎందుకు, నా గూర్చి నాకు తెలియదు? ఎందుకు నాకు నేను అన్యునిగా మిగిలిపోయాను? అంటే నన్ను చూసి నేను భయపడుతున్నాను. నన్ను వదిలి నేను పారిపోతున్నాను. నేను మరెవరినో, పరమాత్మను వెతుక్కుంటూ, నన్ను నేను అంతమొందించుకుంటున్నాను, నా అంతరాంతరాలలో దాగియున్న అపరిచితమైన అంతరాత్మ, జీవి, పరమాత్మను శోధిస్తూ నేను అగమ్యంలో పడిపోయాను.'

ఈ ఆలోచనలతో సిద్ధార్థ తన పరిసరాలను పరికించాడు. ఏదో గాఢనిద్రలో నుంచి మేల్కాంచినట్లు ఈ జలదరింపు తన లోలోతుల నుంచి ఉబికివచ్చింది.

ఇప్పుడు ఒక్కసారిగా తన గమ్యమేమిటో తన మార్గమేమిటో తెలిసినట్లు వడివడిగా అడుగులు వేశాడు.

'అవును, నేను నా నుంచి పారిపోను. ఈ ఆత్మాన్వేషణ, ప్రాపంచిక దుఃఖాల గురించి ఆలోచించను.

ఇక ముమ్ముందు నన్ను నేను నాశనం చేసుకుని, ఆ శిథిలాల కావలవున్న రహస్యం కోసం నా సమయాన్ని వృథా చేయను.

ఇక ఈ వేదాలూ, యోగ, తపోసంబంధమైన ఉపదేశాలను అధ్యయనం చేయను. నా నుంచి నేను నేర్చుకుంటాను. నన్ను నేను శోధించుకుంటాను. నా రహస్యమేమిటో తెలుసుకుంటాను."

ఈ ఆలోచనలతో తన చుట్టూవున్న ప్రపంచాన్ని మొదటిసారిగా చూస్తున్నట్లు పరిశీలించాడు. ఎంత సౌందర్యం? ఎంత వింతగా ఉంది, ఎంత మార్మికంగా ఉన్నాయి ఈ ప్రకృతిలోని ఈ వర్ణాలు? ఈ ఆకాశం ఆ పర్వతాలు అదిగో ప్రవాహం, ఈ ప్రకృతి సంగీతమేమిటి? వీటన్నిటి నడుమ నేను! ఇప్పుడే నిద్ర

మేల్కొంచిన సిద్ధార్థ. ఎంత వింత? ఈ వనాలు, ఈ నది, ఈ ఆకాశం – ఇవన్నీ ఇప్పుడే తన దృష్టికి వచ్చాయి! ఇది మాయకాదు! ఇది మర్మమూకాదు. ఇది అర్థంలేనిది కానేకాదు! ఈ ప్రకృతిలోని వైవిధ్యం, భిన్నత్వం ఇవన్నీ పండితులు, జ్ఞానులు అంగీకరించలేదు. వారికి ఏకత్వం కావాలి! కానీ నది, నదియే. ఆకాశం ఆకాశమే. నేను ఈ ప్రకృతిలోని భాగమే. అయితే ఈ నదిలోనే ఈ ఆకాశంలోనే నా ఉనికి ఉంటుంది. నా జీవితానికర్థం, సత్యం ఈ ప్రకృతి స్థితిలోనే ఉండాలి. ఎక్కడో దాగి ఉండాల్సిన అవసరం ఏముంది?

ఇన్నాళ్ళు ఎంత మూర్ఖంగా ప్రవర్తించాను, తను చదవాలని అనుకున్నది చదువుతుంటే అందలి అక్షరాలు, అర్థాలు వినకుండా, అవన్నీ భ్రమలని, భ్రాంతులని అనుకుంటూ మళ్ళీ అవే పఠించి పరిశోధించాను! ఈ ప్రపంచాన్ని చదవాలని, నా ప్రవృత్తి తెలియాలని కోరి ఎంతగా విఫలమయ్యాను! కనిపించేవన్నీ భ్రమలనీ, మాయలని, చివరికి నా కనులు, వాక్కు కూడా సత్యం కాదని నమ్ముతూ వచ్చాను.

'ఇప్పుడు అదంతా గతం! నేను నిద్ర మేల్కొన్నాను. నాకీరోజే పునర్జన్మ!'

ఈ ఆలోచనలు ముసురుతుండగా ఒక్కసారిగా తన దారిలో త్రాచుపాము ఎదురైనట్లు ఆగిపోయాడు.

అవును, ఇది పునర్జన్మయే. ఇప్పుడు క్రొత్త జీవితాన్ని ప్రారంభించాలి. జేతవనం దాటి గౌతమ బుద్ధుని సాన్నిధ్యం వదలి వచ్చినప్పుడే తనకి మేల్కొలుపు జరిగింది. ఒక్కసారిగా ఇల్లు, తండ్రి, అమ్మ అందరూ మదిలో మెదిలారు. ఇప్పుడైతే తను ఇంటికి తిరిగి వెళ్ళాలి. తండ్రి దగ్గరకే వెళ్ళాలి!

కాని, నిశ్చలంగా నిలబడి ఆలోచించాడు. 'నేను ఇదివరకటి సిద్ధార్థను కాను. నేను సన్యాసిని కాదు, పురోహితుణ్ణి కాదు, బ్రాహ్మణుణ్ణి కాదు. ఇప్పుడు తిరిగి వెళ్ళి ఏంచేయాలి? మళ్ళీ చదవాలా? కాలోచిత మర్యాదలు నిర్వహించాలా? లేదా ధ్యానం అనుష్ఠించాలా?

ఇవన్నీ గత జీవితం కదా. అన్ని అయిపోయాయి!'

అతని వెన్నులో సన్నని వణుకు మొదలైంది. ఇప్పుడతను ఒంటరివాడు. ఎంత దుర్భరం ఈ ఒంటరితనం! ఇన్ని సంవత్సరాలు ఇంటిపట్టున లేకపోయినా,

ఎప్పుడూ ఇంత ఒంటరి భావన రాలేదు. తను విద్యనభ్యసించే సమయంలో, తన తండ్రికి కొడుకే, బ్రాహ్మణ కుమారుడే, భాగవతోత్తముడే కానీ ఇప్పుడు కేవలం సిద్ధార్థుడే. ఇంకేమీ కాదు. ఒక్కసారి నిట్టూర్చాడు. తనకంటే ఏకాకి ఎవరూ ఉండరేమో? ఇప్పుడు తనకే వంశ వృక్షమూ లేదు. ఏ వృత్తి సంఘమూ లేదు. తలదాచుకునేందుకు సంఘపరమైన ఏ నివేశనంలేదు! కనీసం ఇప్పుడు శ్రమణ గణం కూడా లేదు. ఎంతటి తపోనిష్ఠలో ఉన్న ముని కూడా ఒంటరివాడు కాదు. అలాంటివారు ఎందరిలోనో ఒక్కడు! గోవిందుడు బుద్ధుని వేనవేల శిష్యుల సాంగత్యంలో ఉన్నాడు! అందరికీ ఒకే కాషాయం. ఒకే భాష. మరి తను? ఈ సిద్ధార్థుడు ఎక్కడివాడు? ఎవరికి చెందుతాడు?

ఎవరి జీవితంలో ఇతనికి భాగముంటుంది? ఎవరి బాష ఇతను మాట్లాడాలి?

ఈ రకమైన ఆలోచనాపరంపరలతో తన చుట్టూ ఉన్న ప్రపంచం మంచులా కరిగిపోతుంటే, తన అస్తిత్వం ఆకాశంలో ఒంటరి నక్షత్రంలా మినుకుమంటుంటే నిర్వేదం, నిస్పృహ అతన్ని ముంచివేశాయి. అయినా తాను తనలాగానే ఉండాలని కృతనిశ్చయంతో కదిలాడు.

తన మేల్కొలుపు, తన క్రొత్త జన్మ పురిటినొప్పులు పూర్తైనట్లు గుర్తించాడు!

అప్పుడు త్వరగా, అసహనంతో ముందుకు – తన ఇంటికి, తండ్రికి తన గతానికి దూరంగా ముందుకు సాగాడు.

ఇక వెనుదిరిగి చూడలేదు.

కమల

ఇప్పుడు సిద్ధార్థ ప్రపంచం పట్ల తన దృక్పథం మారటంతో ప్రకృతి సౌందర్యానికి బందీయైన తన బాటలో అన్నీ క్రొత్తగా తెలుసుకుంటున్నాడు.

ఆ అడవులకు ఆవల దూరపు కొండల వెనుకగా భాస్కరుడు ఉదయించటం, ఆ పడమట దిక్కున సుదూర సాగరంలో అస్తమించడం చూస్తున్నాడు.

రాత్రి ఆకాశంలో తారలు మినుకుమినుకుమనటం, ఎక్కడో చంద్రవంక తెరచాప పడవలా ఊగిసలాడటం కూడా చూస్తున్నాడు.

అతను నడిచే దారిలో చెట్లు, ఎన్నో రకాల జంతువులు, పైన వింత వింత మబ్బులు, హరివిల్లులు, కొండలు, కోనలు, రంగురంగుల పూలు, సెలయేళ్ళు, పరుగులెత్తే నదులు, మంచు బిందువులతో మెరిసే గడ్డి చిగుళ్ళు, ఏదో పొగల పొరల్లో పాలిపోయిన నీలంపు గిరులు, కోయిల స్వరాలు తుమ్మెద ఝుంకారం, వరి పొలాలపై మెల్లమెల్లగా వీచే చిరుగాలులు – ఇవన్నీ అతనికి క్రొత్తగా, వింతగా రంగురంగులుగా మొదటిసారిగా అవగాహనకు వస్తున్నాయి.

ఈ సూర్యచంద్రులు, ఈ గిరులు తరులు, ఈ నదులు, సెలయేళ్ళు, ఈ తుమ్మెదలు, కమ్మతెమ్మెరలు ఎప్పుడూ ఉన్నవే. కానీ తనే మొదటిసారిగా ఈ అందాల్ని దర్శిస్తున్నాడు. ఒకప్పుడు ఇవన్నీ భ్రమలని, మాయతెరలని అలక్ష్యంచేసి మనసు పెట్టలేదు. సాకార దృశ్యాలకావల సత్యమేదో ఉంటుందని వెతికాడు. ఇప్పుడు రేపవళ్ళు, వెలుగు నీడల్లో సప్తవర్ణాల సమ్మేళనంలో దోబూచులాడే అందాలమీద అతని చూపు నిలిపాడు. ఇప్పుడు సత్యాన్వేషణ కోసం దిగంతాలవైపు చూపులు సారించటంలేదు. కనుల ముందున్న ప్రపంచాన్ని చిన్న పిల్లవానిలాగా ఆశ్చర్యంగా తిలకిస్తున్నాడు. ఇప్పుడు అన్నీ రేయి, పగలు,

సెలయేరు, నదులు, తరులు, గిరులు, పశువులు, పక్షులు రంగురంగుల సీతాకోకచిలుకలు అన్నీ, అన్నీ అందంగా, ఆశ్చర్యంగా కనపడుతున్నాయే! ఈ విధంగా తన పరిసరాల్ని చూడగలగటం అతనికి ఎంతో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ఇస్తోంది. తను చూడనిచోట కూడా ఎండ కాస్తుంటుంది. వెన్నెలా కాస్తుంది. కాయలు కాస్తాయి, పూలూ విరబూస్తాయి.

ప్రతిక్షణం పరిగెడుతోంది. ఈ కాలం, ఈ అందాల్ని తనతోపాటు తీసుకుపోతూ పరుగులిడితోంది.

ఓ పోతు, మేకను కూడటం చూశాడు. అడవిలో కోతుల గుంపును చూశాడు. చిటారు కొమ్మల్లో, చిందులువేస్తూ అల్లరిచేస్తూ...

సెలయేటిలో సాయంత్రం, ఓ గండుమీను చిన్న చేపలను వేటాడటం చూశాడు. ఆకలి, కోరికా ఆ నీటిలో సుడులు తిరగటమూ గమనించాడు.

ఇవన్నీ ఎప్పుడూ ఉన్నవే! కానీ ఇప్పుడే తను వీటిని చూస్తున్నాడు. తనూ ఈ ప్రపంచంలో ప్రవేశిస్తున్నాడు. ఇప్పుడు కనులముందున్న అందాలను మనసు గుర్తిస్తోంది. ఈ వెలుగు నీడల్ని చూస్తున్నాడు. ఈ వెన్నెల తారకల్ని గుర్తిస్తున్నాడు!

చాలాకాలంగా 'నా' 'అహమే' నా ఆత్మయని, అదే శాశ్వతమైన పరమాత్మ 'స్వరూపమ'ని నమ్ముతూ వచ్చాడు. కానీ ఎప్పుడైనా నిజానికి 'నేను'ను కనుగొన్నాడా?

ఎప్పుడూ అది అతని ఆలోచనావలయంలోనే కొట్టుమిట్టాడుతూ మార్మికంగానే ఉండిపోయింది!

ఈ దేహం వేరు, అహం వేరు. ఈ దైహిక స్పర్శలు ఇంద్రియ జ్ఞానం, ఆలోచన, నేర్చిన విద్య ఇవేమీ ఆత్మజ్ఞానాన్ని విశదీకరించకపోగా ఇప్పటికే ఉన్న ఆలోచనాపరమైన గందరగోళాన్ని, మరింత సంక్లిష్ట పరుస్తున్నాయి.

లేదు! ఈ వివేచనాపరమైన ఎరుక ఒక భాగమే. ఇది ఎటూ పాలుపోని, ఏ గమ్యమూ చేర్చని దారి. ఎందుకంటే, ఆత్మజ్ఞానం కోసం చేసే అన్వేషణలో ముమ్ముందుగా పంచేంద్రియాల్ని నాశనం చేసి, మళ్ళీ జ్ఞానము పాండిత్యంతో అదే అహాన్ని నింపాలని చూస్తున్నాడు. కానీ భావమూ భవమూ రెండూ ముఖ్యమైనవే. ఆలోచనా, ఇంద్రియ స్పర్శలు ఎంతో సున్నితమైనవి. వీటి

ఆంతర్యంలోనే బ్రతుకు పరమార్థం దాగివుంది! రెంటిలో దేనినే తీసివేయలేము. తేలికగానూ తీసుకోలేము. ఈ జంట స్వరాలను వినవలసిందే. తన అంతర్వాణి భాష తెలియవలసిందే, తన మనోజ్ఞానమే తన గురువు. అది చూపిందే తన దారి!

గౌతముడు బోధిసత్త్వుడెలా అయినాడు? తన అంతర్వాణి ఆదేశంమేరకే ఆ బోధివృక్షం క్రింద కూర్చుని ధ్యానముద్రుడై కాంతిని దర్శించాడు! పవిత్ర స్నానాలు, ధ్యానపాఠాలూ శరీర శోషణ, నిర్నిద్ర ప్రాణాయామాలు, ఏవీ ఆయనకు మార్గదర్శకాలు కాలేదే? ఆయన మనోవాణే, ఆయనకు దారి చూపింది కదా?

నీ లోగొంతును విను. వినేందుకు సిద్ధంగా ఉండు! అదే నీకు దారి. ఏ ఇతర ఆజ్ఞలకు తలవంచకు.

ఆ రాత్రి ఏటి ఒడ్డున, సరంగు ఇంటిలో పూరిపాకలో నిదురించాడు. కలలో గోవిందుడు కాషాయంబరియై ఎదురుగా నిలిచాడు. కలతగా "మిత్రమా, నన్ను వదిలి ఎందుకు వెళ్ళిపోయావు" అని అడిగాడు. అప్పుడు ఒక్కసారిగా తను భావార్తితో గోవిందుని గాఢంగా కౌగిలించుకుని ముద్దుపెట్టాడు. అరె! అతడు గోవిందుడు కాడు! ఎవరో స్త్రీ. ఆమె నిండు చన్ను పయ్యెద బయట అతని కనుల నిండా కనపడుతోంది!

సిద్ధార్థ ఆమె చనుబాలు తనివితీరా గ్రోలాడు! ఏమి రుచి ఇది! మనిషి, వెలుగు, అడవి, జంతువు, పూలు, ఫలాలు – ఒకటేమిటి సమస్తమైన భౌతికానందం అందులో నిండివున్నట్లు ఎంత మత్తుగా ఉంది!

తెలతెలవారుతుండగా కనులు తెరిచాడు. ఏటిలో నీరు నెమ్మదిగా ప్రవహిస్తోంది! అడవిలో ఎక్కడో ఒక గుడ్లగూబ అరుస్తోంది!

తరువాత నది దాటించమని, సరంగుని అడిగాడు. వెదురు బల్లకట్టుమీద ఇద్దరూ ఆవలి తీరానికి బయలుదేరారు.

ఉదయపు కిరణాలలో నదిలో నీరు మెరుస్తోంది.

"ఈ నది ఎంత మనోహరంగా ఉంది.." అన్నాడు సిద్ధార్థ.

"అవును. ఈ నది, ఈ ప్రవాహం ఎప్పుడూ సహజ సుందరంగా ఉంటుంది.

దీని గలగలలు ఎప్పుడూ వింటాను. దీని పోకడలన్నీ చూస్తుంటాను. ఎప్పుడూ నాకేదో చెప్తున్నట్లుంది" అన్నాడు సరంగు.

రెండో తీరం చేరిన తర్వాత సిద్ధార్థుడు అతన్ని అభినందించాడు. కృతజ్ఞతాపూర్వకంగా "నీకివ్వటానికి నా దగ్గరేమీలేదు..."

"నీనుంచి నేనేమీ ఆశించలేదు మిత్రమా, మరోసారి వచ్చినపుడు ఇవ్వగలవేమో!"

"నిజంగా అలా అనుకుంటున్నావా?"

"అవును. అది కూడా ఈ నదే నేర్పింది. అన్నీ తిరిగి వస్తాయి. నీవు కూడా తప్పక వస్తావు. వెళ్ళిరా, మిత్రమా, నీ స్నేహమే ప్రతిఫలమనుకుంటాను. నన్ను మరిచిపోకు!"

అతని స్నేహభావానికి సిద్ధార్థుడు ముగ్ధుడైనాడు! అతను కూడా గోవిందునిలాగానే కనిపించాడు. దారిలో తాను కలిసినవారంతా గోవిందునిలాగానే ఎంతో స్నేహపూర్వకంగా, సంతోషంగా తనకు సేవలందించారు. నిజానికి తాను వారందరికీ ఋణపడివున్నాడు. కానీ వీరంతా ఎంత మంచివారు! ఎంత సహనశీలురు! ఎంతటి అమాయకులు!

మధ్యాహ్న సమయానికి ఒక గ్రామంలో ప్రవేశించాడు. చిన్నచిన్న ఇళ్ళ మధ్య చిన్న పిల్లలు గంతులు వేస్తున్నారు. కేకలు వేస్తూ తుళ్ళిపడుతున్నారు. తనను చూసి సిగ్గుపడుతూ పారిపోయారు! ఆ ఊరి పొలిమేరలో చిన్న సెలయేరు ప్రక్కగా తన దారి మళ్ళింది.

అక్కడ నీటి అంచున బట్టలు ఉతుకుతూ ఓ చిన్నది కనిపించింది. ఆమెను పలకరించాడు. ఆమె నవ్వుతూ కళ్ళింత చేసుకుని అతన్ని చూసింది.

ఆకలి – కోరిక

ఆచారం ప్రకారం ఆమెను దీవించి, నగరానికి మార్గమెంత దూరవెూ అడిగాడు!

అప్పుడు ఆమె అతని ఎదురుగా నిలబడి, కుశలమడిగింది. "ఏమైనా తిన్నారా" అని ప్రశ్నించింది. "మీరు

అడవుల్లో ఒంటరిగా ఉంటారా? మీకు ఆడతోడు ఉండదా?" అంటూ అతని దగ్గరకు వచ్చింది. ఆమె ఎడం పాదం అతని కుడిపాదంపైన మోపి సుతారంగా ఇంటికి ఆహ్వానించింది!

సిద్ధార్థ తనలో రక్తం పరుగులెత్తటం గమనించాడు. ఒక్కసారిగా రాత్రి కల గుర్తుకు వచ్చింది. ముందుకు వంగి ఆమె చనుమొనను ముద్దాడాడు. ఆమె నవ్వుతూ, కోరికతో కనులు మూసుకోవడం చూశాడు.

ఒక్కసారిగా అతనిలో అలజడి రేగింది. కామోద్రేకం కలిగింది! కానీ ఇంతవరకు ఏ స్త్రీ స్పర్శ తెలియని సిద్ధార్థ ఒక్క క్షణం వెనుకాడాడు. అప్పటికే అతని చేతులు ఆమె భుజాలపై ఉన్నాయి.

అతని అంతర్వాణి చెప్పినట్లుగా ఎక్కడో అతనికి 'వద్దు' అని వినిపించింది! ఆ క్షణంలో అతని భావం మారిపోయింది. ఇక ఆమెలో ఏ ఆకర్షణా కనిపించలేదు.

మెల్లగా ఆమె బుగ్గలు తడిమి, త్వరత్వరగా తన దారిలోకి నిష్క్రమించాడు!

సాయంత్రానికి నగరానికి చేరాడు. ఇప్పుడు జనం మధ్యలో ఉండటం అతనికి ఆనందంగా ఉంది! అడవులలో ఆచ్ఛాదన లేకుండా ఎంతో కాలం గడిపాడు. పడవ వాని గుడిసే అతనికి చాలా కాలం తర్వాత మొదటి ఇల్లు!

ఆ నగరపుటంచుల్లో ఎంతో అందంగా పెంచిన ఉద్యానవనం, దగ్గర్లో కొంతమంది సేవకులు పూల సజ్జలు, పండ్లబుట్టలు తీసుకుని బారులుగా వెళ్తున్నారు. వారి మధ్యలో పూలదండలూ పట్టుగుడ్డలతో అలంకరించిన ఒక పల్లకి నలుగురు మోస్తున్నారు. ఆచ్ఛాదన లేని ఆ మేనా ఆసనంపై ఓ సుందరాంగి కూర్చుని ఉన్నది. సిద్ధార్థ ఆ పూదోట ముంగిట నిలబడి ఈ ఊరేగింపును ఆ సేవకులను చెలికత్తెలనూ చూసి పట్టుపరపులపై ఠీవిగా కూర్చొని ఉన్న జవ్వనిని పరిశీలించాడు. కారుమబ్బుల్లాంటి ఆమె ఒత్తైన కురుల మధ్యలో ఎంతో చైతన్యం, వివేకం మిళితమైన ముఖారవిందం, నిగనిగలాడే ఎర్రటి పెదవులను, ఎంతో శ్రద్ధతో దిద్దుకున్న కనుబొమ్మలు, నిశితంగా చూసే కాటుక కళ్ళు, శంఖంలాంటి కంఠంతో, బంగారు జరీతో ఆకుపచ్చని మేలి ముసుగులో దోబూచులాడుతోంది. సున్నితమూ ఆరోగ్యంగా ఉన్న చేతులు బంగారు గాజులతో మెరుస్తున్నాయి.

ఆమె సౌందర్యాన్ని కన్నార్పకుండా చూశాడు. ఆ మేనా అతని దగ్గరగా వచ్చినపుడు ఆమెకు అభివాదం చేశాడు. ఆ క్షణంలో ఆమె అతనిని గమనించింది.

ఒక్క క్షణం వారి చూపులు కలుసుకున్నాయి. ఆమె దాటి వెళ్ళేటప్పుడు అతనిపైకి వచ్చిన సుగంధ పరిమళాలు ఏమిటో అతనికి అర్థంకాలేదు. అంతలోనే ఆమె ఊరేగింపు ఆ ఉద్యానవనంలోకి వెళ్ళిపోయింది!

“ఆఁ, నేను ఈ నగరంలో అడుగుపెట్టిన వేళావిశేషం బాగుంది!” అనుకున్నాడు. అప్పటికప్పుడే ఆ వనంలో ప్రవేశించాలనే కోరికను అదుపు చేసుకున్నాడు. అప్పుడే అతనికి, ఆ సేవకుల చెలికత్తెల చూపులు గుర్తుకు వచ్చింది. అతన్ని అసహ్యంగా, అపనమ్మకంగా చూశారు!

అవును. ఇంకా నేను సన్యాసినేకదా! ఇంకా భిక్షపాత్రతోనే ఉంటున్నానుకదా! ఈ విధంగా ఈ వనంలోకి ప్రవేశించటం ఎలా సాధ్యం? అతను పెద్దగా నవ్వుకున్నాడు! అతనికి తారసపడినవారిని అడిగాడు, ఈ సుందరాంగి ఎవరు? ఈ ఉద్యానవనం ఎవరిది అంటూ. ఆమె కమల అనీ ఎంతో ప్రఖ్యాతిగల నగర వధువు అని, ఈ ఉద్యానవనంతోపాటు నగరంలో ఒక భవనం కూడా ఉన్నదని తెలియవచ్చింది.

అప్పుడు నగరంలో ప్రవేశించాడు. ఇప్పుడతనికి ఒకే గమ్యం! అది సాధించేందుకు నగరమంతా తిరిగాడు. వీధులన్నీ పరిశీలించాడు. దుకాణాలన్నీ కలియతిరిగాడు. నది ఒడ్డున మెట్లమీద విశ్రాంతి తీసుకున్నాడు. సాయం సమయానికి ఒక క్షురకుని సహాయకునితో స్నేహం చేశాడు. అతన్నే విష్ణుదేవుని ఆలయం చెంత కూడా చూశాడు. అప్పుడు అతనికి లక్ష్మీనారాయణుల కథలు చెప్పాడు. ఆ రాత్రి నది ఒడ్డున ఉన్న పడవల నీడలో నిదురించాడు. తెలతెలవారుతుండగా క్షురకుని సహాయకుని దగ్గరకు ఇంకా ఎవ్వరూ రాక మునుపే వెళ్ళి చింపిరి గడ్డాన్ని తీయించి వేశాడు. తన పొడవాటి కేశాలను తగ్గించి, సంపెంగ నూనెతో మర్దనా చేయించాడు. అప్పుడు వెళ్ళి నదిలో స్నానం చేశాడు!

ఆ మధ్యాహ్నం సుందరాంగి కమల, తన పూదోటకు వచ్చే సమయానికి, సిద్ధార్థుడు మొగదల నిలబడి ఉన్నాడు. ఆమెకు అభివాదం చేశాడు! ఆమె ప్రత్యభివాదం స్వీకరించాడు. ఆ ఊరేగింపు చివరలో ఉన్న సేవకుణ్ణి పిలిచి ఆమెతో మాట్లాడాలి, అనుమతి తీసుకోమని చెప్పాడు! కొంతసేపటికి ఆ సేవకుడు తిరిగివచ్చి అతన్ని తోడ్కొని, కమల వయ్యారంగా శయనించి ఉన్న మండపం లోనికి ప్రవేశపెట్టాడు!

"ఆఁ... నిన్న నీవేకదూ, నాకభివాదం చేసింది?" కమల అడిగింది!

"అప్పుడు నీకు పొడవాటి జుట్టు, గడ్డం కూడా మాసినట్లుంది? నీ ఒళ్ళంతా దుమ్ముతో కూడా చూసినట్లు గుర్తు."

"అవును, నీవు అన్నీ నిశితంగానే చూశావు. నీవు చూసింది సిద్ధార్థ, బ్రాహ్మణ కుమారుణ్ణి. శ్రమణుల్లో కలిసి మూడు సంవత్సరాలు అరణ్యాల్లో తిరిగిన సిద్ధార్థుణ్ణి. కానీ ఇప్పుడు ఆ మార్గాన్ని వదలివేశాను. ఈ నగరంలో ప్రవేశించి మొదట నిన్నే కలిశాను. సిద్ధార్థుడు కళ్ళు దించకుండా మాట్లాడిన మొట్టమొదటి స్త్రీవి నీవే కమలా! ఇక ముందెన్నడూ అందమైన స్త్రీతో మాట్లాడే సమయంలో చూపులు మరల్చాల్సిన అవసరం లేదు!"

కమల నవ్వింది. నెమలి ఈకల విసనకర్రతో విలాసంగా ఆడుకుంటూ.

"అందుకేనా, సిద్ధార్థుడింత దూరం వచ్చింది?"

"నేను నీకు కృతజ్ఞతలు తెల్పేందుకు, నీ అందానికి హారతులర్పించేందుకు, ఇంకా నీకు ఇబ్బంది లేకపోతే నీ స్నేహం కోరి, నీ శిష్యరికం చేసేందుకు కూడా. నీ విద్యలో నాకు పాఠాలు చెప్పగలవని నమ్మకంతో ఉన్నాను!"

కమల బిగ్గరగా నవ్వింది.

"సరిగ్గా గుడ్డలు కూడా లేని ఒక శ్రమణ సన్యాసి ఎక్కడో అడవిలో నుంచి వచ్చి నా విద్య నేర్పమని అడగటం ఇదే మొదటిసారి!

"ఎందరో యువకులు, బ్రాహ్మణ కుమారులు కూడా వస్తారు. వారికి ఖరీదైన వస్త్రాలు, చక్కని పాదరక్షలు ఇంకా కావలసినంత ధనం ఉంటుంది. ఇవన్నీ నా చెంతకు రావాలంటే కనీస అర్హతలు సిద్ధార్థా!"

"ఇప్పటికే నీ దగ్గర నేర్చుకోవటం మొదలుపెట్టాను. నిన్నటినుంచీ గడ్డం తీసివేశాను. జుట్టు కత్తిరింపించాను. వాసన నూనె రాయించి సంస్కరించాను. కమల, నీవు చెప్పిన ఖరీదైనవన్నీ చేకూర్చటం పెద్ద కష్టం కాకపోవచ్చు.

"సిద్ధార్థ ఎంతో క్లిష్టతరమైన కార్యాల్ని నెరవేర్చాడు. వానితో పోలిస్తే ఇవన్నీ చాలా చిన్న విషయాలే!"

"అంతేకాదు. నీవు నేర్పబోయే ప్రేమ పాఠాలకంటే కఠినమైన కార్యాలు నేర్చుకున్నాను. నీకు తగిన శిష్యునిగా నేను తప్పక సరిపోతాను.

"ఇప్పటికి సిద్ధార్థ ఈ వేషంలో నీకు నీ శిష్యరికానికి పనికిరాడా?"

మళ్ళీ కమల నవ్వి "లేదు. నీకు మంచి బట్టలుండాలి, అందమైన పాదరక్షలుండాలి. నీ దగ్గర కావలసిన పైకం, నాకోసం బహుమతులు కూడా ఉండాలి! ఇప్పుడు అర్థమయిందా?" అంటూ అతని సమాధానం కోసం ఆగింది!

"ఆఁ.. బాగా తెలిసింది. ఎర్రటి నీ అందమైన పెదవులు చెపితే అర్థం కాకుండా ఉంటుందా?

"నీ నిండు పెదవులు దొండపండుల్లా ఉన్నాయి, ఎర్రగా. నావి కూడా నీ నోటికి సరిపోతాయి!

"కానీ కమలా, ఒక్క విషయం చెప్పు. నీకు ఈ శ్రమణ సన్యాసి అడవి నుంచి హఠాత్తుగా వచ్చి నీ దగ్గర ప్రేమ పాఠాలు నేర్పమని అడుగుతున్న మోటువాడిని చూసి నీవు భయపడటంలేదా?"

"నేనెందుకు భయపడతాను! జాగిలాల మధ్యనుంచి, అడవి జీవితంలో నుంచి ఏనాడూ ఒక స్త్రీని కూడా ఎరగని సన్యాసిని చూసి నేనెందుకు భయపడాలి?"

సిద్ధార్థ "శ్రమణుడు శక్తిగలవాడు. అతనికి భయమనేది తెలియదు. నిన్ను బలాత్కారం చేయవచ్చు. నీ నుంచి అన్నీ దోచుకుపోవచ్చు. పైగా నిన్ను గాయపరచవచ్చు కూడా" అన్నాడు.

"లేదు, శ్రమణా! నాకు భయంలేదు. ఎవరైనా నీ దగ్గరకు వచ్చి నీ విద్యను, నీ జ్ఞానాన్ని దొంగిలించగలరా? నీ దైవ భక్తిని దోచుకోగలరా? లేదు. అది సాధ్యం కాదు. అవి నీ మేధకు సంబంధించినవి. నీకిష్టమైనవి మాత్రమే ఇవ్వగలవు.

"అలాగే కమల ప్రేమను, కామకేళీ సుఖాలను కూడా తన ఇష్టం లేకుండా ఎవ్వరూ తీసుకోలేరు!

"అవును, నీవన్నట్లు నా పెదవులు తేనెలూరుతాయి కాని నా ఇచ్ఛ లేకుండా అవి నీకు ఏమీ మాధుర్యాన్ని ఇవ్వలేవు!

"అవును సిద్ధార్థా! నీవు సరైన శిష్యుడవే. అందుకని ఇది కూడా నేర్చుకో. అడిగితేనో లేదా ఎవరైనా బహుమతిగా ఇస్తేనో నీకు ప్రేమ దొరుకుతుంది. కానీ నీవు దొంగిలించలేవు. ఈ విషయం నీవు సరిగా అర్థంచేసుకోలేదు."

సిద్ధార్థుడు ఆమెకు అభివాదం చేసి "అవును కమలా, ఈ విషయంలో నాది పొరపాటే!

"తేనెలూరే నీ పెదవుల మాధుర్యాన్ని వృథా పోనీయకు. నేను కూడా నీవు చెప్పినవన్నీ సమకూర్చుకుని మళ్ళీ వస్తాను.

"ఈ విషయంలో నాకేమైనా సాయం చేయగలవా?"

"తప్పనిసరిగా ఎవరైనా నీలాంటివానికి సాయం చేయటానికి వెనుకాడరు."

"అయితే ఇవన్నీ సమకూరే మార్గాలేమిటి? అదీ త్వరగా, వీలైనంత త్వరగా."

"నీ విద్యను, నీవు నేర్చిన జ్ఞానాన్ని ఉపయోగించి ఇవి సంపాదించు. పేదవానికి ఇవన్నీ ఎలా వస్తాయి మరి?"

అప్పుడు సిద్ధార్థ *"నేను ఆలోచించగలను, వేచి ఉండగలను, ఆహారం లేకుండా ఉండగలను."*

కమల

"ఇంకా ఏమీ లేదా" కమల.

"...... కవితలల్లగలను,

"నా కవితకు ఒక తీయని ముద్దివ్వగలవా?"

"నాకు నచ్చితే అలాగే" కమల.

సిద్ధార్థుడు ఒక్క క్షణం ఆలోచించి,

"పూదోట దారిలో వచ్చింది కమల,
ఆమె ముంగిట నిలిచాడు శ్రమణ,
ఆ పద్మ నయనాలను చూసి అభివాదం చేశాడు.

నవ్వుతూ స్వీకరించింది కమల.
ఇప్పటివరకూ దేవతార్చనలు,
ఇక నా పూజలన్నీ కమలకే"

కమల ఆనందంతో చప్పట్లు కొట్టింది.

ఆమె బంగారు గాజులు శృంగార శబ్దాలు చేశాయి. "నీ కవిత నాకు నచ్చింది శ్రమణా. ఇప్పుడు నీకు ముద్దుపెడితే నాకు పోయేదేమీలేదు!" అతన్ని కళ్ళతో దగ్గరకు పిలిచింది. ఆమె ముఖాన్ని దగ్గరగా చూశాడు. దొండపండు నిండు పెదవులను చుంబించాడు. కమల ఆ ముద్దులోని మాధుర్యాన్ని అతనికి మనస్ఫూర్తిగా అందిచింది. ఆ మొదటి పాఠానికి అతనికి ఎక్కడాలేని ఉత్సాహం వచ్చింది! ఆమె ఎంత మంచి గురువో అతనికి ఆ క్షణంలోనే అర్థమైంది. ఒక నిట్టూర్పుతో నిలబడి, బాలునికి విజ్ఞాన సారమంతా ఒక్కసారే అందినట్లు ఆశ్చర్యపోయాడు.

"నీ కవిత అద్భుతంగా ఉంది. నా దగ్గర ఉంటే నీకు బహుమతి ఇచ్చేదానినే! కానీ కవితలతో నీ కోరికలు తీరవు సిద్ధార్థ! నా స్నేహం కావాలంటే నీవు ఇంకా సంపాదించాలి! సిద్ధార్థా, ఆలోచించటం వేచి ఉండటం ఉపవాసం చేయటం మినహా ఇంకేమీ రావా నీకు?"

"ధ్యానగానాలు వచ్చుకాని ఇప్పుడు అవి వదిలివేశాను. మంత్రోచ్ఛారణ చేయగలను. అవికూడా ఇక చేయదలచలేదు..."

"ఆగు సిద్ధార్థ. నీకు చదవను, వ్రాయను వచ్చుకదా!"

"అవి చాలామంది చేయగలరు."

"లేదు సిద్ధార్థ! చాలామందికి రాదు. నాకే రాదు."

ఆ సమయంలో ఒక సేవకుడు వచ్చి ఏదో ఆమెకు చెప్పాడు.

"సిద్ధార్థ, నా కోసం ఒక మిత్రుడు వచ్చాడు. నీవు త్వరగా వెళ్ళిపోవాలి. ఎవ్వరి కంటా పడకుండా. రేపు కలుద్దాం" అంటూ ఒక సేవకుణ్ణి పిలిచి, అతనికి తెల్లని వస్త్రాలను ఇవ్వమని, కనపించకుండా బయటకు పంపమని చెప్పింది.

ఆమె చెప్పినట్లే జరిగింది. అతను తృప్తిగా బయటకు వచ్చేశాడు. ఆ తెల్లని వస్త్రాన్ని పట్టుకుని నగరంలోనికి వచ్చాడు. ఎక్కడో ఒక సత్రం దగ్గర నిలబడ్డాడు.

వారిచ్చిన అన్నపు ముద్దతో ఇవతలికి వచ్చాడు. రేపటి నుంచి ఈ పని కూడా చెయ్యవలసిన అవసరం ఉండదు. ఒక్కసారిగా అభిమానంతో పొంగిపోయాడు. ఇంక ఆహారం కోసం చేయి చాచవలసిన పని ఉండదు. చేతిలో ముద్ద కూడా కుక్కకు వేశాడు! అతను నిరాహారంగానే ఉన్నాడు. ఇక్కడి జీవితం చాలా సరళంగా, నిష్కపటంగా ఉన్నది. కష్టాలేమీ ఉన్నట్లు లేవు. శ్రమణ జీవితం దుర్భరం, కష్టభూయిష్టం, చివరకు అగమ్యం. ఇప్పుడు ఇక్కడ అంతా చాలా సరళం. కమల ముద్దు నేర్పినంత మధురం. ఇప్పుడు బట్టలకు పాదరక్షలకు విత్తం కావాలి. వీటికోసం ఎవరినీ కనీసం నిద్ర కూడా లేపవలసిన అవసరంలేదు! మర్నాడు నగరంలోని కమల భవనానికి వెళ్ళాడు.

“ఆఁ.. అన్నీ బాగానే కుదురుకున్నాయి. “కామస్వామి, నీ కోసం ఎదురు చూస్తుంటాడు. ఈ నగరంలో బాగా సంపాదించిన వ్యాపారి. అతన్ని ప్రసన్నం చేసుకోగలిగితే నీకు ఉద్యోగం ఇస్తాడు. అలా అని అతనికి తలవంచకు సిద్ధార్థ! అది నాకు ఇష్టంలేదు. నీ గౌరవం తగ్గకూడదు. అతనికి సమానంగా నీవు నిలబడగలగాలి. అతనితో స్నేహం చెయ్యి. నీ సామర్థ్యం మీద నాకు నమ్మకం ఉంది!”

ఆమెకు కృతజ్ఞతలు తెలిపి నవ్వాడు.

అతను రెండు రోజుల నుండి ఆహారం లేకుండా ఉన్నాడని తెలిసి పండ్లు, ఫలహారం తెప్పించి దగ్గర ఉండి తినేట్లు చేసింది.

“సిద్ధార్థ! నీవు అదృష్టవంతుడవు. నీకు అన్ని ద్వారాలు వాటంతట అవే తెరుచుకుంటున్నాయి.

“ఏమిటి నీ రహస్యం, సిద్ధార్థ?”

“నిన్న చెప్పానుగా, నేను ఆలోచిస్తాను, వేచి ఉంటాను, ఉపవాసం చేస్తా అని. కానీ అవి ఉపయోగపడతాయని నీవు అనుకోలేదు. వాటి ఉపయోగం నీకూ తెలుస్తుంది.”

“శ్రమణ సన్యాసి ఏమి నేర్చుకోగలడో ఎంత త్వరగా నేర్చుకోగలడో చూస్తావు. మొన్నటివరకూ చింపిరి జుట్టు బిచ్చగాణ్ణి. నిన్ననే నిన్ను ముద్దుపెట్టుకున్నాను. త్వరలో వ్యాపారం కూడా చేయగలను. డబ్బుతోపాటు నీవడిగినవన్నీ తేగలను.”

"కావచ్చు. కానీ కమల లేకపోతే ఇవన్నీ సాధ్యమా?"

"నీ తోటలో ప్రవేశించినప్పుడే నా మొదటి అడుగు వేశాను! నా నిర్ణయం, ప్రేమ, కామకేళీ, అందమైన యువతి దగ్గర నేర్వాలని ఆ నిర్ణయం చేసిన మరుక్షణం నేను సాధించగలనని నమ్మకం నాకుంది. అది నీవు మొదటిరోజు నన్ను చూసినప్పుడే నాకు సానుకూలత చిక్కింది."

"ఒకవేళ నేను ఇష్టపడకపోతే?"

"కానీ నీవు ఇష్టపడ్డావు కదా. శ్రద్ధగా విను కమలా.

"నీళ్ళల్లో రాయివేస్తే అది ఎంతో త్వరగా అడుగున చేరుతుంది. అదే దగ్గరి దారికదా.

"అదే సిద్ధార్థ! ఒక లక్ష్యం ఒక గమ్యం పెట్టుకుంటే, ఇక అతడేమీ చేయడు. దానిగురించే ఆలోచిస్తాడు. దానికోసం వేచివుంటాడు నిద్రాహారాలు మాని అయినాసరే.

"నీటను వేసిన రాయిలాగానే నా లక్ష్యం నన్ను తీసుకుపోతుంది! ఇంకేమీ అతనికి మధ్యలో రావు. అతన్ని ప్రక్కదారి పట్టించవు. అదే నేర్చుకున్నాను శ్రమణుల దగ్గర. ఇదేమీ మంత్రతంత్రాలు కావు. మూర్ఖులు నమ్మే దెయ్యాలు ఎక్కడా లేవు. ఈ పని ఎవరైనా చేయవచ్చు.

"అదే ఆలోచన, అదే వేచివుండటం, అదే దీక్ష."

అతని స్వరాన్ని అందులో విశ్వాసాన్ని కమల ఎంతో ఇష్టపడింది.

అతని చూపులను మరింతగా ప్రేమించింది!

"కావచ్చు మిత్రమా. కానీ నీవు చాలా అందంగా ఉంటావు. నీ చూపులు ఆకర్షణీయంగా ఉంటాయి.

"అదికూడా నీ అదృష్టానికి కారణం కావచ్చు!

"ఆమెను ముద్దుపెట్టుకుని, అలాగే అనుకుంటాను.

"నా చూపులు నీకానందాన్ని ఇవ్వాలని, నా అదృష్టం నీ దగ్గర్నుంచే రావాలని ఆశిస్తాను."

జనంతో...

సిద్ధార్థ కామస్వామిని కలిసేందుకు వెళ్ళాడు. సేవకులు అతన్ని ఆ శ్రీమంతుని ఇంట్లో ఒక విలాసవంతమైన గదిలో కూర్చోబెట్టారు.

అంతలో కామస్వామి ఆ గదిలో ప్రవేశించాడు. మధ్యవయస్కుడు, చురుకైన కళ్ళు, చిరునవ్వుతో వెలుగుతున్న ముఖం. ఎంతో స్నేహపూర్వకంగా తన అతిథిని స్వాగతించాడు.

"మీరు విద్యాధికులని, నా సహాయం కోరి వచ్చారని విన్నాను.

"మీకు నా సహాయం కావాలా...?"

"లేదు, ఇంతవరకూ అటువంటి స్థితి రాలేదు. నేను శ్రమణుల దగ్గర నుంచి వచ్చాను."

"అయితే, శ్రమణులకు వారిదంటూ ఏమీ ఉండదుకదా."

"అవును, నాకంటూ ఏమీలేదు. అదీ నా ఇచ్ఛమేరకే. అందుకే నాకు ఏ అవసరమూలేదు."

"మరి ఎలా జీవిస్తారు, మీదంటూ మీకేమీ లేకపోతే?"

"ఇంతవరకూ ఆ ఆలోచనే రాలేదు. గత మూడు సంవత్సరాలలో ఆ అవసరం కూడా రాలేదు."

"అలా అయితే మీరు ఇతరుల మీద ఆధారపడి జీవిస్తున్నారన్నమాట."

"కావచ్చు. మీలాంటి వ్యాపారులు కూడా అంతేకదా?"

"నిజమే. కానీ మేము ఊరికే ఏమీ తీసుకోము. బదులుగా ఏదో వస్తువులిస్తాముకదా."

"అవును, అలాగే కనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ తీసుకుంటారు. ప్రతి ఒక్కరూ ఇస్తారు. జీవితమంటే, లోకమంతా అంతేకదా."

"అదే నిజమైతే మీ దగ్గర ఏమీ లేకపోతే మీరెలా ఇతరకులకు ఇవ్వగలరు?"

"ప్రతి ఒక్కరు ఏదో ఒకటి ఇస్తుంటారు. సైనికుడు తన ధైర్యాన్ని, వ్యాపారి సరుకులను, ఉపాధ్యాయుడు తన విద్యను, వ్యవసాయదారుడు తన పంటను."

"బాగుంది. మీరేమి ఇవ్వగలరు? ఏమి నేర్చుకున్నారు?"

"నేను ఆలోచిస్తాను, వేచి ఉంటాను. దీక్ష చేయగలను."

"అంతేనా?"

"అంతే అనుకుంటాను."

"వీటివల్ల ఉపయోగం ఏమిటి? ఉదాహరణ మీ ఉపవాసంవలన?"

"అది చాలా విలువైనది.

"మీకు తినటానికి ఏమీ లేనపుడు, ఉపవాసం ఎంతో ఉత్తమమైనది. ఈరోజు నేను ఆకలిని అదుపులో పెట్టుకోలేకపోతే మీ దగ్గర పనికోసం అడగవలసి వచ్చేది. ఆకలి ఎంత అథోస్థితికైనా తీసుకుపోయేదికాని, నేను ఆహారం లేకుండా వేచి ఉండగలను. ప్రశాంతంగా."

"నీవు సత్యమే చెప్పావు. ఒక్క క్షణం..." అని కామస్వామి ఒక ఒప్పంద పత్రం చూపించాడు. సిద్ధార్థ అందులోని విషయాలు బిగ్గరగా చదివాడు.

"బాగుంది, మీరు వ్రాయగలరా?"

సిద్ధార్థ, "వ్రాయటం మంచిది. ఆలోచన ఇంకా మంచిది. వివేకం మంచిది, ఓర్పు ఇంకా మంచిది" అని వ్రాసి చూపాడు.

"చాలా బాగా వ్రాశావు. మనం ఇంకా ఎన్నో విషయాలు మాట్లాడాలి. కానీ ప్రస్తుతానికి నా అతిథిగా ఉండవచ్చు!" సిద్ధార్థ అతనికి కృతజ్ఞతలు తెలిపి అంగీకరించాడు.

ఇప్పుడు సిద్ధార్థకు మంచి బట్టలు, అందమైన పాదరక్షలు, ప్రతి దినం స్నానం, రుచికరమైన భోజనం అన్నీ సేవకులు అందిస్తున్నారు. సిద్ధార్థ ఒక్కసారే భుజించేవాడు, మధువు తీసుకొనేవాడు కాదు. కామస్వామి, సిద్ధార్థకు అతని వ్యాపారం, సరుకుల వివరాలు, లాభనష్టాలు ఎన్నో విషయాలు వివరించాడు. సిద్ధార్థ ఎంతో శ్రద్ధగా విని, తక్కువ మాట్లాడేవాడు. కమల చెప్పిన విషయం అతనికి జ్ఞాపకం ఉన్నది. "నీవు అతనికి సమానంగా ఉండాలి. తల వంచి, తలవంపులు తేవద్దు."

సిద్ధార్థ, కామస్వామిని గౌరవించేవాడు కాని అతనికి తనను తక్కువ చేసేందుకు అవకాశం ఇచ్చేవాడు కాదు. ఎక్కువ కాలం కామస్వామి ఇంట్లో ఉండలేదు. అప్పటికే అతనికి వ్యాపార వివరాలు బాగా తెలిసాయి.

కమల ఆహ్వానంతో ఆమెను కలిసి, ఆమెకు బహుమతులు ఇచ్చాడు. ఆమె అందమైన పెదవుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. ఆమె ప్రేమతోపాటు ఆమె మృదువైన మునివేళ్ళు అతనికి ఎన్నో కామకేళీ కలాపాలు నేర్పాయి.

"సిద్ధార్థ! ప్రేమించటం తెలిస్తేనే ప్రేమించబడతావు. ప్రతి కదలిక, ప్రతి స్పర్శ, ప్రతి చూపు శరీరంలోని అణువణువులోనూ ఆనంద రహస్యాలు దాగివున్నాయి. అవి అర్థమైననాడే నీకు ఈ విద్యలోనూ పూర్తి అవగాహన, ఇంద్రియానందం, హృదయ స్పందన సమ్మిళితమైన ఒక ఏకీకృతానుభూతి పొందగలవు.

"ప్రేమికులు రత్యనంతరం వెంటనే విడిపోరాదు. ఈ మదన కదనంలో జయాపజయాలుకాక, పరస్పర అభినందనలే ఉంటాయి. ఒకరిని ఒకరు తక్కువచేసి చూడకూడదు."

ఆమెతో అతను గడిపిన సమయం ఎంతో మధురం. ఇటువంటి తెలివిగల, అందమైన జవరాలి శిష్యుడిగా, ఆమె ప్రియుడిగా, ఆమె స్నేహితుడిగా ఇప్పుడు అతని జీవితం ఎంతో అర్థవంతమైన సందర్భంలో ఉన్నట్లుగా అనుకున్నాడు. కామస్వామి వ్యాపారం అతనికి ఒక ఆట, ఆటవిడుపు మాత్రమే.

కామస్వామికి రోజులు గడిచినకొలదీ సిద్ధార్థ వివేకం, చురుకుతనం అర్థమయ్యాయి. అతనితో ఎంతో ముఖ్యమైన పత్రాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు వ్రాయించేవాడు. సిద్ధార్థ వ్యాపారం గురించి శ్రద్ధగా వినేవాడు. కానీ తోటి వ్యాపారులతో ఎంతో మెలకువగా వ్యవహరించి మన్ననలను పొందేవాడు.

కామస్వామి అతని మిత్రునితో "సిద్ధార్థ వ్యాపారి కాజాలడు. అతనికి ఈ విషయంలో ఏ మాత్రం ఆసక్తి లేదు. కానీ అతనికి అదృష్టం అలా కలిసివస్తుంది. అతనికి నష్టమంటే భయం ఏమాత్రం లేదు. ఈ వ్యాపారం అతనికి ఒక ఆట మాత్రమే. అదీ అతనికి పూర్తిగా రాదుకూడా!" అని వాపోయాడు.

అప్పుడు ఆ మిత్రుడు "సిద్ధార్థకు లాభంలో మూడోభాగం ఇవ్వు. లాభం రుచి చూపించు. అలాగే నష్టంకూడా. దాని కష్టం కూడా. అతని వాటా ప్రకారం తెలుసుకుంటాడు. అప్పుడు అతనికి లాభనష్టాల ప్రమేయం తెలుస్తుంది" అని చెప్పాడు. కామస్వామికి ఈ ఆలోచన నచ్చింది.

తర్వాత సిద్ధార్థ ఏమైనా కొనుగోలు అమ్మకాలలో నష్టం వస్తే "అరే. ఇది ఇలా అయ్యిందే" అని నవ్వుకునేవాడుకానీ ఆందోళన చెందేవాడు కాదు. ఒకసారి ఒక గ్రామానికి వడ్లు కొనేందుకు వెళ్ళాడు. అప్పటికే అక్కడి పంటనంతా మరొక వ్యాపారి కొనుగోలు చేశాడు. అయినా సిద్ధార్థ ఆ ఊరిలోనే కొన్ని రోజులు ఉండి అక్కడి వ్యవసాయదారులతో, ఊరి జనంతో ఎంతో కలివిడిగా గడిపాడు. వారి బ్రతుకు తీరు, కష్టసుఖాలు తెలుసుకున్నాడు. వారి పిల్లలకు పైకం ఇచ్చి సంతోషపెట్టాడు. ఒక వివాహం కూడా దగ్గరుండి జరిపించాడు. ఎంతో తృప్తిగా తిరిగి వచ్చాడు.

కామస్వామి చాలా చిరాకుపడ్డాడు. "సరుకు లేకపోతే వెంటనే వచ్చేయాలిగాని అనవసరంగా సమయం, పైకం వృథాచేసి ఇన్నాళ్ళు ఎందుకు ఉన్నట్లు?" అని నిందాపూర్వకంగా మాట్లాడాడు.

సిద్ధార్థ "నన్ను నిందించకు మిత్రమా. ఈ ప్రయాణం నాకెంతో తృప్తినిచ్చింది. వ్యాపారం ఇప్పుడు కాకపోతే వచ్చేకాలంలో వస్తుంది. అక్కడి ప్రజలందరూ ఇప్పుడు నాకు ఆప్తులు."

"అయినా ఇది పద్ధతి కాదు సిద్ధార్థ" అని కామస్వామి అన్నపుడు–

"మిత్రమా, ఎప్పుడైనా నాతో నీకు ఇబ్బంది అనుకుంటే ఒక్క మాట చెప్పండి. మరుక్షణం నా దారిన నేను వెళ్ళిపోతాను" అని నవ్వుతూనే "అప్పటివరకు మనం స్నేహితులుగానే ఉందాం!" అన్నాడు.

మరోసారి "సిద్ధార్థ, నీకు వ్యాపారం ఎంతో నేర్పాను. నీవు నా మాట లక్ష్యపెట్టడంలేదు" అన్నపుడు–

"లేదు మిత్రమా, నీవు సరుకుల ధరలు మాత్రమే తెలిపావు. ఆలోచించటం నీ వద్ద నేర్చుకోలేదు. ఇప్పుడైనా నీవు ఆ విషయం నా నుంచి నేర్చుకుంటే మంచిది" అన్నాడు.

సిద్ధార్థకు ఈ వ్యాపారం మీద మనసు లేదు. కమలకు ఇచ్చే బహుమతులు, ధనం కోసమే ఇందులో ఉన్నాడు. తర్వాత అమాయకులైన జనం మధ్య అతను ఎంతో ఆనందంగా ఉండగలుగుతున్నాడు. వాళ్ళనే ప్రేమించగలుగుతున్నాడు. సామాన్య జనులు చిన్నచిన్న విషయాలకు బాధపడటం, తిట్టుకోవటం, కొట్టుకోవటం చూస్తే అతనికి జాలి వేసేది. ఇటువంటివి అతనికి అంటేవి కావు. అర్థంకూడా అయ్యేవి కాదు!

అందరినీ ఆహ్వానించేవాడు, సరుకులు తెచ్చే రైతుని, అప్పుకోసం వచ్చే వ్యాపారిని, భిక్ష కోసం వచ్చే పేదవాడిని, అందర్నీ ఆదరించేవాడు. ఆ పేదవాడు తన పేదరికం గురించి ఎంతోసేపు చెప్పిన తర్వాత సిద్ధార్థుడు – 'అయినా ఇతను శ్రమణునికంటే పేద కాదు' అనుకునేవాడు.

కామస్వామి కష్టసుఖాలను కొంతవరకే తెలుసుకునేవాడు. అతని అధికారాన్ని కూడా హద్దు మీరనిచ్చేవాడు కాదు. అందరితో కలిసి అన్ని విషయాలు చర్చించి అందరికీ ఆలోచన చెప్పి అందరి ఆదరణ పొందేవాడు. పూర్వ జీవితంలో దైవ ప్రార్థనలు, వేదపారాయణంతో అతని మస్తిష్కం మార్మోగేది. ఇపుడు సామాన్య ప్రజల కష్టసుఖాలతో అతని ఆలోచనలు నిండిపోయాయి.

అప్పుడప్పుడు అతని అంతర్వాణి ఎక్కడో సన్నగా వినిపించేది! 'అరె, ఏమిటిది? ఏమి చేస్తున్నావు!' అన్నట్లు వినీ వినపడనట్లు. అప్పుడే అతనికి తను ఒక వింత. అపరిచిత జీవితం గడుపుతున్నట్లు భావించాడు. జరిగేదంతా, ఈ సుఖాలు విలాసాలు అనుభూతికి వస్తున్నా తన నిజ జీవితం తనను దాటి ప్రవహిస్తోంది. అదీ అతని ప్రమేయం లేకుండా అని గుర్తించేవాడు.

ఏదో బంతి ఆటలాగా ఈ ప్రజలలో ఈ సరకులతో ఈ కామస్వామితో ఈ విలాసాలతో ఆడుకుంటున్నట్లు, నిజానికి తన మనసిక్కడ లేనట్లు అనుకునేవాడు.

ఇలా ఆలోచించనపుడు అతన్ని ఒక రకమైన భయం ఆవహించేది. తను కూడా వీళ్ళలో కలిసిపోతే బాగుండునని, వీరి జీవితంతో మమేకమైతే ఈ బరువు తగ్గుతుందేమోనని అనుకునేవాడు. కాని కేవలం ప్రేక్షకుడి మాదిరిగానే ఈ నాటకం నడుస్తోంది.

కమలను తరచూ కలిసేవాడు. ఆమె నేర్పిన కామకేళి విన్యాసాలన్నీ ఎంతో ఆనందంగా నేర్చుకున్నాడు. మమతానురాగాలు ఇచ్చిపుచ్చుకోవడం ఒక్కటిగా తలపోశాడు. కమల అతన్ని ఎంతో లోతుగా అర్థంచేసుకుంది. గోవిందకంటే దగ్గరగా! ఆమెకూడా సిద్ధార్థలాంటి సహజ ప్రవృత్తిగల వ్యక్తి కాబట్టి కావచ్చు.

సిద్ధార్థ– ''నీవు నాలాంటిదానివే. ఈ సామాన్యులకు భిన్నంగా నీ అంతరంగంలో ఎంతో ప్రశాంతత ఉంది. ఏదో పవిత్ర మందిరం ఉంది. అందులోకి నీవెప్పుడైనా వెళ్ళిపోవచ్చు! అది ఎవ్వరికీ సాధ్యంకాదు. అయినా అందరూ చేయగలిగినదే" అని కమలతో చెప్పాడు.

"అందరూ వివేకవంతులు కారుకదా" కమల అన్నది.

"అది కాదు కమలా విషయం. కామస్వామికి తెలివితేటలకు లోటులేదు. కానీ అతని హృదయంలో పవిత్రత లేదు. మిగతా ప్రజలు, చిన్నపిల్లల్లా అర్థంచేసుకోలేరు.

"ఎంతోమంది రాలే ఆకుల్లా గాలికి కొట్టుకుపోతూవుంటారు. కొంతమందే నక్షత్రంలా ఒక నిర్దిష్ట మార్గంలో ప్రయాణం చేస్తారు. వారిని ఏ గాలీ తాకలేదు.

"వారి అంతరంగంలోనే ఆ చోదకశక్తి, ఆ మార్గదర్శి ఉంటుంది. అటువంటి మహానుభావుడు గౌతముడు! ప్రజలకు ఉపదేశం ద్వారా నిర్వాణ మార్గాన్ని బోధిస్తున్నారు. వేనవేల శిష్యులు ఆయన మార్గంలో బ్రతుకు బంధాల నుంచి విముక్తులవుతున్నారు."

"మీరు మళ్ళీ గౌతముని ప్రసక్తి తెస్తున్నారు. మీరు మళ్ళీ శ్రమణుల ఆలోచనలు చేస్తున్నారు" అంటూ అతనితో రతి క్రీడకు సన్నద్ధమైంది. ఎన్నో భంగిమల కామకేళి

కళను, ఆమెకు తెలిసిన విద్యను అతను ముందు విన్యసించింది. అతని బలమైన శరీరం ఎంతో అనుకూలంగా, ఆత్రంగా, శరాసనంలా, ఏకాగ్రతతో ఆ ఆనంద సముద్రంలో మదనకేళి విలాసంలో ఈదులాడింది. అలసిసొలసి ఆమె ప్రక్కనే పరుండిపోయింది.

అప్పుడు కమల అతన్ని ఎంతో పరీక్షగా చూసి "నీలాంటి ప్రియుడు ఎవరూ ఉండరు. నీవు ఎంతో గొప్ప రసికుడివి. ఏదో ఒకనాడు నీ బిడ్డకు తల్లినవుతాను. కానీ నీవు ఎవరినీ ప్రేమించవు. మానసికంగా నీవు సన్యాసివే. అవునా" అంది.

"కావచ్చు కమలా, నీలాగానే. లేకపోతే ప్రేమను, విద్యగా కళగా నీవు నేర్పగలవా?

"మనలాంటివాళ్ళు ప్రేమించలేరు. మామూలు జనం ప్రేమిస్తారు. అదే వాళ్ళ రహస్యం."

ధన జాడ్యం



సంసారం

సంసారం

ఈ లౌకిక జీవన విధానంలో ఎంతో కాలం గడిచినా, సిద్ధార్థ తామరాకుపై జలబిందువులా, ఈ భవప్రభావానికి లోను కాకుండా ఉండిపోయాడు. శ్రమణుల సాంగత్యంలో తాను నిర్దాక్షిణ్యంగా, అణగద్రొక్కిన తన ఇంద్రియ స్మారకాలన్నీ ఇప్పుడు నిద్రలేచి ఉద్రేకభరితాలవుతున్నాయి.

ఎంతగా ఐశ్వర్యంలో తులతూగినా, అధికారంలో విలసిల్లినా, రసోద్రేకంలో మైమరచినా, అతను లోలోన విరాగిగానే మిగిలిపోయాడు.

ఎప్పుడూ ఆలోచనా నిమగ్నుడై, దేనికోసమో ఎదురు చూస్తూ ఏదో దీక్షలో ఉన్నట్లు కమలకు అర్థమయ్యాడు.

ఈ ప్రపంచం, ఈ ప్రజలు, అతనికి ఎప్పుడూ అపరిచితంగానే, అన్యులుగానే మిగిలిపోయారు. ఈ కలిమి కాముకాల డోలికల్లో కాలమెంత త్వరగా గడిచిందో అతను గమనించలేదు.

సంపద, స్వగృహం, సేవకులు, నది అంచున పూలతోట, ఇప్పుడు అన్నీ ఉన్నాయి. అతని సహాయం కోరి ఎందరో వచ్చేవారు. అతన్ని ఇష్టపడేవారు. అయినా కమల మాత్రమే అతనికి చేరువైన స్నేహితురాలు.

గౌతముని దివ్యసన్నిధిని వదిలి, గోవిందుని స్నేహబంధాన్ని వీడి, తాను ఒంటరిగా జాగృతుడైన అద్భుతమైన క్షణాలు!

ఏ ఉపదేశాలు, ఏ ఉపాధ్యాయులు వద్దనుకుని తాను ఏకాకిగా, గర్వంగా నిలబడిన మహత్తరమైన సందర్భం!

తన అంతర్వాణి దివ్యము, మధురము అయిన పిలుపు కోసం నిశ్శబ్దంగా వేచిచూసిన విలువైన సమయం!

ఇవన్నీ ఇప్పుడు కేవలం తన స్మృతి పథంలో ఎంతో వెనుకబడిపోతున్నాయి.

ఒకప్పుడు, అతని అంతరంగంలో మృదుమధురంగా మార్మోగిన జ్ఞానసరస్వతి ఇప్పుడు మూగబోయింది.

అయినా శ్రమణుల పరిశ్రమ, బుద్ధుని బోధనలు, తండ్రి నేర్పిన ఉపనిషత్తుల శ్లోకాలు, అతనిని చాలా కాలం వెన్నంటే ఉన్నాయి.

సరళమైన జీవనం, ఆలోచనా వ్యాసంగం, ధ్యానసమయం, ఆత్మావలోకనం, శరీరం, భావం అయిన దివ్యాత్మ – ఇవన్నీ అతను ఎంతోకాలం నిలుపుకోగలిగాడు.

భ్రమణంలో ఉన్న సారె తిరిగి తిరిగి వేగం తగ్గి చివరికి ఆగిపోయినట్లు, అతనిలో వైరాగ్యం, ఆలోచనాసరళి, వివేచనా చైతన్యం అన్నీ చాలా కాలం మళ్ళీమళ్ళీ ఆవృత్తమౌతూనే ఉన్నాయి. కానీ మెలమెల్లగా శంకాతంకపరమై చివరికి ఒక నిశ్చల స్థితికి చేరుకున్నాయి.

మోడువారుతున్న చెట్టు మొదట్లో చెమ్మ చేరి కుళ్ళబెడుతున్నట్లు–

సిద్ధార్థను, అతని అంతరంగంలో ఈ లౌకిక ప్రపంచపు స్తబ్ధత, జడత్వం చోటుచేసుకొని, ముందు ఎంతో బరువుగా తర్వాత అలసటగా చివరికి సుషుప్తిలోనికి నెట్టివేశాయి. మరోప్రక్క అతని ఇంద్రియాలు పూర్తిగా మేల్కొన్నాయి. ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు, మరెంతో అనుభవాన్ని పొందగలిగాడు.

ఇప్పుడు సిద్ధార్థ వ్యాపార వ్యవహారాలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నాడు. అధికార ప్రదర్శనలోని ఆనందాన్ని చవిచూశాడు. సుందరాంగుల సాంగత్యంలోని సుఖభోగాలను ఆకళింపు చేసుకున్నాడు. విలువైన వస్త్రాలు ధరించటంలోని ఆనందం, సేవకులను ఆజ్ఞాపించటంలోని అహంకారం, పన్నీటి జలక్రీడలలో సౌఖ్యాలను అందుకుంటున్నాడు.

ఎంతో రుచికరమైన భోజన పదార్థాల తర్వాత మాంసాహార భక్షణంలోని చాపల్యాన్ని తెలుసుకున్నాడు. మధుపానంలోని మత్తు, మతిమరుపులోని ఉదాసీనత అనుభవించాడు.

ఆ తర్వాత జూదక్రీడలోని ఉత్సాహం, వ్యక్తిగతమైన ఆసక్తి, ఆతృత గమనించాడు. నాట్యకత్తెల ఆటపాటలను ఆస్వాదించాడు. పల్లకీలలో ఊరేగింపుగా ఉద్యానవనంలో తిరిగాడు. మెత్తటి పట్టుపరుపులపై పవళించాడు.

అప్పటికీ అందరికీ భిన్నంగానే అందరికంటే ఉన్నతంగానే ఉన్నట్లు అనుకునేవాడు.

తన ముందు జరిగేదంతా ఏదో హాస్యనాటకంలా, వికట దృశ్యంలా నిరసనతో చూసేవాడు. ఇది ఒక విరాగి, ఒక శ్రమణుని దృక్పథం అనే ఆలోచించేవాడు.

వ్యాపారంలో కామస్వామి ఒడిదుడుకులతో సతమతమైతే అతన్ని ఎగతాళిగా పరిగణించాడు.

ఈ నిరసన, ఈ ఎగతాళి, తన ఔన్నత్యం మెల్లగా అతను గుర్తించేలోపుగా అంతరించిపోయాయి! అతనికి సమకూడుతున్న సంపదతోపాటు జనసామాన్యపు సాధారణ గుణాలు కూడా అతను సంతరించుకుంటున్నాడు. వారి అమాయకత్వం, వారి ఆతృత, తనలో ఆవిష్కృతమవుతున్నట్లు ఇప్పుడు అసూయతో వారిని చూస్తున్నాడు. వారికి దగ్గర అవుతున్నకొలదీ అతనికి అసూయ కూడా పెరుగుతోంది. ఎందుకు? తనకు లేనిది వారికి ఏముందని? అదే – వారు తమ జీవనానికి ఇచ్చే ప్రాముఖ్యత. వారి కష్టసుఖాలలోని సాంద్రత, వారి ఆందోళనలోని అనురాగపు మాధుర్యం, తమని తాము ప్రేమించకలిగేవారి సాధారణ మనస్తత్వాన్ని చూసి అసూయపడేవాడు. వారికిగల ఆశాపాశాలు భవిష్యత్ ప్రణాళికలు, రేపటి గురించిన ఆసక్తి – ఇవన్నీ అతనికి అసూయాకారణాలే!

కానీ తాను నేర్చుకున్నవన్నీ తను అసహించుకునేవే! తనకు ఆనందాన్నిచ్చేవి కావు. రానురాను ఈ భావన తరచూ కలుగుతోంది! ప్రతి సాయంత్రం జూదం, మధుపానం నాట్యకత్తెల విన్యాసాల దర్శనం తర్వాత అలసిసొలసి నిర్వేదంగా నిద్ర నుంచి ఉదయం లేచినపుడు అతనికీ ఆందోళన మరీ ఉధృతంగా తోచేది.

కామస్వామి వ్యాపార వివరాలతో విసిగిస్తుంటే ఈ అశాంతి మరీ ఎక్కువౌతోంది. జూదంలో ఓడిపోయినపుడు పెద్దగా నవ్వేవాడు. అప్పటికీ అతని ముఖంలో వివేక చైతన్యం వెలుగుతూనేవుండేది.

కాలక్రమంగా తానుకూడా తోటి జనంతో కలిసిపోతున్నట్లు, వారివలెనే ఇప్పుడు జూదంలో ఓడిపోతున్నపుడు తాను నవ్వలేకపోతున్నట్లు, వారి ఆందోళనే తనకు కలుగుతున్నట్లు గుర్తించాడు. ధనవంతుల ప్రత్యేకత అయిన అసంతృప్తి, ప్రేమరాహిత్యం, నిస్తేజం – ఇవన్నీ అతన్ని చుట్టుముడుతున్నాయి. మెల్లమెల్లగా ధనజాడ్యం, అతన్ని జడత్వంలో కప్పివేసింది.

ఒక మంచుతెరలా స్తబ్ధత, అలసట సిద్ధార్థను కమ్ముకుంటోంది. దినదినానికి ఆ తెర సాంద్రంగా, క్రమంగా, చీకటిగా, మరింత బరువుగా, దట్టంగా ఆవరిస్తోంది.

క్రొత్త వస్త్రాలు కాలక్రమంలో పాతపడినట్లు, వాటి వర్ణాలు వెలిసిపోయి, మాసిపోయి, మడతలుపడి, అక్కడక్కడా చివికి, చిరిగిపోయి శిథిలమైనట్లు సిద్ధార్థుని ఈ క్రొత్త జీవితం, గోవిందుడు విడిపోయినప్పుడు మొదలైన ఈ ఉత్తేజపూరితమైన జీవితం ఇప్పుడు పాతదై అవసాన దశకు చేరింది. అప్పటి ఉత్సాహం, ఆవేశం, కాలగమనంలో కరిగిపోయాయి. ముడతలు, మచ్చలతో నిండిపోతోంది. లోలోతులలో విరక్తి, విభ్రమాలు పొడసూపుతున్నాయి.

ఒకప్పుడు అతన్ని మేల్కొలిపి నడిపిన స్పష్టమూ, దివ్యమూ అయిన అంతర్వాణి ఇప్పుడు మూగవోయినట్లు గుర్తించాడు.

అతను ఈ ఉచ్చుల్లో, బ్రతుకు బంధాలతో చిక్కుపడిపోయాడు. దైహిక సుఖాలు, దురాశ, బద్ధకం, చివరిగా అతను ఎప్పుడూ నిరసించి మూర్ఖ ప్రాయమనుకున్న సంపాద్యము, లోభము కూడా అతన్ని లోబరుచుకున్నాయి. ఇప్పుడు వ్యాపారం, సంపాదన అతనికి ఆట ఏమాత్రం కాదు. అవి మోకులై మోయలేని బంధాలయినాయి.

ఈ ప్రలోభాల మార్గంలో, జూద క్రీడలో అతను అథమ స్థాయికి చేరాడు. అతని అంతరంగంలో ఇక వైరాగ్యపు ఛాయలు ఏమీ మిగిలిలేవు.

ధనం కోసం, రత్నహారాల కోసం జూదం ఆడేవాడు. పెరుగుతున్న ఉత్సాహంతో ఒకప్పుడు కాలక్షేపానికి మొదలుపెట్టిన ఈ జూదక్రీడ అతనికి ఒక వ్యాపకమై, వ్యసనమై చివరికి ఒక అవసరంగా మారింది. సిరుల మూటలు నిర్లక్ష్యంగా విసిరి సంపదను ఎగతాళి చేస్తున్నట్లు అనుభూతిని పొందేవాడు.

అతనికి ధనంమీద, సంపదమీద మనసులో ఉన్న అసహ్యాన్ని ఈ జూద క్రీడలో నిర్దాక్షిణ్యంగా ఎండగట్టేవాడు. ఒక వ్యాపారి సమాజంలో పెద్దమనిషిగా గౌరవం పొందటం అతను సహించలేకపోయేవాడు. ఆ అనాకార విగ్రహాన్ని బ్రద్దలు కొట్టేందుకు విపరీతమైన పందెములొడ్డి ఎదుటివారిని భయభ్రాంతుల్ని చేసి ఆనందించేవాడు. ఈ తీరూ తెన్నూ లేని జూదంలో ఎంతో నష్టపోతుండేవాడు, ఎంతో గెలుపొందేవాడు. తనను తాను అసహ్యించుకుంటూ ఎగతాళి చేసుకుంటూ ఎదుటివారిని తృణీకరించేవాడు. విపరీతమైన జూదంలో ధనం మణిహారాలు చివరికి తోటలో భవనం కూడా పణంగా పెట్టాడు. ఇందులో ఉన్న ఆత్రుత, ఆందోళననూ ఎంతో ఇష్టంగా అనుభవించేవాడు. మళ్ళీమళ్ళీ ఈ విభ్రాంతి కోసం, ఆత్రుత, ఆందోళన కోసం జూదంలో కూర్చునేవాడు.

చివరికి ఈ వ్యసనంలో కలిగే ఉద్రేకంలోనే ఏదో ఆనందాన్ని వెతికేవాడు. ఆ ఆనందమే ఉన్నతమైనదీ, ఉత్కృష్టమైనదీ అని భ్రమించేవాడు. ఈ నిరాసక్తమూ, నిస్సారమూ అయిన ఉనికిలో ఈ అస్తవ్యస్తమైన వ్యాపార జూదాలలో ఎంతో నష్టపోయేవాడు. మళ్ళీ సంపాదన కోసం తహతహలాడేవాడు. ఇవ్వవలసినవాళ్ళను ఒత్తిడి చేసేవాడు. మళ్ళీ పోగుచేసి మళ్ళీ వెదజల్లేవాడు.

సంపదలంటే తన నిరసన అసహ్యాన్ని ప్రదర్శించేవాడు.

ఈ పెనుగులాటలో అతని సహనం నశించి, నిర్దయుడుగా వ్యవహరించాడు. పేదలను ఆదరించటం మానివేశాడు. ఎదుటివారికి ఇవ్వటంలోని ఆనందాన్ని పోగొట్టుకొన్నాడు. ఒకప్పుడు పెద్దమొత్తం జూదంలో పోయినపుడు నవ్వగలిగిన సిద్ధార్థ, ఇప్పుడు వ్యాపారంలో హీనంగా వ్యవహరించటం అలవడింది. ఇప్పుడు ధనరాసులనే అతను కలగంటున్నాడు. ఒక్కసారిగా నిద్రలేచి, ఈ పీడకలల చీదర నుంచి, లజ్జా భావం నుంచి తనని తాను అద్దంలో చూసి అసహ్యకరంగా ఏవగించుకునేవాడు.

ఈ అంతఃకల్లోలం నుంచి మరల పారిపోవటానికి మధుపానం, జూదం, ధనసంపాదనా వాంఛలతో సతమతమయ్యేవాడు.

ఈ బాధాకర, భయంకర వలయంలో అతను వయసుమీరి అలసి రోగపీడితుడయ్యాడు.

అతనికి ఒక సంగతి గుర్తుకు వస్తోంది! ఒక చల్లని సాయంత్రం, సుందరవనంలో, కమలతో గడిపిన మధుర క్షణాలు అవి. ఆ పూపొదల మధ్య, ఆ వసంత మంటపంలో కమల అతనితో ఆర్తి అలసట మిళితమైన స్వరంతో గౌతముని విషయాలు చెప్పమని అడుగుతోంది. ఆ మహాత్ముని నయనాలు, పసికందు నవ్వు, శాంతి సౌందర్యాల నిలయమైన ఆయన శరీరం, అన్నీ అతను చెప్పగా విని–

"ఏదో ఒక దినం నేను కూడా, ఆ శాంతమూర్తి శిష్యులలో చేరి నా సిరులన్నీ ఆయనకు అర్పించి ఆయన బోధనలనే ఆశ్రయిస్తాను" అంటూ సిద్ధార్థను చూసింది. ప్రేమావేశంతో అతన్ని కౌగిలించుకుని, ముద్దాడి, కామోద్రేకంతో అతన్ని రతి విన్యాసంలో బంధించి, అత్యంత పరితాపంతో ఆర్ద్ర నయనాలతో అతన్ని చూస్తూ ఈ కరిగి కదిలిపోయే ఆనంద మాధుర్యాన్ని, అతని జీవామృతాన్ని చిట్టచివరి బిందువు వరకు స్వీకరించాలని తపించిపోయింది.

ఆ క్షణంలోనే, అప్పుడే సిద్ధార్థకు చిత్రమైన వాంఛామరణాల మైత్రీ బంధం తెలియవచ్చింది.

ఆమె అలసిన ముఖాన్ని దగ్గరగా చూశాడు. మొదటిసారిగా వయసు మళ్ళిన గుర్తులు బ్రతుకు శిశిరంలో ముదిమి నీడలు, విచారకరంగా అలుముకుంటున్నాయి. ఇప్పుడు తనకెంత వయసు? నాలుగు పదులు దాటి ఉండవచ్చు. ఒక్కసారిగా జారిపోయిన కాలపు గుర్తులు తన నెరసిన వెంట్రుకలై వెక్కిరిస్తున్నాయి. అలసట క్రమ్మిన కమల మోమును చూశాడు. ఆ అలసటలో ఆమె నిరామయ గమ్యం, ముసురుకుంటున్న ముసలితనం, క్రమ్ముకొస్తున్న శిశిరం, చివరిగా తెలియని, గుర్తించలేని మరణ భయం – అన్నీ అతనికి స్పష్టంగా ద్యోతకమవుతున్నాయి. నిట్టూర్పుతో ఆమెకు వీడ్కోలు చెప్పాడు.

ఆ రాత్రి, మధుపానంలో మదవతుల పదవిన్యాసాలలో, మిత్రుల చిత్రవలయంలో తానే ఉన్నతుడుగా ఊహించుకుంటూ గడిపాడు. మత్తులో అపరాత్రిలో నిద్రపోయేందుకు ప్రయత్నించాడు. అలసి అల్లకల్లోలమైన అంతరంగంతో, నిరాశ నిస్పృహలతో, తడారిన కన్నులతో, నిద్రలేక ఇక ఈ దురవస్థను భరించలేనట్లుగా తనను తాను నిరసించుకున్నాడు.

ద్రాక్షాసవము, కుళ్ళువాసన, నాట్యాంగనల వెకిలి నవ్వులు, వారి సాంద్రకేశ పరిమళాలు, వక్షోజాల గాఢాశ్లేష మృదుస్పర్శలు – ఇవన్నీ అతిగా, ఇప్పుడు అతనికి వెగటుగా ఉన్నాయి. అన్నింటినీ మించి తనకు తానే చీదరగా, అసహ్యంగా తోస్తున్నాడు.

ఈ నోటి వాసన, ఈ జుత్తు నూనె కంపు, క్రొవ్విన తన శరీరం – ఇవన్నీ అతనికి రోతగా కనిపిస్తున్నాయి.

మత్తుగా త్రాగి, విపరీతంగా తిని, అజీర్తితో బాధాకరంగా వాంతి చేసుకుని, తేరుకున్నవానిలాగా,

ఇప్పుడు అశాంతితో అల్లాడుతున్న తాను కూడా, ఈ మత్తు వీడి, ఈ వ్యసనాలు వదిలి, ఈ సుఖాలను రోసి, ఈ నిరర్థకమైన జీవనం నుంచి బయటపడాలి.

ఎప్పుడో తెలతెలవారుతుండగా, కళ్ళు మూతలుపడ్డాయి. కలత నిద్రలో కలగన్నాడు.

కమల ఒక బంగారు పంజరంలో అందాల పక్షిని పెంచింది. ఇప్పుడు ఆ చిన్నారి పక్షి కలలో కనిపించింది. అది ఎప్పుడూ ఉదయాన్నే 'కూ' అంటూ పాడేది! ఒక దినం అది మూగబోవడంచూసి పంజరం తీస్తే అది నిర్జీవంగా పడివుంది. ఆ పక్షిని పరీక్షగా చూసి, చేతితో తీసి, బైటపడవేశాడు. అప్పుడే ఆ పక్షితో బాటే తనలోని మంచిని, విలువల్నీ కూడా వీధిలో పడవేసినట్లు అతని హృదయం విలవిలలాడింది.

ఈ కల చెదిరిపోయింది. ఒక నిస్పృహ ఒక నైరాశ్యం, ఒక నిరాసక్తత అతన్ని ముప్పిరిగొన్నవి. ఇప్పటివరకు తను గడిపిన జీవితం నిరర్థకమని, ఏ మాత్రం విలువ లేదని, అతనికి మిగిలింది శూన్యమని, వాపోయాడు.

ఒంటరిగా తన వసంత వనానికి వెళ్ళాడు. అక్కడ ఓ మావిడ్రాను క్రింద కూర్చుని గుండె లోతుల్లో ఏదో తెలియని మరణ భయంతో వణికిపోయాడు! నెమ్మదిగా, తన స్మృతి పథంలో తనకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఎన్నో జ్ఞాపకాలు సుడులు తిరిగాయి. నిజానికి తాను ఎప్పుడు సంతోషంగా ఉన్నాడు? అవును ఎన్నో సందర్భాలలో, చిన్ననాటి ఆటపాటలతో తోటి బ్రాహ్మణులు

మెచ్చుకున్నప్పుడు, సహాధ్యాయులను ఓడించినపుడు, వేద, ఉపనిషత్తు శ్లోకాలను మిన్నగా పఠించినపుడు, తార్కిక వాద సమయంలో, హోమకార్యాలలో తాను పాల్గొన్నప్పుడు, ఎన్నో సందర్భాలలో ఎంతో ఆనందాన్ని పొందాడు.

అప్పుడు తన అంతరంగపువాణిని స్పష్టంగా వినేవాడు "నీ ముందు నీవు అనుసరించాల్సిన ఒక మార్గముంది. దేవతలు ఎదురు చూస్తున్నారు" అని ఉద్బోధించేది. యువకుడుగా ఎదిగినప్పుడు అదే గమ్యం అతన్ని ముందుకు నడిపింది. తన తోటివారి నుండి అతన్ని ఎంతో ఉన్నతంగా వేగంగా పరుగులెత్తించింది. తాను నేర్చుకున్న ప్రతి కొత్త పాఠం, అతని జ్ఞాన దాహాన్ని పెంచింది. ఆ అంతర్వాణి పిలుపు వినే తన తండ్రిని, బ్రాహ్మణ జీవనాన్ని వదలి, శ్రమణులతో అరణ్యంలో విరాగిగా కఠోర జీవితాన్ని గడిపాడు. అక్కడ నుండి తన గవేషణలో గౌతముని దర్శించి, ఆ మహానుభావుని సన్నిధిని కూడా వీడి అగమ్యపు గమనంలో పయనమయ్యాడు. అరె, ఇప్పటికి ఎన్నాళ్లయింది తన అంతర్వాణిని విని? ఇన్నాళ్ళూ తను నడిచిన దారి ఎంత నిస్తేజంగా ఎంత సాధారణంగా ఉంది?

ఏ గమ్యం లేకుండా ఎంత సుదీర్ఘ కాలం వృథా చేశాడు, కేవలం తృణప్రాయమైన సుఖాలతో, అసంతృప్తితో, అశాంతితో ఈ ప్రయాణం గడిచింది. తనకు తెలియకుండానే ఈ సామాన్య జనంలాగా వారి బ్రతుకు బాటలో నడవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. వారి దారి వేరు, వారి గమ్యం వేరు, వారి సుఖదుఃఖాలు వేరు. ఈ కామస్వామి ప్రపంచం తనకు ఒక ఆటమైదానం మాత్రమే. హాస్య నాటకమే. కేవలం కమల మాత్రమే తనకు ప్రియమైనది, విలువైనది. కానీ ఇంకా తనకు ఆమె కావాలా? ఆమెకు తాను అవసరమా? ఈ ఆటకు, అంతంలేదా? దీనిలోనే అంతం కావాలా? లేదు, ఈ సంసార వృత్తిలో తను సమసిపోకూడదు. ఇక ఈ క్రీడ ముగిసిపోయింది. ఈ ఆలోచనతో అతని శరీరంలో తీవ్రమైన ప్రకంపన కలిగింది. తనది కానిదేదో అంతమైనట్లు భావించాడు. అక్కడే ఆ పగలు ఆ రాత్రి కూర్చుని తన తండ్రిని, గోవిందుని, గౌతముని ఎన్నోమార్లు తలుచుకున్నాడు. వీరందరినీ దాటి వచ్చింది తాను ఒక కామస్వామిగా మారేందుకా? అతనికి అంత బాధలోను నవ్వు వచ్చింది. తాను ఇక్కడ తన వనంలో తన మామిడి చెట్టు క్రింద కూర్చున్నాడు. ఇవన్నీ తనవా? తనకు అవసరమా? అంతా ముగిసింది.

చాలా ఆకలితో సతమతమయ్యాడు. తన భవనం గుర్తుకు వచ్చింది. తన పడకగది మెత్తని పట్టు పరుపులు, రుచికరమైన భోజన పదార్థాలు అన్నీ మెదిలాయి. విరక్తిగా నవ్వుకున్నాడు. ఇంతటితో ఈ తెర దించాడు.

ఆ రాత్రే సిద్ధార్థ ఆ వనాన్ని, ఆ నగరాన్ని విడిచి వెళ్ళిపోయాడు. మళ్ళీ వెనుదిరిగి చూడలేదు.

చాలా కాలం కామస్వామి అతని కోసం వెతికించాడు. కానీ కమల ఆ ప్రయత్నమే చేయలేదు. ఆమెకెప్పుడూ సిద్ధార్థ ఒక యాత్రికునివలెనే ఒక పాంథుని మాదిరిగానే తోచాడు. అతనిని మానసికంగా ఎప్పుడూ విరాగిగానే ఆమె అర్థం చేసుకుంది.

ఇప్పుడు ఆమెకు తమ చివరి సమాగమం గుర్తుకు వస్తోంది. అప్పుడెంత గాఢంగా కలిసి, అతనిలో ఒదిగిపోయింది? అతను ఎంతగా తనను స్వంతం చేసుకున్నాడు, ఈ ఆలోచనలతో సిద్ధార్థ నిష్క్రమణతో ఆమె బంగారు పంజరంలోని 'కుహు' పిట్టను వదిలివేసింది. దాని గమనం చూస్తూ అది ఆకాశంలో కలిసిపోవడం ఎంత బాధాకరం!

అప్పటి నుంచి ఆమె తన భవనం తలుపులు మూసివేసింది. తర్వాత తాను సిద్ధార్థ బిడ్డకు తల్లి కాబోతున్నట్లు గుర్తించింది.

బంగారు పంజరం



నది

నది

తన భవనాన్ని, తన వసంత వనాన్ని, నగర జీవితాన్ని వదిలి సిద్ధార్థ ఎంతో దూరం అడవి దారుల్లోకి వచ్చాడు! ఇప్పటివరకూ ఇరవై సంవత్సరాల పైగా తను గడిపిన జీవితం, అనుభవించిన ప్రాపంచిక సుఖాలు, చివరకు వెగటు పుట్టే స్థాయికి చేరినట్లు, లౌకిక బంధాలలో చిక్కుపడి తన హృదయరాగం మూగవోయి మరణ ఛాయలు క్రమ్ముతున్నట్లు, ఈ భౌతిక ప్రపంచంలో తనను ఆకర్షింపకలిగిన ప్రలోభాలు ఇంకేమీ మిగలనట్లు గుర్తించి, తెలియని ప్రశాంతత కోసం తపించిపోయాడు. ఏ పిడుగో పడి, ఇప్పటివరకూ తను పొర్లాడిన ఈ బురద నుంచి తనకు విముక్తి కలిగితే, ఏ చిరుతపులో తనని నిలువునా చీల్చి తన మురికి నెత్తుటిని పీల్చివేస్తే, ఏ విషకీటకమో కుట్టి తనను శాశ్వత నిద్రలోనికి పంపితేగాని ఈ అశాంతి, ఈ ఆవేదన అంతంకాదు అనుకున్నాడు.

ఈ ఆకలి, ఈ నిద్ర, ఈ శ్వాస – ఇవన్నీ విసుగుపుట్టిస్తున్నాయి. ఈ వలయంలో విలవిలలాడి అలసిపోతున్నాడు. వాటిని ఎలా అంతంచెయ్యాలి? ఈ చింతనతో ఈ వైరాగ్యంతో ఎంతో తిరిగి ఒకప్పుడు తను దాటి వచ్చిన నది ఒడ్డుకు చేరాడు. ఇరవై సంవత్సరాలుపైన గడిచినా ఈ స్రవంతి నిండుగా, ప్రశాంతంగానే ప్రవహిస్తుంది. ఆ నది అంచునే ఒక కొబ్బరిచెట్టు నదిలోకి వంగి ఉన్నది. ఆ చెట్టును పట్టుకుని నీళ్ళలోకి చూశాడు.

అందులో కనపడుతున్న సిద్ధార్థ తనేనా? ఇంకా తనలో ఏమి మిగిలివుంది? తను ఏవగించుకునే ఈ శరీరం, దేవతలు శపించిన తన బ్రతుకు, తాను విషాదంపాలు చేసిన తన శిథిలాత్మ, ఇవన్నీ ఇప్పుడు తనకు మోయలేని బరువు.

అందుకే ఆ నదిలో తనను తను వదిలి చేపలకు మొసళ్ళకు ఆహారమైపోవాలి. తన ప్రతిబింబాన్ని చూసినకొలది తనకు అసహ్యంగా, భరించలేనిదిగా అనిపించి చేతులు వదిలి నీళ్ళలోకి జారిపోయి జలసమాధిని చేరాలని అనుకున్నాడు.

అప్పుడే ఎక్కడో మూసుకుపోయిన చీకటి తెరలమాటున తన అంతర్వాణి బలహీనమైన స్వరం, సనాతన ఓంకార నాదాన్ని తనకు వినిపించింది. అప్రయత్నంగానే 'ఓం' అంటూ అస్పష్టంగా ఉచ్ఛరించాడు. తన 'ఓంకార' శబ్దం తనకే వినబడుతోంది. ఇప్పుడు స్పష్టంగా ఒక్కసారిగా నిద్రాణమై ఉన్న ఆత్మను మేల్కొలిపినట్లు తన వైరాగ్యం, తాను తలపెట్టిన ఘోరకృత్యాన్ని గుర్తించి వణికిపోయాడు. ఈ అర్థంలేని, తార్కికమైన కోరిక, చిన్ననాటినుండే తనను తాను నాశనం చేసుకోవాలనే ఈ వింత కోరిక తనను వెన్నాడుతూనే ఉంది.

ఈ ఓంకార నిస్వనంతో తాను విస్మరించిన ఆత్మజ్ఞానాన్ని – అభావము, అశరీరము, నాశవిహీనమూ అయిన ఆత్మజ్ఞానాన్ని తిరిగి పొందగలిగాడు. ఈ ప్రశాంతమైన భావనతో ఆ కొబ్బరిచెట్టు మొదట్లో 'ఓం.... ఓం' అంటూ ఆ నది అంచున ఆ మట్టిలో ఆ చెట్టునీడలో నిద్రలోకి ప్రశాంతమైన సుషుప్తిలోకి జారిపోయాడు.

అలా ఎంతసేపు నిద్రపోయాడు? కలతలేని, కలలు రాని ప్రశాంతమైన విశ్రాంతి. ఎప్పటికో మేల్కొని, ఎన్నో సంవత్సరాలు నిద్రపోయినట్లు ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉన్నట్లు అనుభూతి పొందాడు. ఏటి గలగలలు, పక్షుల కిలకిలలు వినబడుతున్నాయి. పైన మబ్బుతునకలు చూసి ఇక్కడకు ఎప్పుడు, ఎలా వచ్చానా అని అబ్బురపడ్డాడు. ఇలాగే ఉండిపోవాలని ఎంతో గాఢంగా కోరుకున్నాడు. జరిగినదంతా సుదూర గతంలోకి, మసకమసకగా అదృశ్యమవుతున్నట్లు తెలుసుకుంటున్నాడు.

ఓంకార శబ్ద ఉచ్చారణతో నిద్రించిన తనను ఆ దివ్యమైన నిస్వనం సంపూర్ణంగా ఆవహించి, తన అణువణువునా ప్రవహించి తనను పునీతుని గావించినట్లు తన గతాన్నంతా తుడిచివేసి, అలౌకిక దివ్యస్థితికి తీసుకువచ్చినట్లు ఆనందభరితుడయ్యాడు. ఇప్పుడు క్రొత్త శక్తితో, ఉత్సాహంతో, ఉపశమనంతో తన పరిసరాలను, తనను తాను పరిశీలించాడు. 'ఆఁ. అవును. ఈ చేతులు

నావే. ఈ పాదాలూ నావే. ఈ గుండెల్లో ఉన్న సిద్ధార్థ నేనే.' ఆత్మవిశ్వాసంతో, అభివ్యక్తీకరణతో తాను నిలబడ్డాడు.

ఎదురుగా ఒక సన్యాసిని చూశాడు. తన ఒకప్పటి సహచరుడు తర్వాత గౌతముని శిష్యగణంతో చేరి ప్రశాంత జీవనంలోకి మళ్ళిన గోవిందుని గుర్తుపట్టాడు. అతనిలో పెద్దగా మార్పులు ఏమీ రాలేదు. అదే ఉత్సాహం, అదే గౌరవం అతని ముఖంలో ప్రస్ఫుంగా ఉన్నాయి. కానీ గోవిందుడు తనని గుర్తించినట్లు లేదు. అపరిచితునిగానే తనను చూస్తున్నాడు.

"ఇప్పటివరకు నిద్రలో మైమరచి ఉన్నాను. నీవెలా వచ్చావు?"

"నీవు గాఢనిద్రలో ఉన్నావు. ఇటువంటి ప్రదేశంలో విషనాగులు అడవి జంతువులు తిరుగుతుంటాయి. నీకు హాని కలగవచ్చు..."

"నేను బుద్ధుని పరివారంలో ప్రయాణం చేస్తూ ఇక్కడ నిన్ను చూశాను. ఇప్పటివరకూ నీకు ఏ హానీ జరగకుండా కాపలా ఉన్నాను. నీవు చాలాసేపు నిద్రపోయావు. నిన్ను చూస్తూ నేను కూడా మగతలోనే ఉన్నాను. ఇప్పుడు నీవు మేల్కొన్నావుకదా. ఇక నేను నా పరివారాన్ని త్వరగా చేరుకోవాలి."

"నీ సేవ మరువలేనిది. గౌతముని శిష్యులందరూ ఎంతో దయార్ద్ర హృదయులు! నీవు వెళ్ళవచ్చు..."

"నీకు మేలు కలుగుగాక" అంటూ గోవిందుడు వంగి, అభివాదంచేసి వెనుదిరిగాడు అంతలో.

"సెలవు గోవిందా...." అంటూ అతన్ని ఆశ్చర్యపరిచాడు సిద్ధార్థ.

"మీకు నా పేరెలా తెలుసు..?" గోవిందుని అనుమానం.

అప్పుడు సిద్ధార్థ తన సహజమైన నవ్వుతో "గోవిందా, నీవు చిన్ననాటినుంచీ నాకు తెలుసు. శ్రమణ జీవనంలోను, జేతవనంలోను కూడా తెలుసు" అని సిద్ధార్థుడు పూర్తి చేయక పూర్వమే.

"సిద్ధార్థా! నిన్ను వెంటనే గుర్తించలేకపోయాను. నీ ధనవంతుని వేషం, నీ పాదరక్షలు, నీ ముఖంలో మార్పు నేను గుర్తించలేకపోవటానికి కారణం కావచ్చు.

"నిన్ను కలవటం ఎంతో సంతోషంగా ఉంది సిదార్థ."

"గోవిందా, నీవెక్కడకు వెళ్తున్నావు..."

"ఇది నిరంతర ప్రయాణం. ఒక్క వర్ష రుతువులోకాక, ఎప్పుడూ సంచారమే. సందేశ ప్రచారాలతో సంచరిస్తూ భిక్ష స్వీకరిస్తూ కదిలిపోతుంటాను. నీ ప్రయాణం ఎటుమిత్రమా?"

"నేను దారిలోనే ఉన్నాను. తీర్థయాత్రికునిమాదిరే..."

"కానీ నీవు అలా కనిపించటంలేదు. నీ విలాసవంతమైన వస్త్రాలు, వేషం ఇవన్నీ అందుకు భిన్నంగా ఉన్నాయే?"

"ఆఁ.. అవును. నీవు నిశితంగానే పరిశీలించావు. కానీ నేను సన్యాసిగా ఉన్నానని చెప్పలేదుగా. నేను తీర్థయాత్రలో ఉన్నాననేగా అంటున్నాను."

"కావచ్చు. కానీ నేను ఇంతవరకు ఈ వేషంలో తీర్థయాత్ర చేస్తున్న ఎవ్వరినీ చూడలేదు సుమా!"

"అవును మిత్రమా. ఇప్పుడు నీవు చూస్తున్న యాత్రికుని వేషం ఒక ముసుగు మాత్రమే. ఎన్నో ముసుగులు తొలగిపోతుంటాయి. అన్నీ మన శరీరం, జుట్టు, అవయవాలు అన్నీ మారిపోతుంటాయి. అవును. నీవు సరిగానే చెప్పావు. నేను ధరించినవి ధనవంతుని వస్త్రాలే. ఎందుకంటే ధనవంతునిగా ఉండగా ఇవి నావే. ఈ కేశాలంకరణ కూడా. ఈ నాగరికపు చిహ్నాలన్నీ అప్పటివే. నేను అందులో భాగంగా ఉన్నప్పటివే."

'మరి ఇప్పుడు నీవు....?"

"తెలియదు మిత్రమా. ఇంకా నేను యాత్ర ఆరంభంలోనే ఉన్నాను. రేపు ఏమవుతుందో మరి."

"నీ ధనమంతా పోయిందా?"

"నా ధనమేపోయిందో, ఆ ధనమే నన్ను పోగొట్టుకున్నదో, ఇతమిత్థంగా చెప్పలేను. కనిపించేవన్నీ త్వరత్వరగా తిరిగిపోతున్నాయి. ఎక్కడి బ్రాహ్మణ కుమారుడు, ఎక్కడి శ్రమణకుడు, నిన్న మొన్నటి ధనవంతుడు సిద్ధార్థుడేడి? ఈ పరిణామం ఎంతో వేగంగా జరిగిపోతోంది."

గోవింద, కొంత అయోమయంగా, కొంత అపనమ్మకంగా సిద్ధార్థను చూశాడు. అభివాదం చేసి సెలవు తీసుకొని, తన దారిన పయనమయ్యాడు.

ఇప్పటికీ అతనిమీద ప్రేమానురాగాలు సిద్ధార్థకు తగ్గలేదు.

అవును. ఈ జాగృతిలో, ఈ ప్రశాంత చిత్తంతో ఇప్పుడు ఎవరినైనా ప్రేమించగలడు, దేనినైనా ప్రేమించగలడు.

ఓంకారమయమైన తన నిద్రావస్థలో జరిగిన ఒక అద్భుతమే ఇది. ఇప్పుడు అతని హృదయం ఆనందంతో నిండిపోయింది. ప్రేమమయమై పరిసరాలన్నీ ఆనంద నిలయాలయ్యాయి.

తన గత జన్మపు రుగ్మతకు పరితాపానికి కారణం, ఎవరినీ దేనినీ ప్రేమించలేకపోవటమేనని గ్రహించాడు.

గత రెండు మూడు దినాలుగా ఆహారం లేక ఆకలితో నీరసించాడు. ఇప్పుడు ఉపవాసం ఉండటం అలవాటు తప్పిపోయింది. క్షాంతి, చింతన ఇవన్నీ ఒకప్పుడు తాను ఎంతో విలువైన గుణాలు గొప్పగా చెప్పుకున్నవన్నీ గత ఇరవై సంవత్సరాలలో, ధనార్జన, భౌతిక సుఖాలు, సంపన్న జీవనాలకు ధారపోశాడు. తాను ప్రయాణించిన విభ్రాంతికకరమైన పథాంతాన ఇప్పుడు తాను అతి సామాన్యుడుగా నిలబడ్డాడు.

ఇప్పుడు ఆలోచించగలగటమే కష్టంగా తోచింది. ఆ కోరిక కూడా కలగటం లేదని గుర్తించాడు. ఎంతో ప్రయాసతో ఆ ప్రక్రియ మొదలుపెట్టాడు.

ఇప్పుడు పరిణామ క్రమాలన్నీ పూర్తయి మార్పు తెరలన్నీ తొలగిపోయి ఈ ప్రకృతిలో బాలునిలా నిలబడ్డాడు. తనదంటూ ఏమీ లేదని, తనకేమీ తెలియదనీ, ఒక వింత భావన కలిగింది.

వయసు మళ్ళి, శక్తి ఉడిగి, బలహీనుడవుతున్న ఈ తరుణంలో, మళ్ళీ బాలునివలె అనుకుంటున్నావేమిటి? ఈ ఆలోచనతో నవ్వుకున్నాడు. అవును, తన గమ్యం, విధి విధానం చాలా విచిత్రమైనది. ఇప్పుడు మళ్ళీ, తను మళ్ళీ మొదటికి వచ్చాడు. వట్టిగా, నగ్నంగా, అజ్ఞానంతో ఈ ప్రపంచంలో నిలబడ్డాడు. ఈ స్థితి అతనికి ఏమాత్రం బాధ కలగలేదు. పైగా పెద్దగా నవ్వాలని ఈ వింత ప్రపంచాన్ని చూసి పరిహసించాలనుకున్నాడు.

తనలో ఏదో ఆనందం, మహదానందం ఉప్పొంగుతోంది. ఇది ఎక్కడ నుంచి వస్తోంది? కారణం ఏమిటి? ఇప్పుడు స్వేచ్ఛగా, చిన్నపిల్లవానిలాగా ఉన్నాను?

తన హృదయంలో ఆనంద గీతాన్ని ఆలపించే వాణి సజీవంగా ఉంది.

తనలో అంతమైంది మరొకటి. తన జ్ఞానంతో సన్యాసి జీవనంలో అంతమొందించాలని ఆశించిన తన అహంకారం, తను ఎంతోకాలం పోరాడి, పెనుగులాడి ఓడిపోయిన తన అహం, తన ఆనందాన్ని దోచి తనను భయభ్రాంతుణ్ణి చేసిన అహంకారం, ఇప్పుడు ఇక్కడ తనను వదిలిపోయింది. అందుకే తనూ మళ్ళీ చిన్నపిల్లవానిలాగా ఆనందంగా, నిశ్చితంగా, నిర్భయంగా ఉన్నాడు. అతి, అతి జ్ఞానం, అతి ధ్యానం, అతి పవిత్ర జీవనం ఇవన్నీ అతన్ని అహంకారంతో నింపివేశాయి. అప్పుడు తన తెలివిమీద, విద్యమీద, తన ఆధిక్యంమీద, అతి నమ్మకంతో తనను అహం కప్పివేసింది.

తన ఉపవాసంతో, తన ధ్యానంతో అదే ఆత్మని నిర్జించాలని విశ్వప్రయత్నం చేసి విఫలమై, చివరకు కోరికల గూటిలో, సంపద మాటులో సుఖాల నరకంలో, నిరాశ నిస్పృహల గుప్పిటలో ఆత్మహత్యకు పాల్పడబోయినపుడు తనలో ఎక్కడో మిగిలివున్న లోగొంతు ఓంకార నాదాన్ని వినిపించి, జాగృతుని చేసినప్పుడే ఈ అద్భుతం జరిగింది.

అన్ని అనుభవాలతో తల పండి ఇప్పుడు హాయిగా నవ్వగలుగుతున్నాడు. ప్రవహించే నదిని చూశాడు. ప్రశాంతంగా, సహజ సుందరంగా పరుగులెత్తే నదిని చూశాడు. ఇంతకు పూర్వం జలసమాధి కావాలనుకున్న సిద్ధార్థ, నదిని ఎంతో ప్రేమగా ఇష్టంగా చూశాడు. ఒక సిద్ధార్థ, అహంకారి, అతి తెలివి సిద్ధార్థ నదిలో కలిసిపోయాడు. ఇప్పుడు ఈ నది తనకేదో, తనకు తెలియని, ప్రత్యేక జీవితమేదో వేచి ఉందని పిలుస్తోంది.

పడవ సరంగు

ప్రవహించే, పరుగులెత్తే నదిని ఎంతో ఇష్టంగా చూశాడు. స్వచ్ఛమైన ప్రవాహంలో ఎన్నో రంగులు! ఎన్నో హంగులు, ఎన్నో ఆకారాలు. నీటి లోతుల్లో ముత్యాల మెరుపులు, బుద్బుధ పరంపరల్లో నీలాకాశపు ప్రతిబింబాలు! వేనవేల అలల కనులతో వెలిగే చైతన్యం. ఈ నది, ఈ ప్రవాహం తనకెంతో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. తన అంతర్వాణిని నిద్రలేపి విశ్వసంగీతాన్ని వినిపిస్తోంది.

అన్ని సవ్వడులూ వినాలి. ఈ రహస్యాలన్నీ తెలియాలి. ఎంత వింత! ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. నీరు కదిలిపోతూనే ఉంటుంది. కానీ నది ఇక్కడే ఉంటుంది. క్షణక్షణం మారుతూ అనుక్షణం అక్కడే ఉండటం ఎంతటి గొప్ప రహస్యం? ఇది ఎలా అర్థంచేసుకోవాలి? తనకు దీని అర్థం తెలిసిందా? తన అంతరంగంలో ప్రతిధ్వనించే దివ్యమైన స్వరాలే ఈ నదిలోనే ఉండాలని; ప్రవాహపుటంచుల్లో నివసించాలని నిర్ణయించుకుని కదిలాడు. దహించుకుపోయే ఆకలితో, ఆ ఛాయల్లోనే తిరిగాడు. అలా తిరుగుతూనే బల్లకట్టు దగ్గరకు చేరాడు. అందులో ఉన్న సరంగుని గుర్తుపట్టాడు. అతనికీ ఎంతో వయసు పైబడినట్లు గమనించాడు.

పడవతో

"నన్ను ఈ నది దాటించవా" అడిగాడు. పడవ నడిపే సరుగు ఇతని ధనిక వేషం చూసి ఆశ్చర్యపోయాడు. పడవలో ఎక్కించుకుని, నదిలో ప్రవేశించాడు.

"నీవు అద్భుతమైన జీవనాన్ని ఎంచుకున్నావు.

"ప్రతిదినమూ ఈ నదిలో ప్రయాణం ఎంతో చైతన్యవంతంగా ఉంటుంది కదూ?"

"అవునయ్యా. కానీ అన్నిపనులూ, అందరి బ్రతుకులు అంతేకదా."

"నిన్ను చూస్తే అసూయగా ఉంది సుమా."

"ఆ భ్రమ త్వరగానే తొలగిపోతుంది. ముఖ్యంగా మీలాంటి ధనవంతులకు."

"ఓ! ఈ వేషం? ఇది నాకు భారమైపోయింది. నా దగ్గర ఎలాగూ నీకిచ్చేందుకు పైకంలేదు. ఈ దుస్తులైనా నీవు తీసుకుంటావా?"

"మీరు హాస్యమాడుతున్నారు" అంటూ సరంగు నవ్వాడు.

"లేదు మిత్రమా. నీవే ఒకప్పుడు నన్ను ఈ నది దాటించావు. అప్పుడూ నీకు ఏమీ ఇవ్వలేదు. ఇప్పుడూ అదే స్థితిలో ఉన్నాను. అందుకే ఈ దుస్తులు తీసుకో."

"అయితే మీరు దుస్తులు లేకుండానే వెళ్ళిపోతారా?"

"లేదు. ఏమైనా పాతబట్టలు నీవిస్తే నీకు సహాయకునిగా నీ పనిలో తోడుగా ఉంటాను."

అప్పుడు ఆ సరంగు, అతనిని పరీక్షగా చూసి గుర్తించాడు.

"మీరు ఒక రాత్రి నా కుటీరంలో నిద్రించారు. చాలా కాలం క్రితం, ఇరవై ఏళ్ళనాటి మాట అప్పుడు మీరు శ్రమణ సన్యాసికదా? మీ పేరు గుర్తులేదు."

"నా పేరు సిద్ధార్థ, అప్పుడు నేను శ్రమణున్నే."

"నా పేరు వాసుదేవ! మీరు నాతో ఉండవచ్చు. మీరు ఎక్కడ నుంచి వస్తున్నారు? ఈ దుస్తులు మీకు భారమెందుకయ్యాయి?" సిద్ధార్థ వాసుదేవుని పడవ నడిపే తీరు, నీటి ప్రవాహాన్ని అనుసరించి, తెడ్డువేసే చాతుర్యాన్ని, బలమైన

అతని బాహువుల్ని గమనించాడు. ఒడ్డు చేరిన తర్వాత పడవను తాళ్ళతో కట్టి కుటీరంలో ప్రవేశించారు.

ఆకలితో ఉన్న సిద్ధార్థుడు, అతను ఇచ్చిన ఆహారాన్ని ఎంతో ఆప్యాయంగా స్వీకరించాడు. మామిడిపండును ఆస్వాదించాడు.

ఆ రాత్రి నదిలో నీరు వెన్నెల్లో మిలమిలలాడుతుండగా, చల్లని గాలి చివురాకుల్ని ఊయలలూపుతుండగా, సిద్ధార్థుడు ఇరవై ఏండ్ల క్రితం ఈ నది దాటి తాను పయనించిన బాట, చేరిన నగరం, జీవించిన నాగరక ధనజాడ్య సంక్లిష్ట సమాజపు సమస్త పార్శ్వాలు వివరించి చెప్పాడు. అంతకు పూర్వం తన చిన్నతనం, చదువు తన అన్వేషణలు అన్నీ వివరించాడు.

అర్ధరాత్రి దాటేవరకూ సిద్ధార్థుడు చెప్పిన విషయాలు వాసుదేవుడు ఎంతో శ్రద్ధగా విన్నాడు. ప్రతి మాటనూ ప్రతి విషయాన్నీ ఆకళింపు చేసుకుంటూ ఆలకించాడు. అతని శ్రద్ధను, వినే శక్తిని, మనసుకు తీసుకున్న విధానం సిద్ధార్థకు అబ్బురమనిపించింది. తన బ్రతుకులో ఒడిదుడుకులన్నీ అతను తనలో ఇంకింప చేసుకుని, తనకెంతో తేలిక చేసినట్లు భావించాడు.

చివరకు తన అలసట, నిర్వేదం, నిస్పృహ ఆత్మహత్యా ప్రయత్నం అన్నీ ఏకరువు పెట్టాడు. చివరిగా తన బలహీన క్షణపు నిర్ణయం, నదిలో కలిసిపోవాలని ఆరాటం, ఓంకార నిస్వనం – వాసుదేవునికి వినిపించాడు.

వాసుదేవుడు శ్రద్ధగా విని, "సిద్ధార్థా, ఈ నది నీతో మాట్లాడింది, నిన్ను స్నేహంగా చూసింది. అదే నీకు మేలు. మున్ముందు ఎన్నో నీకు తెలియజెప్తుంది. శ్రద్ధగా ఆలకించు...

"నా కుటీరంలో చోటుంది. ఇక్కడ ఆహారానికి లోటేమీలేదు."

"వాసుదేవా, నేను నీ దగ్గర పడవ నడపటమేకాదు, వినటం కూడా నేర్చుకోవాలి. నీలాగా శ్రద్ధగా వినేవాళ్ళను ఇంతవరకూ నేను కలవనేలేదు."

"తప్పక నేర్చుకోవచ్చు. కానీ ఈ నదే నీకు అన్నీ నేర్పుతుంది. ఓర్పుగా ఉండాలి. చాలామందికి ఈ నది తమ దారిలో ఒక అడ్డంకి మాత్రమే. వ్యాపారాల కోసం, వివాహాలకై, తీర్థయాత్రలకు ప్రయాణించే జనానికి తమ ప్రయాణంలో ఈ నది దాటటం ఒక భాగమే కానీ చాలా కొద్దిమందికి, ఇద్దరో, ముగ్గురో

ఈ నది రహస్యాలు జాగ్రత్తగా విన్నవారు, ఇప్పుడు నీకు బ్రతుకు పాఠం చెప్పిన ఈ నది – ఇంకో ముఖ్యవిషయం కూడా తెలియజేస్తుంది.”

సిద్ధార్థ అతనితో ఉండిపోయాడు. పడవ నడపటం, తాడు పేనటం, తెడ్డు వేయటం, తెడ్లు తయారు చేయటం శ్రద్ధగా నేర్చుకున్నాడు. వాసుదేవునితో కలిసి వరిచేనులో పనిచేశాడు. అరటిచెట్లు, మామిడిచెట్లను సాకటం తెలుసుకున్నాడు.

ఈ వ్యాపకం, నది పరిసర జీవనం అతనికి ఎంతో ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తోంది.

ఈ ప్రవాహ సంగీతం ఎంతో శ్రద్ధగా ఆలకించాడు. వింటూనే ఉన్నాడు.. ఏ కోరికా లేకుండా ఏ అనురక్తి, ఏ నిర్ణయం, అభిప్రాయం లేకుండా ఆలకిస్తున్నాడు. ఒకసారి వాసుదేవుణ్ణి అడిగాడు.

“ఈ నది నీకు కాలజ్ఞానాన్ని కూడా నేర్పిందా?”

వాసుదేవుని మోము చిరునవ్వుతో వెలిగిపోయింది.

“అవును సిద్ధార్థ.

“ఈ నది అన్నిచోట్లా ఉంది. ఏ కొండల్లో మొదలయ్యిందో ఏ జలపాతాలు దాటిందో ఏ అరణ్యాలు ఒరుసుకుంటూ ఏ సముద్రంలో కలుస్తుందో అదే నది అన్ని ప్రదేశాల్లో ఉందిగదా. గతంలోను, వర్తమానంలోను, భవిష్యత్తులోను ఇవన్నీ కాలపు నీడలేకదా.

“అలాగే కాలం, ఒకే దిక్కుకు ప్రవహించినట్లుంది. కానీ అది సర్వాంతర్యామి. నదిలాగానే ఎప్పుడూ వర్తమానమే, అనుక్షణికమే.”

ఈ కాలజ్ఞానం సిద్ధార్థునికి ఎంతో సంతోషాన్ని కలిగించింది.

తన బాల్యం, తన విద్య, తన వైరాగ్యం, తన ధనజాడ్యం, తన నైరాశ్యం, తన మరణ వాంఛ – ఇవన్నీ కాలంలో భాగమే, నీడలే. సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రాయణం, ఈ చుక్కల ముగ్గులాట – ఇవన్నీ కాలంలో అంతర్భాగమే అని ఒక్కసారిగా అతను ఈ సమయ స్మృతిని తెలుసుకోగలిగినట్లు వాసుదేవుని వంక చూసి చిరునవ్వు నవ్వాడు. అతనికి అర్థమైనట్లు తల ఊపి, సిద్ధార్థుని భుజంతట్టి తన పనిలో నిమగ్నమయ్యాడు.

వర్షాకాలం వచ్చింది. నది పొంగిపొర్లింది. ఒడ్డులు ఒరుసుకుంటూ, వింత శబ్దాలతో, గర్జనలతో పరుగులపెట్టింది. "మిత్రమా, ఈ ప్రవాహంలో ఎన్ని గొంతులో, రాజులా, వీరునిలా, ఆబోతులా, కోయిలలా, పురిటినొప్పుల స్త్రీలా, నిట్టూర్చే బాధితునిలా ఎన్ని గొంతుకలో, ఎన్ని వేల స్వరాలో" అని అబ్బురపడేవాడు సిద్ధార్థ.

''అవును మిత్రమా. అన్ని జీవరాశుల శ్వాసలు ఈ ప్రవాహంలో ప్రతిధ్వనిస్తాయి" వాసుదేవుడు.

"ఇంకా ఒక్కసారిగా ఈ సహస్ర స్వరాలు కలిసి ఒకే శబ్దం వినపడుతోంది.." సిద్ధార్థ.

అప్పుడు వాసుదేవ అతని చెవిలో 'ఓం' అంటూ రహస్యంగా ఊదాడు.

అవును. సిద్ధార్థ అదే విన్నాడు. అదే వింటున్నాడు.

వారి స్నేహం, వారి వ్యాపకం, వారి ప్రవర్తన కాలక్రమంలో ఏమీ వ్యత్యాసం లేకపోయింది. పడవలో ప్రయాణించేవారు, వారిద్దరూ అన్నదమ్ములని, కవలలని భ్రమించేవారు, సిద్ధార్థ కొంతకాలానికి వాసుదేవునివలెనే నవ్వేవాడు. అతనిలాగానే బాలునిలాగా ఎంతో ఆనందంగా, అమాయకునిలా, సంతోషంగా జీవించడం తెలుసుకున్నాడు.

పడవలో ప్రయాణించేవారు కొందరు తమ కష్టసుఖాలు చెప్పుకునేవారు. వీరి సానుభూతి కోసం ఎదురు చూసేవారు.

కొద్దిమంది వీరితో ఒకటి రెండు దినాలు ఉండి ప్రవాహ స్వరాలను వినేందుకు ఏవో రహస్యాలను తెలుసుకునేందుకు ప్రయత్నించేవారు.

ఇలా ఎన్నో సంవత్సరాలు గడిచింది.

ఎన్నో ఋతువులు నదీ ప్రవాహంలో కలిసిపోయాయి.

నది దాటేందుకు, గౌతముని దర్శనం కోసం ఎందరెందరో సిద్ధార్థుని పడవలో ప్రయాణం చేసేవారు. వారి సంభాషణలన్నీ ఆ తేజోమూర్తి గురించే సాగేవి. ఆయన బోధనలు ఆయన పరిపూర్ణ సౌందర్యాకృతి, సాంగమైన ముఖవర్చస్సు, కరుణార్ద్ర కంఠస్వరం – ఈ విధంగా ఆయన వర్ణనలతో సంభాషించుకునేవారు.

సిద్ధార్థ తాను గౌతమునితో జరిపిన సంభాషణ గుర్తుకు వచ్చినపుడు తన పలుకులు ఎంత అపరిపక్వంగా, అహంకార పూరితంగా ఉన్నాయో అని ఇప్పుడు తలచేవాడు. కానీ చాలాకాలంగా తాను గౌతముని నుండి విడిపోలేకపోయాడు. బుద్ధుని హెచ్చరిక, ఆశీర్వాదం, అతనికి బాగా గుర్తున్నాయి. ఆయన బోధనలను తాను అంగీకరించకపోయినా తన మార్గాన తాను పయనించాడు. అప్పుడే బోధిసత్త్వుని బోధనలలోని అంతరార్థం, ఇప్పటి తన ఆనందమయ మానసిక స్థితి, ఇప్పుడు తనలో నిండివున్న దివ్యమూ అనంతమైన మహదానందం, ప్రతి వస్తువుతో, ప్రతి వ్యక్తితో తాను తాదాత్మ్యం చెందగలుగుతున్నాడు. అదే శాక్యముని ఔన్నత్యమని గుర్తించాడు.

ఒక దినం ఎందరో యాత్రికులతోపాటు కమల కూడా గౌతముని దర్శించేందుకు పయనమైంది. అప్పటికే తన వసంత వనాన్ని గౌతముని శిష్యులకు దానంచేసి, బుద్ధుని బోధనలను వినటంలో కాలం గడుపుతోంది. ఇప్పుడు ఆయన దర్శనార్థం తన సంపదనంతా వదిలి సామాన్యురాలిగా కొడుకుతోబాటు పయనిస్తూ ఈ నదీప్రాంతానికి వచ్చింది. అప్పటికే ఎంతో అలసిపోయింది. చిన్నవాడు ఆకలితో దాహంతో నడవలేక ఏడుస్తూ మారాము చేస్తున్నాడు. అతనికి ఆహారం ఇస్తూ, బుజ్జగిస్తూ ఇక్కడవరకు చేరింది. ఆ బాలునికి, 'ఏమిటీ పిచ్చితల్లి, ఎవరి కోసం ఈ కష్టాల ప్రయాణం చేస్తున్నది? ఇప్పుడు ఆ ముదుసలి మౌనిని చూడకపోతే ఏమౌతుంది?' అని ఇదంతా నాకెందుకు అనుకుంటూ అయిష్టంగా తల్లిని విసిగిస్తున్నాడు. ఆ నది అంచున ఓ చెట్టు నీడలో విశ్రాంతకై ఆగి, రెండు అరటిపళ్ళు తిన్నారు. కమల కళ్ళు మూసుకుని, కాస్సేపు నడుం వాల్చింది. అంతలో బాధతో గట్టిగా అరిచింది. విభ్రాంతితో పిల్లవాడు అమ్మ ముఖం విపరీతమైన వ్యాకులపాటుతో పాలిపోవటం ఆమె కాళ్ళదగ్గర నుంచి నల్లని సరీసృపం జరజరా పోవటం చూశాడు. కమల బాధతో అరుస్తూ సహాయం కోసం లేచి పడవ రేవువైపు పరుగు పెడుతోంది. ఆమెతోపాటు పిల్లవాడు కూడా కేకలు వేస్తూ అనుసరించాడు. పడవ దగ్గర ఉన్న వాసుదేవుడు ఈ కేకలు విని అప్పటికే వాలి, తూలిపోతున్న కమలను కొడుకుతోపాటు పడవలో అవతలి ఒడ్డుకు చేర్చి, కుటీరంలో పడుకోబెట్టాడు. కొబ్బరిపాలు త్రాగించాడు. అప్పటికే పొయ్యి వెలిగించి, అన్నం వండేందుకు సిద్ధమవుతున్న సిద్ధార్థకు ఆ పిల్లవానిని చూడగానే ఏదో ఆత్మీయత కలిగింది. పాలిపోయి అప్పుడే స్పృహలోకి వస్తున్న కమలను

వెంటనే గుర్తించాడు. ఆ బాలుడు తన సంతానమేనని తెలియగానే అతని హృదయం అనురాగంతో నిండిపోయింది.

కమల పరిస్థితి విషమించింది. తెరలు తెరలుగా తెలివి వస్తోంది. సిద్ధార్థుని అతి కష్టం మీద గుర్తించి, కల కంటున్నట్లు అనుకుంది. ఒకప్పుడు తాను ఎంతో ప్రేమించిన ప్రియుడు ఇప్పుడు తనను దగ్గరగా వేదనతో చూస్తున్నాడు. తన ప్రస్తుత స్థితిని గుర్తించి, కొడుకు కోసం కళ్ళతోనే వెతుకుతోంది.

"ఇక్కడే ఉన్నాడు, విశ్రాంతి తీసుకో" అన్నాడు సిద్ధార్థ.

కమల అతన్ని ఎంతో కష్టంమీద పరీక్షగా చూసింది.

"నీవెంతో పెద్దవాడవయ్యావు. నీ తల నెరిసింది. కానీ నీ కనుల్లో మెరుపు మునుపటి మాదిరిగానేవుంది. నీవు మొదటిసారి కలిసినప్పటిలాగనే ఉన్నావు. అప్పటి సిద్ధార్థవే. ఇప్పుడు నాకూ వయసు వాలింది. నన్ను గుర్తుపట్టావా? నీ కొడుకుని పోల్చుకున్నావా?"

"అవును కమలా" అంటూ పిల్లవాణ్ణి ఊరువుపై కూర్చోబెట్టుకుని తాను ఎప్పుడో చదివిన ఏదో ప్రార్థనాగీతం పాడటం మొదలుపెట్టాడు. తన గతంలోనుంచి, తన బాల్యంలోనుంచి ఉబికి వస్తున్న ఈ సంగీతంతో ఆ కుటీరం పరివారితమైంది. పిల్లవాడు నిద్రపోయాడు.

అప్పటికే విషగ్రస్తమైన కమల రక్తం గడ్డకడుతోంది.

"సిద్ధార్థ? నీవు ఆనందాన్ని పొందగలిగావా? నీ అన్వేషణ అదేకదా? నేను స్పష్టంగా చూస్తున్నాను. నీవు చాలా ప్రశాంతంగా ఉన్నావు. నీవు సిద్ధార్థవే. కానీ అలా లేవు సుమా?" అవును. ఎంతో దయగా ఆమెకు సేవ చేశాడు.

"నీవు కూడా ప్రశాంతంగా ఉంటావు.."

కమల గౌతముని దర్శనం కోసం బయలుదేరింది. సిద్ధార్థునిలో ఇప్పుడు గౌతముని చూసింది.

ఆ విషయమే చెప్పాలనుకొన్నది. అతన్ని చూస్తూనే ఆమె చివరి శ్వాస వదిలింది.

సిద్ధార్థ ఆమె చెంత ఆ రాత్రి గడిపాడు. వాసుదేవ పిల్లవాణ్ణి పడుకోబెట్టి సిద్ధార్థుని అతని ఏకాంతానికి వదలి బైటకు వెళ్ళాడు.

సిద్ధార్థునికి ఒకప్పటి ఆమె అందమైన మోము, తేనెలూరిన పెదవులు, మృదువైన బుగ్గలు ఇప్పటి ముఖంలో వింతగా కనపడుతున్నాయి. ఇప్పటి వర్తమానంతో తన తాదాత్మ్యత, అనాశకరమైన జీవాత్మ, అనంతమైన ప్రతి క్షణం అతనికి ఇప్పుడు ఎంతో ప్రాముఖ్యంగా అనిపిస్తోంది.

కుటీరం బయటకువచ్చి నది అంచున కూర్చున్నాడు. ప్రవాహం అతనితో ఎన్నో రహస్యాలు చెప్పసాగింది. గత స్మృతులతో సతమతమవుతూ, ఒక్కసారిగా తన గత కాలపు వివిధ సమయాలు, సంఘటనలూ కలగలిసి అతన్ని కలవర పెడుతున్నాయి. అప్పుడప్పుడూ గుడిసెలోనికి వెళ్ళి కమల దేహాన్ని, కొడుకు నిద్రనూ చూసి వస్తున్నాడు.

తొలి వెలుగు రాకపూర్వమే, వాసుదేవుడు వచ్చి "సిద్ధార్థ, నీవు నిద్రపోలేదు."

"అవును వాసుదేవా. ఇక్కడే ఉన్నాను. నదీ ప్రవాహాన్ని వింటున్నాను. ఈ రాత్రి, నది నాకెంతో నేర్పింది. ఏకత్వంలోని మార్మిక స్థితిని తెలియజేసింది."

"నీవు ఎంతో బాధ అనుభవించావు. కానీ అది నీ హృదయాన్ని తాకలేదు."

"లేదు మిత్రమా. నేను ఎందుకు విచారించాలి?

"నేను ఆనందంగానే ఉన్నాను. ఇప్పుడు నా కొడుకు రాకతో అది రెట్టింపైంది కదా."

"సిద్ధార్థ, మనకు చాలా పని ఉన్నది. కమల దేహాన్ని ఖననం చేయాలి. అదిగో. ఆ గుట్టమీద నా భార్య సమాధి ప్రక్కనే చేద్దాం. బయలుదేరు."

కొడుకు

తల్లి మరణం బాలుని భయభ్రాంతుని చేసింది. తల్లి మట్టిలో కలిసిన గుట్ట దగ్గర కూర్చొని హృదయ విదారకంగా విలపించాడు.

సిద్ధార్థ ఆ బాలునికి తను అపరిచితునిగానే భావించి, అతని దుఃఖాన్ని అతని ఒంటరితనాన్ని గౌరవించి, ఎంతో ఓర్పుతో అతనికి సపర్యలు చేశాడు. ఈ పదకొండేళ్ళ బాలుడు తల్లి గారాంలో, సంపదలలో తులతూగి సేవకులను ఆజ్ఞాపించటమే అలవాటైన ఆకతాయిగా సిద్ధార్థునికి త్వరలోనే తెలియవచ్చింది.

మెత్తని పరుపులు, రుచికరమైన ఆహారానికి అలవాటుపడిన అతని జీవన సరళి, ఒక్కసారిగా, ఈ పేదరికపు వాతావరణంలో ఇమడలేక తిరుగుబాటు చేస్తున్నట్లు గ్రహించాడు. ఓర్పుగా అతనిని ఒత్తిడి చేయకుండా చూస్తున్నాడు.

తన కొడుకు రాకతో తన ఆనందం రెట్టింపు అవుతుందని అనుకున్నాడు. కానీ కాలం గడిచినకొలదీ, కొడుకు తనతో ప్రవర్తించే తీరు అతనిని కలవరపెడుతోంది. తనని అమర్యాదగా, తలబిరుసుగా, శత్రువులా పరిగణిస్తున్న తన సంతానం అతనికి ఏ విధంగా ఆనందం కలిగిస్తుంది? ఏ పనీ చేయకుండా ఎవరినీ గౌరవించని బాలుడు చిన్నచిన్న దొంగతనాలు కూడా చేస్తుంటే అతనికి బాధతోపాటు ఈ బంధంలోని బాధ్యత కూడా తెలుస్తోంది.

బాలుని ప్రవర్తన, తిరుగుబాటు అతని దుందుడుకు చేష్టలు ఇవన్నీ తన మిత్రుణ్ణి ఎంతో కలవరపెడుతుంటే, వాసుదేవ, సిద్ధార్థుని కూర్చోబెట్టి "మిత్రమా, నీ ఆందోళన, ఆవేదన నేను చూస్తూనే ఉన్నాను. నీ కొడుకు ప్రవర్తన, నిన్ను పెట్టే ఇబ్బందులు కూడా బాధాకరమైనవే.

"కానీ, చిన్నవాడు పెరిగిన వాతావరణం, ఇప్పటి వరకు గడిపిన జీవితం ఎంతో భిన్నమైనవి కదా. అతను నీలాగా, సంపదను, సుఖాలను స్వచ్ఛందంగా వదిలి రాలేదుకదా. ఇవన్నీ అతని ఆలోచనకు, అలవాటుకు భిన్నంగా జరుగుతున్నవి.

"చూడు, నది నవ్వుతోంది. నీరు నీటిలోనే చేరుతుంది. ఏ వయసుకు ఆ ముచ్చట. నీ కుమారుడు ఇక్కడ ఉండలేడు."

"అయ్యో! అతన్ని ఎలా వదలగలను? ఇంకా కొంతకాలం చూడనివ్వు. అతని కోసమే నేను ఆరాటపడుతున్నాను. అతని మదిలో ఇంత ప్రేమకోసం తపిస్తున్నాను" అంటూ సిద్ధార్థ వాపోయాడు.

"నాకు తెలుసు. కానీ నీవు అతనికి విద్య నేర్పుతున్నావా? అతన్ని శిక్షిస్తున్నావా? కనీసం ఆజ్ఞాపిస్తున్నావా? చేయలేవు. రాయికంటే నీరు, దౌర్జన్యంకంటే ప్రేమ గొప్పదని నమ్మే నీవు అలా చేయలేవు. నీ సహనంతో, నీ ప్రేమతో, నీ కొడుకు దినమూ అవమానించబడుతున్నాడు. అతనికి నీ మంచిని, నీ ఉన్నతిని భరించటం ఎంత కష్టతరమైనది? మనలాంటి ముదుసలి సరంగులు తినే ఆహారం అతనికి ఎలా సహిస్తుంది? అతని హృదయ స్పందనలకు మన పరిసరాలకు ఎంత అంతరం ఉన్నదో ఆలోచించరాదా?"

"నేనేం చేయను?" సిద్ధార్థ.

"కుర్రవానిని అతని తల్లి ఇంటికి తీసుకువెళ్ళు. అక్కడ ఎవరూ లేకపోతే ఎవరైనా గురువుకు అప్పగించిరా. కనీసం అక్కడ అతని ఈడు పిల్లలు తోడుంటారు."

"అవును మిత్రమా. నేను అదే అనుకుంటున్నాను. కానీ అంత కఠినంగా పసివాడిని ఒంటరిగా ఈ ప్రపంచంలో వదిలి రానా? అతడు కూడా నేను చేసిన తప్పిదాలన్నీ చెయ్యాలా? నాలాగానే, సంపద సుఖాల మత్తులో తనని తాను నాశనం చేసుకోవాలా?"

"మిత్రమా, నది ప్రవహిస్తోంది. వినలేదా? నీవు నడిచిన దారి, నీవు అనుభవించిన లౌకిక దుష్కర్మలన్నీ నీ పుత్రుని రక్షించటానికా? అతడు ఈ ప్రపంచంలో నీ జీవితంలో ప్రవేశించకుండా ఆపగలవా? నీ ప్రార్థనలతో, నీ బోధనలతో, నీ సూచనలతో సాధించగలవా? ఇవన్నీ సాధ్యమేనా? నీ తండ్రి బ్రాహ్మణ కర్మలు, నిత్య వేద పారాయణం, సంధ్యావందనాలు, తన కుమారుణ్ణి ఎలా రక్షించగలిగాయి? ఏ గురువు, ఏ సన్యాసి అతనిని తన మార్గాన్నుంచి తప్పించగలిగారు? ఇది ఎవరికైనా సాధ్యమేనా? నీవు పది జన్మలెత్తినా నీ కొడుకుని, బ్రతుకు దుఃఖం నుంచి, లోక భ్రమణ మార్గం నుంచి, భ్రమల సంక్షోభం నుంచి రక్షించగలవా? అతని విధిని మార్చగలవా?"

సిద్ధార్థ ఆలోచనతో నిద్రపోలేకపోయాడు. ఇవన్నీ తనకు తెలియని విషయాలా? మరి? తన పుత్ర ప్రేమ తన జ్ఞానాన్ని ఆలోచనలను మించి, ఈ బంధాన్ని తెంపుకోలేక, ఈ ప్రేమను, ఇంతవరకు ఎవ్వరినీ ఇంతగా ప్రేమించని తను ఇప్పుడు ఈ ప్రేమ భావనలో పూర్తిగా అంధుడై దుఃఖితుడై నిస్పృహతో కూడా ఎంతో ఆనందం పొందగలుగుతున్నాడు. అందుకే కొడుకు ఎంత ఇబ్బంది పెట్టినా, ఎంత అగౌరవపరిచినా, మౌనంగా, సహనంతో వేచి చూస్తున్నాడు. ప్రతి దినం సహనానికి, తిరుగుబాటుకు జరుగుతున్న ఈ నిశ్శబ్ద పోరాటం వాసుదేవ చూస్తూనే ఉన్నాడు. సిద్ధార్థ భరిస్తూనే ఉన్నాడు.

కమల ఎంతో కాలం క్రితం అన్న మాటలు "నీవు ఎవరినీ ప్రేమించలేవు." సిద్ధార్థునికి ఒక్కసారిగా గుర్తువచ్చి అతనికి వినిపిస్తున్నాయి. ఎంతో దర్పంతో తనని తాను ఒక నక్షత్రంలా, సామాన్యులను రాలే ఆకుల్లా పోల్చి మాట్లాడటం ఇప్పుడు గుర్తు వస్తున్నాయి.

ఇప్పటి వరకూ తన ఔన్నత్యం మీద తన జ్ఞానం మీద తనకు జన సామాన్యానికి ఎంతో వ్యత్యాసముందనే భావనలో ఉన్నాడు. కానీ ఇప్పుడు తన కొడుకు రాకతో అతనిపై అనురాగ బంధంతో, తన చివరి అహంకారపు లేశం కూడా చెదిరిపోయినట్లు భావించాడు. ఈ ప్రేమావేశంలోని తీవ్రత, ఈ పుత్ర బంధంలోని అనుభూతి, ఈ బాధలోని వింత అనుభవం – ఇవన్నీ తనని సామాన్యునిగా పరివర్తింపచేశాయని గుర్తెరిగాడు. ఈ అనురక్తి అతని హృదయాన్ని నింపి, దుఃఖానుభూతిని ఎంతో భరించదగిన, స్వీకరించదగిన వేదనగా తెలుసుకున్నాడు.

చివరికి ఒకనాడు బాలుడు, తండ్రికి పూర్తిగా ఎదురు తిరిగాడు.

"నాన్నా, నాలుగు పుల్లలు తీసుకు రా. పొయ్యి వెలిగిద్దాం" అన్నాడు సిద్ధార్థ.

"నేను నీకు సేవకుణ్ణి కాదు.

"నీవంటే నాకు అసహ్యం. నీవు నన్నేమీ చేయలేవు. నాకు తెలుసు. నీ దయతో, నీ సహనంతో నన్ను చిన్నబుచ్చుతున్నావు. నేను నీలాగ పవిత్రంగా ఉండను. నేను దొంగనవుతాను. నీవంటే నాకు ఏవగింపు. నీవు నాకు తండ్రివి కాదు పో." అతను అసహనం, కోపం, బాధ అన్నీ కలగలిపి వెళ్ళగ్రక్కాడు. తండ్రి మీద కోపంతో ఇల్లువదిలి వెళ్ళిపోయాడు. మళ్ళీ సాయంత్రం తిరిగివచ్చాడు. సిద్ధార్థ కొడుకు తిరిగి వచ్చినందుకే సంబరపడ్డాడు.

ఆ మర్నాడు సిద్ధార్థుని కొడుకు ఉదయాన్నే వెళ్ళిపోయాడు. వీరు దాచుకున్న చిల్లర నాణాలు తీసుకుని పడవలో ఆవలి ఒడ్డుకు చేరి అడవిలోకి పారిపోయాడు.

పడవ అవతలి తీరాన కనపడుతోంది. సిద్ధార్థ ఆందోళనతో "నేను అతన్ని వెతికి తీసుకువస్తాను. ఈ అడవిలో ఏమి కష్టాలు పడతాడో పసివాడు" అంటున్నాడు.

వాసుదేవ, "బల్లకట్టు చేద్దాం, వాసాలు నరకాలి" అని చిన్న గొడ్డలి తెచ్చాడు.

వెదురు వాసాలతో చిన్న బల్లకట్టు చేసి తాళ్లతో కట్టి నీళ్ళలో దిగారు. వాసుదేవ గొడ్డలి కూడా తెచ్చాడు. బల్లకట్టు వాలు ప్రవాహంలో ఎంతో దూరం పోయింది. ఎంతో కష్టంగా అవతలి ఒడ్డుచేరి పడవ ఉన్న చోటికి వచ్చారు.

వాసుదేవ "సిద్ధార్థ, అతనిని వెళ్ళనివ్వు. అతని జాగ్రత్త అతను తీసుకోగలడు. ఇంక అతనిమీద భ్రమపెట్టుకోకు. అతని దారిలో అతన్ని వెళ్ళనివ్వు. నీ బాధ నేను చూడగలను. త్వరలో నీకే తెలుస్తుంది."

పడవలో తెడ్డు కూడా లేదు. పిల్లవాడు కోపంతో తెడ్డు నీళ్ళలో వేసి పారిపోయాడు.

"సిద్ధార్థ ఇప్పటికైనా తెలిసిందా. మనం అతన్ని వెంబడించడం, ఇష్టంలేకనే ఈ పనిచేశాడు. ఇంకాస్సేపటిలో ఈ పడవ కూడా మునిగిపోయేది."

"వాసుదేవ! నేను వెళ్తాను. పసివాడు, ఏమవుతుందో" అంటూ అడవిలోకి బయలుదేరాడు సిద్ధార్థ.

ఎంతో సమయం అడవి దారులన్నీ వెతికాడు. అయినా "ఈపాటికి నగరం చేరి ఉండాలి లేదా నాకు కనపడకుండా తప్పించుకుంటున్నాడేమో" అనుకున్నాడు.

ఇప్పుడు కొడుకు క్షేమం గురించి అతనికి సందేహం తీరిపోయింది. అయినా అతని ఆందోళన అదికాదు. అతను తనని వదలి వెళ్ళిపోయాడనే బాధ ఎక్కువైందని తెలుసుకున్నాడు. చివరికి నగర పొలిమేరలో ఒకప్పుడు తాను కమలను కలిసిన వసంత వనానికి చేరవలో నిలబడ్డాడు. ఒక్కసారిగా గత కాలపు స్మృతులన్నీ అతని మదిలో తిరిగాయి.

తన శ్రమణ జీవితం, కమల పరిచయం, సంపద సౌఖ్యాలు జూదం, మధుపానం, చివరికి ఏవగింపు, కుహుపిట్ట, బంగారు పంజరం, వార్థక్యం, నదీప్రవాహం, నిశ్శబ్ద ఓంకారస్వనం మళ్ళీ అతనికి వినిపిస్తోంది.

"తను ఏ విధంగా తన కుమారునికి సహాయం చేయగలడు? అతని దారిని ఏ దారిలోకి మళ్ళించగలడు? అయ్యో, నేను పడిన పాట్లన్ని వీడుపడాలా? నేనేమీ చెయ్యలేనా? ఈ నిస్సహాయతకు మరో మార్గంలేదా?"

కనపడని గాయంతో అతని హృదయం మూలిగింది. కన్న కొడుకు మీద ప్రేమాతిశయంతో, అతను ఆ తోట అంచుల్లో కూర్చున్నాడు.

విచారంగా, మదిలోని గాయం బాధతో ఇప్పుడు తను కొడుకు కోసం కలిగిన వేదన స్థానంలో శూన్యం ఆవహించటం గమనించాడు.

తన హృదయంలో మరేదో అంతమొందటం తెలుసుకున్నాడు. ఇప్పుడు నిరామయంగా అగమ్యంగా ఉండిపోయాడు.

నిరాశావహుడై కూర్చుండిపోయాడు. ఇది కూడా అతనికి నదే నేర్పింది. సహనం, వినటం, వేచి చూడటం. ఇప్పుడు అతని హృదయాన్ని విన్నాడు. ఎద లోయల్లో ఏదైనా స్వరం వినపడుతుందేమోనని ఓర్పుతో విన్నాడు. నిరాశగా, నిశ్శబ్దంగా, కృంగి అక్కడే ఏ దారీ కనపడక ఉండిపోయాడు.

ఎదలోని గాయం బాధపెడుతుండగా ఎంతో శక్తి కూడదీసుకుని ‘ఓం’ అంటూ రహస్యంగా, నిశ్శబ్దంగా పలికాడు. ఓంకార స్వరంతో తన హృదయాన్ని తన వ్యక్తిత్వాన్ని నింపుకున్నాడు.

నెరిసిన తలతో అక్కడ ఎప్పటి నుంచో ఉన్న సిద్ధార్థుని ఆ తోటలో తిరిగే బౌద్ధ భిక్షువులు చూసి అతనికి రెండు అరటిపళ్ళు ఇచ్చారు.

ఇవేమీ గమనించని సిద్ధార్థ ఎప్పటికో తన భుజం మీద చేయి వేసిన వాసుదేవుని స్పర్శతో తెలివిలోకి వచ్చాడు.

అప్పుడు అతని ముఖంలోని ప్రశాంతతను చూసి చిరునవ్వు నవ్వాడు. అక్కడే పడివున్న అరటిపళ్ళు తీసుకుని ఒకటి వాసుదేవునికి ఇచ్చాడు.

ఇద్దరూ మౌనంగా అడవి దాటి, నది దాటి వారి కుటీరం చేరారు. సిద్ధార్థ వెళ్ళి మంచం మీద వాలాడు.

మళ్ళీ వాసుదేవ వచ్చి చూసే సమయానికి సిద్ధార్థ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

ఓమ్

అతని గుండెలోని గాయం రేగుతూనేవుంది. ఎందరినో నది దాటిస్తున్నపుడు చాలామంది వారి సంతానంతో కలిసి ప్రయాణించేవారు. వారిని చూస్తే అతనికి ఏదో అసూయ కలిగేది. "ఏమిటిది అందరూ, ధనికులు, పేదవారు, దొంగలు, దుష్టులు కూడా తమ సంతాన ప్రేమ పొందగలుగుతున్నారే, మరి తనకు ఈ దురదృష్టమేమిటి?' అని వాపోయేవాడు. ఈ ఆలోచనతో అతను సామాన్యుల స్థాయికి చేరాడు. ఇప్పుడు వారందరూ అతనికి ఇదివరకటికంటే భిన్నంగా కనపడుతున్నారు. మామూలు జ్ఞానంతో, సాధారణ తెలివిడితో ఎంతో ఆత్మీయతతో, సానుభూతితో, ఆతృతతో, బ్రతుకు ప్రేరణతో, కోర్కెలతో అతనికి ఎంతో చేరువగా కనపడుతున్నారు. ఇప్పుడు వీరందరూ తన తోటివారనుకోగలుగుతున్నాడు. వీరి చిన్నచిన్న ఆశలు, పంతాలు, పోట్లాటలు, వస్తువుల కోసం ఆరాటాలు ఇవన్నీ అతను బాగా అర్థంచేసుకోగలుగుతున్నాడు. ఈ సామాన్యమైన విషయ సంచితాలలో అతను గాఢమైన జీవన సంక్షోభం, ఎంతో శక్తివంతమైన సహనశీలం చూడగలిగాడు. ఈ జీవచైతన్యంలో అనాశకరమైన ఆత్మను దర్శించాడు. జ్ఞానులకంటే, మౌనులకంటే ఈ జనులు దేనిలో తక్కువ? ఒక అద్వైత స్పృహ ఏకైక విశ్వాత్మ అనే అవగాహనలోనా? అయినా ఆలోచన ఎంతవరకూ అవసరం?

ఈ ఆలోచనతో సిద్ధార్థునికి ఆత్మ జ్ఞానం తన సుదీర్ఘ అన్వేషణా మార్గం తన అనంత గమ్యం – ఇవన్నీ తేటతెల్లమవుతున్నాయి. అన్నిటికీ ఆత్మను సన్నద్ధం చేయగలగాలి. ఆలోచనలు, అనుభూతి, శ్వాస, ధ్యాస ఇవన్నీ ప్రతి క్షణం జీవన ప్రవాహంలో ఏకమైపోవాలి. విశ్వ శక్తిలో మమేకం కావాలి. ఈ ఆలోచనే అతనిలో పరిపక్వ స్థాయికి చేరింది.

సరళము, సమతుల్యము, సంపూర్ణము అయిన అద్వైత విశ్వాన్ని దర్శిపగలుగుతున్నాడు. అదే వాసుదేవుని ముఖంలో ప్రస్ఫుటంగా గోచరిస్తోంది.

ఇంకా ఎక్కడో ఎదలోతుల్లో గాయం మండుతూనేవుంది. ఈ బాధలోని మాధుర్యం అతను ఆస్వాదిస్తున్నాడు. ఈ అనురాగ దీపం అంతలోనే ఆరిపోయేది కాదని తెలుసుకున్నాడు. ఈ వేదనతో ఒకనాడు కొడుకును చూసేందుకు నది దాటి ఆవలి గట్టుకు చేరాడు. పుత్ర పరిష్వంగ సుఖం కోసం మనసు ఆరాటపడగా, ప్రేమానలం లోలోన దహించగా నదీప్రవాహం దాటి ఒడ్డున నిలిచాడు. ప్రశాంతంగా, నిలకడగా నది ప్రవహిస్తోంది. వేసవి కాలంలో నది చిక్కిపోయి నిర్మలంగా నడుస్తోంది. అతనికి నది పెద్దగా నవ్వినట్లు అనిపించింది.

అతనిని చూసి స్వచ్ఛంగా, సంతోషంగా నవ్వుతోంది. అతను చేతలుడిగి వింటున్నాడు. ఇంకా స్పష్టంగా దగ్గరగా వినాలని నీటిలోకి తొంగిచూశాడు.

అతని ప్రతిబింబం నీటిలో ఊగులాడుతూ, తేలుతూ అతన్ని చూసి నవ్వుతోంది. గుర్తుపట్టలేక సతమతమయ్యాడు. తను మరిచిపోయిన ఎన్నో సంగతులు గతంలో నుంచి ప్రవహిస్తున్నాయి. తన ప్రతిబింబంలో తన తండ్రి దీనంగా చూస్తున్నాడు. తనని వదిలి అడవులలోకి వెళ్ళిన కొడుకు కోసం పడిన వేదన కనపడుతోంది.

ఆ వేదనతో తన తండ్రి ఎప్పుడో కన్నకొడుకుని చూడలేకనే తనువు చాలించి తరలిపోలేదా? ఇప్పుడు తను అనుభవిస్తున్న బాధ అటువంటిదేకదా! ఇవన్నీ మళ్ళీ తిరగ రాయాలా? ఈ విధి ఈ విధంగానే ఆవృతమవుతుండాలా?

అందుకేనా ఈ ప్రకృతి నవ్వుతోంది? చివరి వరకూ కర్మఫలాన్ని అనుభవించక తప్పదని, అప్పటివరకూ పునరావృతమవుతూనే ముగుస్తుందని దీని మర్మమా? ఈ పెనుగులాటలో, ఈ తెగని బంధంతో, ఈ మాయని గాయంతో మళ్ళీ నది దాటి కుటీరం చేరాడు.

తన హృదయావేదన, పుత్ర వియోగపు దుఃఖాన్ని వాసుదేవునికి చెప్పుకోవాలని వచ్చాడు.

వాసుదేవ బుట్ట అల్లుతూ కూర్చున్నాడు. ఇప్పుడు చేతులలో సత్తువ తగ్గి పడవ నడపలేక గుడిసెలోనే కాలం గడుపుతున్నాడు. అతని ప్రక్కనే కూర్చొని

సిద్ధార్థ తన నివేదన, కొడుకు కోసం తన యాతన, ఆరాటం, తపన, తన అంతఃసంఘర్షణ నీటిలో తన ప్రతిబింబం, తన దర్శనం అన్నీ చెప్పాడు. వర్షంలో చెట్టులా వాసుదేవుడు అతని బాధామయ గాథను తనలో మమేకం చేసుకున్నాడు. అతని కర్మలన్నిటినీ నదిలో కడిగినట్లు అతను అవగాహన చేసుకున్నాడు. అన్నీ స్వీకరించాడు. వాసుదేవ – అతనే ఒక ప్రవాహంలా, ఒక నిశ్చల ప్రవాహంలా సారూప్య పరమాత్మలా సిద్ధార్థునికి కనిపించాడు. ఇప్పుడు స్పష్టంగా వాసుదేవుని దైవత్వాన్ని వీక్షించగలుగుతున్నాడు. అతను ఎప్పటి నుండో ఆ విధంగానే ఉన్నాడు కానీ తాను ఇప్పుడు మాత్రమే గుర్తించగలిగాడు.

"సిద్ధార్థ, నీవు వినవలసింది ఇంకా ఉంది. వెళ్దాం రా. విందాం పద" వాసుదేవుడు అన్నాడు.

ప్రవాహపుటంచులో నిలబడి విన్నారు. సిద్ధార్థుడు ఎంతో శ్రద్ధగా విన్నాడు. ఎంతో మృదువుగా ప్రతిధ్వనిస్తోంది నది. నీటిలోకి చూశాడు. తన తండ్రిని, కొడుకు కోసం ఒంటరిగా కుమిలిపోతున్న తన తండ్రిని, తన అనురాగ బంధాన్ని తెంపి, తనయుడు పారిపోగా బాధలో మునిగివున్న తనను, తన కొడుకు ఒంటరిగా, ఈ ప్రపంచంలోనికి, కోర్కెల నిప్పుల దారిలో తన గమ్యాన్ని వెతుక్కుంటూ పోతున్న, తన కొడుకును చూశాడు. ప్రతి ఒక్కరూ కష్టాల కడలి ఈదుకుంటూ పరుగులు పెడుతూనే ఉన్నారు. ఈ నదిలాగా, రాళ్ళలో, కొండచరియల్లో జలపాతాలలో, చివరికి సముద్ర గర్భంలోకి చేరినట్లు.

"శ్రద్ధగా విను సిద్ధార్థ."

అవును. ఇప్పుడు అన్నీ అందరూ ఒకటిగా కలగలసి ఏకాకృతిలో ప్రవహిస్తున్నారు. కమల, గోవింద అందరూ నదిలో భాగమైన ప్రవాహంలో కలిసిపోతున్నారు. తరగని వాంఛలతో, తీరని కోరికలతో అంతులేని దుఃఖంతో గాయాల పచ్చితో తమ గమ్యంవైపు ప్రవహిస్తున్నారు. ఈ ప్రవాహం వేగంగా, తన అలలుగా సాగరంలో కలిసి ఆవిరిగా, మేఘాలుగా, వర్షంగా మరలా వస్తోంది. క్రొత్తగా, ధారగా, సెలయేరుగా ప్రవాహంగా, నదిగా ఉరకలెత్తి మళ్ళీ సముద్రంలో కలుస్తోంది.

అన్ని శబ్దాలూ, వేనవేల స్వరాలు, అన్ని సుఖాలు అన్ని వేదనలూ కలకలిసి ఒక జీవనరాగం, జీవిత సంగీతం వినిపిస్తోంది.

సిద్ధార్థ పూర్తిగా నిమగ్నమయి వింటున్నాడు. తనలో ప్రతిధ్వనించే ఈ వేయి స్వరాల సంగీతం ఏమిటిది?

తనను, తన ఆత్మను ఇప్పటివరకు తాకలేని ఈ స్వరాలు ఏమిటి?

అప్పుడు ఒక్కసారిగా బృందగానంలో అన్ని స్వరాలు మమేకమయి ఒక్క స్వరంగా, ఒక్క స్వనంగా 'ఓం' సంపూర్ణమయి అతనిలో ఇంకిపోయింది.

"విన్నావా, సిద్ధార్థ" వాసుదేవుని నవ్వు వింతగా వెలుగు చిమ్ముతోంది.

ఓంకార నిస్వనం అక్కడి వాతావరణమంతా నిండి మార్మోగుతోంది. సిద్ధార్థ హృదయంలోని గాయం ఇప్పుడు బాధించటంలేదు. అతని అహం అనంతంలో తాదాత్మ్యం చెందింది.

ఇప్పుడు కోర్కెల సందిగ్ధత లేదు. ఏదో జ్ఞానోదయంతో అతని ముఖం తేజోవంతమైంది. ఇప్పుడు ఈ ప్రవాహంతో, ఈ ప్రకృతిలో సమతాళంగా అతని హృదయరాగం ధ్వనిస్తోంది.

వాసుదేవుడు సిద్ధార్థునిలోని మార్పును, పరిపక్వతను గమనించాడు. "ఈ క్షణం కోసమే నేను ఎదురు చూస్తున్నాను. మిత్రమా, చాలాకాలం పడవ నడిపే వాసుదేవునిగానే జీవించాను. ఇక నేను నిష్క్రమిస్తాను. సెలవు మిత్రమా" అంటూ.

అతను నెమ్మదిగా అస్తమించే సూర్యునివేపు కదిలాడు. సిద్ధార్థ ఆవేదన, ఆనందం కలగలిసిన భావనతో వాసుదేవుని నిష్క్రమణ చూశాడు. అతని ప్రతి అడుగు ఎంతో ప్రశాంతంగా, అతని దేహం ఎంతో తేజస్సుతో కదిలింది.

దిగంతాలకు వాసుదేవ

గోవింద

గోవింద, తన నిరంతర సంచారంలో ఒక దినం కమల వసంత వనంలో విశ్రాంతికై ఆగాడు. అప్పుడే తోటలో భిక్షువులు చెప్పగా విన్నాడు. అక్కడికి దగ్గర్లోని నది, పడవ, వృద్ధసరంగుని గురించి. అతని గూర్చి ఏవో కథలు చెప్పేవారు. అతడు మౌని అని ప్రశాంతుడని పూజ్యనీయుడని.

ఆయనను చూడాలని కోరికతో గోవింద అడవి దాటి నదిని చేరాడు. గోవిందుని ప్రయాణం కూడా ప్రశాంతంగా లేదు. అతని అన్వేషణ అగమ్యంగానే సాగుతోంది. అతని అంతరాంతరంలో అశాంతి, అలజడి రేగుతూనే ఉన్నాయి.

నది ఒడ్డున పడవ, ముదుసలి సరంగుని, ప్రవాహం దాటించమని అడిగాడు. అవతలి గట్టుకు చేరిన తర్వాత "మీరు ఎంతో దయగలవారు. భిక్షువులను, సన్యాసులను కరుణతో నది దాటిస్తున్నారు. మీరు కూడా ఏదైనా అన్వేషణలో ఉన్నారా?"

గోవిందుని మాటలకు సిద్ధార్థ చిరునవ్వు నవ్వి "మీ అన్వేషణలో, మీ పవిత్ర మార్గంలో ఎంత దూరం వచ్చారు? ఇప్పటికే మీకు వయసు మీరి పోయినట్లున్నది కదా? చాలాకాలంగా బౌద్ధ భిక్షువుల దారిలో ఉన్నారు కదా?"

"అవును నిజమే. కానీ ఈ సత్యాన్వేషణ, నిత్యాన్వేషణే. అదే నా గమ్యమేమో!

"మీ గురించి చెప్పండి" గోవిందుడన్నాడు.

''నేనేమి చెప్పగలను? కానీ మీరు అన్వేషించటంలోనే కాలం గడుపుతున్నట్లుంది. ఆ కారణంగానే మీ గమ్యాన్ని చేరలేకపోతున్నారేమో."

"అదెలా?" గోవింద.

"ఎవరైనా, ఏదైనా అన్వేషించే సమయంలో వారికి గమ్యం మీదే దృష్టి ఉంటుంది. వారు దారిలో ఏమీ చూడలేకపోతున్నారో తెలియదు. దృష్టంతా

గమ్యంమీదే ఉంటుంది. అందుకే, మరేమీ చూడరు. స్వతంత్రంగా, స్వేచ్ఛగా పయనించేవానికి అన్నీ దర్శనమిస్తాయి, అన్ని అందాలు ద్యోతకమౌతాయి."

"మీరు చెప్పేది వివరంగా తెలియజేయండి."

సిద్ధార్థుడు నవ్వి "ఎన్నో సంవత్సరాల క్రితం మీరు ఇక్కడికి వచ్చారు. ఒక నిద్రించే యాత్రికునికి కాపలా ఉన్నారు."

"సిద్ధార్థా! నిన్ను ఇప్పుడు కూడా గుర్తుపట్టలేదు సుమా!

"నీవు పడవ నడుపుతున్నావేమిటి?"

"అవును గోవిందా? జీవితంలో ఎన్నో వస్త్రాలు మారుస్తుంటాము. అన్నీ మారుతుంటాయి. ఈ రాత్రి ఇక్కడ ఉండరాదూ?"

గోవిందుడు ఆ రాత్రి అక్కడే ఉన్నాడు. సిద్ధార్థుని ఎన్నో విషయాలు అడిగి తెలుసుకున్నాడు. వాసుదేవుని మంచం మీద నిద్రించాడు. ఆ మర్నాడు వెళ్ళేందుకు సిద్ధమవుతూ,

"ఒక్కమాట చెప్పు సిద్ధార్థ!

"నీకేమైనా ఒక సిద్ధాంతమో, ఉపదేశమో ఉన్నదా? నీ జీవన విధానంలో నిన్ను నడిపే విద్య ఏదైనా నేర్చావా?"

"నీకు తెలుసు మిత్రమా. నాకు సిద్ధాంతాలన్నా అవి చెప్పే గురువులన్నా అంత నమ్మకం లేదని, కానీ నేను ఎందరి దగ్గరో ఎన్నో నేర్చుకున్నాను. ఈ జీవన గమనంలో, తండ్రి దగ్గర, శ్రమణుల నుండి, కమల సాంగత్యంలో కామస్వామి వ్యాపారంలో, జూదగాళ్ళ జిత్తులలో, నేను నిద్రపోయినపుడు నాకు కావలిగా ఉన్న బౌద్ధ సన్యాసి దగ్గర అందరి నుంచీ నేర్చుకున్నాను.

"కానీ ఈ నది, నాకు ఈ పడవ నడపడం వారసత్వంగా ఇచ్చిన వాసుదేవుడు నాకెంతో నేర్పారు. ఆయన చాలా సామాన్యుడు. ఏ విద్యా లేనివాడు కాని ఏది అవసరమో గుర్తించిన పవిత్ర మూర్తి, యోగి. గౌతమునిలాగానే."

"సిద్ధార్థ, ఇంకా నీవు హాస్యంగానే చెప్తున్నావా? ఏ సిద్ధాంతమూ లేదంటావు, ఏ గురువూ లేదంటావు. కనీసం నీకు ఒక ఆలోచన, ఒక జ్ఞానం, ఎలా జీవించాలో, ఏది మంచి, ఏది చెడు, ఇదయినా చెప్పగలవా?"

"ఎంతో ఆలోచించాను గోవిందా! అవన్నీ తాత్కాలికమే. కానీ ఒక్క విషయం. వివేకం, జ్ఞానం ఒకరి నుండి వచ్చేది కాదు. విద్య మాత్రమే నేర్పదగినది. ఎవరైనా జ్ఞానాన్ని బోధిస్తున్నానని అంటే అది అసంబద్ధమే.

"నీవు సత్యమని నమ్మేదానికి వ్యతిరేకమైన దానిలో కూడా సత్యమే ఉంటుంది. ఏ సిద్ధాంతమైనా మాటలలోనే చెప్పాలి కదా. అంటే అది ఆ మాటలు పరిధిలోనే ఉండిపోతుంది. ఒక పార్శ్వమే తెలియజేస్తుంది. అందులో సంపూర్ణత, సంబద్ధత ఉండదు కదా.

"గౌతముడు అందుకనే ఈ ప్రపంచాన్ని రెండుగా విభజించాడు. ఒకటి సంసార జీవితం, రెండోది సన్యాస మార్గం. అందులోనే నిర్వాణ మార్గం బోధించాడు.

"సత్యాసత్యాలు జీవన్ముక్తులూ విడదీయకపోతే అవి అర్థం అయ్యేట్లు బోధించడం సాధ్యంకాదు.

"కానీ ఈ ప్రపంచం ఒక్కటే మన చుట్టూ ఉన్నది. ఏకమైనదీ, అద్వైతమైనదీ. అందులోనే అన్నీ ఇమిడి ఉన్నాయి.

"నీవు ఎప్పుడూ లౌకిక జీవితం నుంచి విడిపోలేవు. అలాగే, పూర్తిగా సన్యాసివీ కాలేవు. మనం, కాలం సత్యమనే భ్రమలో ఉంటాము. మన దుఃఖానికి అదే హేతువు. కానీ గోవిందా, కాలమనేది సత్యంకాదు. అలాగే కాలము సత్యం కానట్లే లౌకిక జీవితానికీ, నిర్వాణానికీ మధ్య రేఖ కూడ సత్యం కాదు. అది కూడా భ్రమే."

"అదెలాగు సిద్ధార్థ?"

"విను మిత్రమా. నేను, నీవు అందరూ ఏవో దుష్కర్మలు చేసినవారమే. తర్వాత సన్యాసం స్వీకరించి ఏదో ఒకనాడు నిర్వాణం పొందేవారమే. కానీ ఆ 'ఏదో ఒకనాడు' అదే భ్రమ.

"కర్మననుభవించిన తర్వాత బుద్ధుడుగా పరిణామం చెందాడు అంటాం. కానీ మన ఆలోచనలో ఇది ఇమడకపోయినా–

"ప్రతి వ్యక్తిలోను అన్నీ అందరూ ఉంటారు. ఏదైతే భవిష్యత్తులో ఉందని భ్రమిస్తున్నామో అది అప్పటికే ఉన్నది.

ఈ ప్రపంచం అసంపూర్ణం కాదు. అది పరిపూర్ణమైనది. అది ప్రతి క్షణంలోనూ ప్రతి సంఘటనలోనూ సంపూర్ణమైనదే.

“చిన్నపిల్లలలో వార్ధక్యం దాగి ఉన్నట్లు పాలుతాగే పసివాడిలో మృత్యువు కూడా పొంచివుంటుంది. అలాగే మరణించేవారందరూ అనాశకరమైనవారే. ఇది అనంత భ్రమణం.

“నీవు గాఢమైన యోగనిష్ఠలో అన్ని సమయాలూ సమదృష్టితో దర్శించగలవు. అప్పుడు అన్నీ సక్రమంగా, పరిపక్వంగా, సంపూర్ణంగా దర్శనమిస్తాయి.”

సిద్ధార్థ కొద్దిగా ముందుకు వంగి ఒక రాయిని తీసి చేతితో పట్టుకున్నాడు.

“ఇది ఒక శిలయేకదా. కానీ కాలగమనంలో అదే ధూళిగా మారవచ్చు. తరువాత ఒక మొక్కగా ఒక మనిషిగా కూడా పరిణామం చెందవచ్చు.

“పూర్వం నేను కూడా ఇలాగే అనుకొనేవాడిని. ఇది రాయి తరవాత దుమ్ము తరవాత ప్రాణిగా మారుతుంది. ఈ మాయపరిణామంలో రాయికి విలువ లేదని, ప్రాణికి ఆత్మకే విలువుందని తలచేవాడిని. కానీ గోవిందా, ఇప్పుడు ఈ శిలాకృతిలోనే నాకు సర్వమూ దర్శనమిస్తున్నాయి. అన్నీ అందులోనే కలిగి ఉండటంలోనే మర్మమంతా దాగివుంది. ఆ విధంగానే నేను గౌరవిస్తున్నాను.

“అందుకే ప్రేమిస్తున్నాను. అందుకే ఎంతో విలువగల విషయంగా పరిగణిస్తున్నాను. ప్రతి అణువులోనూ దైవత్వాన్ని, ఓంకారాన్ని వింటున్నాను. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను. ఎందుకంటే ఆలోచనలను మాటల పరిధిలో ఇమిడ్చి సంకోచింప చేయలేము. అవి శబ్దరూపంలోకి రాగానే అర్థాలు కూడ అసంబద్ధంగా అనిపిస్తాయి. అంతేకాదు గోవిందా. నేను జ్ఞానమని అనుకునే విషయం మరొకరికి అసంగతమూ, నిరర్థకమూ అయినదిగా తోచవచ్చు. ఇది కూడా నేనానందంగానే స్వీకరిస్తాను.”

“ఈ శిల గురించి ఎందుకు చెప్పావు సిద్ధార్థ?”

“అది యాధృశ్చికమే గోవిందా. ఈ శిలలు, ఈ నీరు, ఈ చెట్లు, ఈ లతలు అన్నీ ప్రేమించదగినవే. కానీ మాటలను ప్రేమించలేముకదా. అందుకనే బోధనలు నాకేమీ రుచించలేదు. అవి కేవలం మాటలుగానే మిగిలిపోతున్నాయి. వాటిలో వస్తురూపం, పదార్థ విధానం, రంగుల కలయికలు, రుచుల భేదాలు, గంధ వైవిధ్యాలు ఏమీ ఉండవు కదా.

"ఆలోచనలు ఎక్కువైనకొలదీ, అన్వేషణ సాగినకొలదీ మాటలు, పదాలు, పంక్తులు పెరిగిపోతున్నాయి. చివరికి ఈ సంసారం ఈ సన్యాసం ఈ నిర్వాణం కూడా కేవలం పదాల ధ్వనిగానే తోస్తున్నది. నిర్వాణమనేది ఒక విషయమా? అది ఒక పదమనే అనిపిస్తోంది."

గోవిందుడు "నిర్వాణమనేది ఒక పదం కాదు. సిద్ధార్థ! అది ఒక దివ్యమైన ఆలోచనా పథం!"

"కావొచ్చు మిత్రమా. కానీ నీ ఆలోచనకు, పదాలకు అంతగా వ్యత్యాసం ఉన్నట్లు అనుకోను. ఇంకా చెప్పాలంటే ఈ ఆలోచనలకే అంత ప్రాముఖ్యత లేదేమో.

"కానీ ఒక వస్తువుకే, ఒక పదార్థానికే ఎక్కువ ప్రాముఖ్యత ఉందేమో. ఇక్కడ నివసించిన వాసుదేవుడు ఈ నదీ ప్రవాహాన్నే ఆరాధించాడు. అతనికి ఇంకేమీ ముఖ్యమనిపించలేదు. ఈ ప్రవాహ శబ్దాలే అతనికి అన్నీ నేర్పాయి. ఎంతో కాలం అతనికి ఈ పరిసరాలు, ఈ పాలపిట్టలు, పచ్చని చెట్లు అన్నీ నదిలోనే కనిపించేవి. ఈ నదీప్రవాహమే అతనికి సర్వమూ నేర్పినట్లు, అతని నిష్క్రమించే సమయానికి ఏ గ్రంథాలూ ఏ గురువులూ ఏ బోధనలు తెలియచేయలేని జ్ఞానంతో ఈ ప్రకృతితో మమేకమైనాడు."

"సిద్ధార్థ, నీవు ఏదైతే పదార్థమంటున్నావో అది సత్యమేనా? వాస్తవమేనా? అది కేవలం 'మాయ', 'భ్రమ.' రూపం ఒక్క ఛాయ మాత్రమే కాదా? నీవు చూపిన శిల, ఈ చెట్టు ఇవన్నీ సత్యరూపాలా?"

"ఇది కూడా నాకు అంతగా సంక్లిష్టమైనదిగా కనిపించదు గోవిందా. అవి భ్రమలే అయితే, నేను కూడా భ్రమనే కదా. అందుకే నా నుంచి దేనినీ విడదీసి చూడలేదు. ఆ కారణంగానే అన్నిటినీ ప్రేమించగలుగుతున్నాను.

"ఈ ప్రేమ తత్త్వమే నా సిద్ధాంతమంటే నవ్వుతారేమో గోవిందా!

"మేధావులు ఆలోచనాపరులు ఈ ప్రపంచాన్ని పరిశోధించవలసిందే, వివరించవలసిందే, తిరస్కరించవలసిందే.

"కానీ అంతిమంగా ప్రేమించదగినది, పరిగణనలోనికి తీసుకోవలసింది ఈ ప్రపంచమేకదా. అందులో భాగమైన సర్వ ప్రాణులు అసంఖ్యాక వస్తుసముదాయము ప్రేమించదగినవీ, గౌరవించదగినవేకదా."

“శాక్యముని, దీనినే భ్రమ అని సెలవిచ్చారు. ఆయన బోధించింది కరుణ, ధర్మగుణం, దయాళువైన, సహన శీలమైన, సానుభూతిపరమైన, భరించగలిగిన వ్యక్తిత్వమేగాని ప్రేమ బంధాల నుంచి మానవాళిని విముక్తి చేయటమేకదా ఆయన మార్గం?!” గోవిందుడన్నాడు.

“గోవిందా, ఇక్కడే మనం మాటల వలయంలో, అర్థాల నీడల్లో సంక్లిష్ట సమాసాలలో పడిపోతున్నాం. గౌతముని బోధనలకు నా ప్రేమ విచారానికి వ్యత్యాసం లేదని అనుకోను.

అందుకనే ఈ పదాల అర్థాలను అంతగా నమ్మను. ఈ విరుద్ధ భావన కూడా భ్రమ మాత్రమే. గౌతముని ప్రేమ భావాన్ని ఎలా కాదనగలము? ఈ మానవాళిని నిరంతర పరిణామ సంకటం నుంచి రక్షించేందుకు, విముక్త పరిచేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్ముని, కరుణామయుని, ఎలా అర్థంచేసుకొంటావు?

“కోర్కెలతో శోకమయమైన జనావళికి నిర్వాణ మార్గం బోధించిన గౌతముని, ఆయన కార్యాచరణ పథాన్ని ఎంతో గౌరవిస్తాను. ఆయన బోధనలు, అభిప్రాయాలకంటే కూడా.”

“సిద్ధార్థ, నీ ఆలోచనలు కూడా నాకంతంగా అంతుబట్టటంలేదు.

“ఏమైనా నీ జీవితం ప్రశాంతంగా సాగాలని కోరుకుంటున్నాను.

లోలోన గోవిందునికి సిద్ధార్థ వింతగా, పవిత్రంగా, ప్రశాంతంగా కనిపించాడు.

గౌతముని నిర్యాణం తర్వాత తాను ఇంతటి ప్రశాంత మూర్తిని ఎవ్వరినీ కలవలేదు. వారిద్దరి అభిప్రాయాలు భాష, ఆలోచన వేరైనా ఇద్దరూ పవిత్ర మూర్తులే.

సిద్ధార్థ నయనాలు, అవయవాలు, శ్వాస, చిరునవ్వు ఎంతో దివ్యంగా, అనిపించసాగాయి. అవును. ఇతను పవిత్రమూర్తే. ఇతను ఆలోచనలు తనకు అర్థంకావలసిన అవసరమేముంది? కానీ ఇతని అవలోకన, కదలిక, ప్రతి అవయవం ఏదో వెలుగుతో నిండివుండటం గమనించాడు. ఈ పవిత్రత, ప్రశాంతత, కరుణ ఇవన్నీ గౌతమునిలో తాను గమనించినవే.

అయినా అతని హృదయంలోని సంఘర్షణ భావ సంక్లిష్టత అంతంకాలేదు. ఎంతో గౌరవంతో సిద్ధార్థునికి అభివాదంచేసి "సిద్ధార్థ, ఇప్పుడు మనమిద్దరం వయసు పైబడినవారమే. మరల కలిసే అవకాశం ఉంటుందని అనుకోను.

"కానీ మిత్రమా, నీవు శాంతిని పొందగలిగావు. అది స్పష్టంగా నాకు అవగాహన అవుతోంది! కానీ అదే నాకు ఎండమావిలా దూరమౌతోంది.

"నాకు అర్థమయ్యేమాట, నా బాటలో నాకు బాసటగా నిలిచే ఒక్క పదం నాకు వినిపించు మిత్రమా. నా ఈ కఠినమైన, అంధకారమయమైన మార్గంలో ఎన్నాళ్ళు ప్రయాణించను?"

సిద్ధార్థ చిరునవ్వుతో అతనిని నిశ్శబ్దంగా పరికించాడు. గోవిందుడు ఆతృతగా, దీక్షగా, నిరీక్షణతో, బాధ, అలసట మిళితమైన భావనతో సిద్ధార్థుని చూశాడు.

అది గమనించి "రా మిత్రమా. దగ్గరగా, ఇంకా చేరువగా రా. నా నుదుటని నీ పెదవులతో చుంబించు, గోవిందా."

ఈ మాటలకు ఆశ్చర్యపోతూ తెలియని ఆకర్షణతో సిద్ధార్థుని ప్రేమ, ఆప్యాయతలకు తెలియకుండానే తలొగ్గి తన ఎండిన పెదవులతో అతని ఫాల భాగాన్ని తాకాడు.

అతనికి ఒక్కసారిగా ఏదో అద్భుతం జరిగినట్లు, తనలో సిద్ధార్థుని ఆలోచనలపట్ల వ్యతిరేకత, సంసార నిర్వాణం ఒక్కటే అంటున్న అతని అసంబద్ధపు మాటలు త్రోసిపుచ్చాలనుకుంటూనే, అతని ప్రేమతో ఆకర్షితుడౌతూనే ఈ అద్భుతానికి లోనయ్యాడు. అతనికి సిద్ధార్థుని మోము కనపడటంలేదు. ఆ సన్నివేశంలో ఎందరివో ముఖాలు, ఎన్నో సంఘటనల పరంపరలూ, మరెన్నో జీవన ప్రవాహాలు అన్నీ కలగలసి దృశ్యాదృశ్యంగా, ఉంటూ లేకుండా, మారుతూ మారకుండా, క్రొత్తగా ఉద్భవిస్తూ, మళ్ళీ సిద్ధార్థునిగా దర్శనమిస్తున్నాయి.

సర్వ ప్రాణులు జనన మరణాలు, రాజులు, దొంగలు, పసివాళ్ళు, ముసలివాళ్ళు, ఎంతో హింసతో మనిషిని కత్తితో పొడిచి చంపుతున్న మరో మనిషి, ఈ అపరాధి తల నరుకుతున్న మరో తలారి, శృంగారకేళిలో అంగవిన్యాసాలతో స్త్రీ పురుషులు, మృత్యుశయ్యపై శీతల పేటికల్లా, శూన్యంగా మరణించిన మరో ప్రాణి, మొసళ్ళు, ఏనుగులు, పిపీలికాలు, కీటకాలు, అగ్ని,

ఆకాశం అన్నీ అన్నీ అతని చిరునవ్వు తెర వెనుక పొరలు పొరలుగా కదులుతున్నాయి. జీవన పరిణామం, ప్రేమానురాగాలు, బ్రతుకు ఉచ్చులు అన్నీ సుడులు తిరుగుతూ క్రొత్తగా ఉద్భవిస్తున్నాయి. అన్నీ ఒకటిగా, అద్వైతంగా, ఏకంగా ఆ చిరునవ్వు వెనుక దివ్యజ్యోతిగా వెలుగుతోంది.

గోవిందునికి ఒక్కసారిగా గౌతముని అతి సున్నితము, నిత్యము, కరుణపూరితము, అంతర్లీనమూ అయిన చిరునవ్వు, అతను వేయిసార్లు గమనించిన ఆ చిరునవ్వు అతని స్మృతిపథంలో వెలిగింది. అతనికి ఏదో సంపూర్ణమైనట్లు అనుభూతి చెందాడు.

అక్కడ ఎన్ని క్షణాలు గడిచాయి. ఎన్ని సంవత్సరాలు దొర్లాయి? అక్కడ ఉన్నది సిద్ధార్థా, గౌతముడా?

ఈ దివ్యాస్త్ర ఘాతంతో అతనికి కలిగిన ఆనందం, గాఢమైన అనుభూతిని అతను తెలుసుకోగలిగాడు. సర్వమూ, వర్తమాన సమానమైన ఈ సంరంభాన్ని ప్రశాంతంగా దర్శించి, అక్కడ నిశ్చలంగా కూర్చొని సహజ శక్తితో వెలుగుతున్న ఆ తేజోమూర్తికి, అమూల్యమూ, పవిత్రమూ అయిన భావావేశంతో, వర్షించే కనులతో అభివాదం చేశాడు.

సిద్ధార్థ

జీవిత కాలాల కలయిక ఎక్కడ? సుఖదుఃఖాల ఆఖరి స్పర్శాస్మృతి ఏమిటి? ఏమిటీ అన్వేషణ – ఎందుకీ గవేషణ? ఇలాంటి నిరంతర ప్రశ్నల అంతర్మథనమే ఈ రచన! తరతరాలుగా మానవ మేధను వేధిస్తున్న చింతన. వెన్నెల అక్షరాకృతికి స్మృతి అయితే, ఆ స్మృతి స్పర్శే ఈ అక్షరపుంజము! రచయిత భావోన్నతికి రిరంస!....

– పురాణపండ రంగనాథ్

ఆత్మ సాక్షాత్కారాన్ని ఆశించే ప్రతి ఒక్కరూ చదవవలసిన రచన **సిద్ధార్థ**. రచనలో, భావ వ్యక్తీకరణలో ఇది అచ్చపు తెలుగు రచనగానే అనిపించింది...

– యార్లగడ్డ బాలగంగాధరరావు

ఇందులో సన్నివేశాలు, సందర్భాలు, ప్రకృతి పరిసరాలూ అన్నీ కల్పితాలే అయినా, ఏ ఒక్కటీ భౌతిక వాస్తవ పరిధిలో ఆగిపోదు. ప్రతీకగా విస్తరిస్తుంది, వెంబడిస్తుంది.

భాష కూడా అంతే. ప్రతి వాక్యమూ తన ప్రాచీనతా పరిమళాలతో సహా ఆత్మాహుతి చేసుకుని ఒకానొక అలౌకిక – తాత్త్విక అంతర జగత్తులో అర్థవంతంగా పునరుత్థానం చెందుతుంది...

– బేతవోలు రామబ్రహ్మం

ప్రతీ శాస్త్రానికీ తనదైన భాష ఉంటుంది. ఆ భాషలో చెబితేనే దానికి సొబగు చేకూరుతుంది. ఈ తాత్త్విక నవలకు కావలసిన పదాలు ఆసాంతం పుష్కలంగా ఉన్నాయి.. వాక్యం నడక అద్భుతం. కొండ నుంచి దూకే ప్రవాహం...

– అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి

అందమైన పదాలను తగు రీతిలో పొదిగి అద్భుత వాక్య నిర్మాణం చేయటం అశ్వినీ ప్రత్యేకత. తిక్కన మహాభారత అనువాదంలా ఈ **సిద్ధార్థ** అనుశీలన మూలానికి కొత్త అందాలను తీర్చిదిద్దింది...

– కాండ్రేగుల నాగేశ్వరరావు

Vallabhaneni Aswinikumar

Author :

01. Amaaha (Short Stories in Telugu)

02. Doora Theeraalalo (Travelogue)

03. Antharveekshanam (Essays)

04. Paarijaatam (Short Stories)

05. Naalo Nenu (Poetry)

06. Anantharangam (Poetry)

07. Siddhartha (Herman Hesse - In Telugu)

08. Agaadham (De Profundis - Oscar Wilde)

09. O Khaidi Veeragaadha (Ballad -Oscar Wilde)

10. Misimi Essays

11. Charlie Chaplin (Autobiography in Telugu)

12. Ariel (Shelley's Romance in Telugu)

13. D.D. Interviews

14. Prometheus Unbound (Shelley's Drama)

15. Adonais (Telugu - An Elegy by Shelley)

16. Byron Biography (Telugu)

17. Keats Biography (Telugu)

18. Deevi (Novel)